20-9Pg1exHMNWJQE:20-9Pg1exHMNWJQE.qxd 9/19/2026 11:41 PM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-9-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 231 పేజీలు: 10+4 వెల: 8.00


పర్యావరణ పరిరక్షణలో భారత్ దిక్సూచి: ప్రధాని మోడీ

కిమ్ అణు పరీక్షలతో 1399 భూకంపాలు

5లో

# ఇక పేదలకు పట్టాభిషేకం

**28,445 కుటుంబాలకు ఇళ్లపై సంపూర్ణ హక్కులు**

**విశాఖ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

**పోలవరంతో గోదావరి జలాలు సరఫరా**

**భయం నుంచి భరోసా వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం**

**విశ్వనగరంగా విశాఖ అభివృద్ధి: సిఎం చంద్రబాబు**



శనివారం విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందజేస్తున్న సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** పేదల ఇళ్లపై దశాబ్దాలుగా కొనసాగుతున్న హక్కుల సమస్యకు ముగింపు పలుకుతూ 28,445 కుటుంబాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విశాఖలో శనివారం నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ పేదల ఇళ్లపై సర్వహక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు అందుతున్న వేళ వారి కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. కూడు, గూడు, గుడ్డ తమ ప్రభుత్వ నినాదమని, ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్నా మని చెప్పారు. ఇన్నాళ్లా తమ ఇళ్లపై హక్కు లేదనే బాధతో ఉన్న పేదలకు ఇకపై ఆభయం ఉండద న్నారు. ఇళ్లపై వివాదాలు, ఆందోళనలు లేకుండా పూర్తి హక్కులు కల్పిస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ధర ప్రకారం లబ్ధిదారులకు అందిస్తున్న భూముల విలువ రూ.8,874 కోట్లు ఉంటుందని సిఎం వెల్లడించారు. మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, విలువైన భూములను కేవలం మార్కెట్ ధర ఎక్కువగా ఉందనే కారణంతో విక్రయించవద్దని సూచించారు. ఆ భూమి పేద కుటుంబాలకు భరోసా, ధైర్యంగా నిలుస్తుందని అన్నారు.'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం ద్వారా రెవెన్యూ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తున్నామని చెప్పారు.

**పంచగ్రామాల సమస్య పరిష్కారానికి చర్యలు..**

>>2



## 100% సుంకాల చట్టానికి ట్రంప్ ఓకే

- రష్యా, ఇరాన్ ఆంక్షల బిల్లుపై సంతకం చేసిన యుఎస్ అధ్యక్షుడు
- భారత్, చైనా సహా పలు దేశాలపై తీవ్ర ప్రభావం
- జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి వారం ముందు సుంకాల బాంబు పేల్చిన అమెరికా
- ప్రజల ఇంధన భద్రతే తమకు ప్రధానమన్న భారత్

**వాషింగ్టన్, సెప్టెంబరు 19:** ఉక్రెయిన్ పై క్రెమ్లిన్ సాగిస్తున్న సుదీర్ఘ పోరాటానికి అవసరమైన ఆర్థిక మూలాలను పూర్తిగా అణచివేసే అత్యంత కఠినమైన వ్యూహంలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నారు. రష్యా ఇంధన, రక్షణ రంగాలు లక్ష్యంగా రూపొందించిన లిండ్సే ఓ గ్రాహం రష్యా, ఇరాన్ ఆంక్షల చట్టం 2026బిల్లుపై ఆయన సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం, పాశ్చాత్య దేశాల ఆంక్షలను ధిక్కరించి రష్యా నుండి భారీగా ముడి చమురు, సహజ వాయువులను కొనుగోలు చేస్తున్న భారతదేశం, చైనాలతో సహా ప్రధాన వినియోగదారుల ఉత్పత్తులపై ఏకంగా 100 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించే అపరిమితమైన అధికారాలను అమెరికా అధ్యక్షుడికి కల్పిస్తోంది. అమెరికా కాంగ్రెస్‌లో సుదీర్ఘ చర్చల అనంతరం ఈ చట్టం

>>2


## గరుడునిపై తిరుమలేశుడు

**అశేష భక్తజనం వీక్షిస్తుండగా గరుడునిపై ఊరేగిన గోవిందుడు**

**భక్తులకు భారీ భద్రతా ఏర్పాట్లు**

**తిరుమల,సెప్టెంబరు19, ప్రభాతవార్తప్రతినిధి:** పెరటాసి మాసం తొలిశనివారం సాయంత్రం తిరుమలలో ఏడుకొండలస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో గరుడవాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామి తనకిష్టమైన గరుడుని వాహనంగా చేసుకుని దివ్యమైన మంగళరూపంలో చల్లటి వాతావర

>>2





శనివారం సాయంత్రం తిరుమలలో కన్నుల పండుగగా సాగిన తిరుమలేశుని గరుడసేవ దృశ్యం

## కల్తీనెయ్యి కేసు సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాస్‌చంద్ అరెస్టు

**దర్యాప్తు ముమ్మరం చేసిన ఇడి**



**తిరుపతి, సెప్టెంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** 2020-24మధ్య తిరుమలకు లడ్డూల తయారీకి సరఫరా జరిగిన ఆవునెయ్యి కల్తీజరిగిందని, ఈ వ్యవహారంలో కీలకంగా దర్యాప్తు చేపట్టిన సిబిఐ సిట్ అధికారులు మరింత లోతైన విచారణకు ఇడికి అప్పగించిన విషయం విదితమే. ఇప్పటికే ఈకేసులో ప్రధాన సూత్రధారులు,పాత్రదారులను తేల్చి అరెస్ట్ చేసిన సిబిఐ ఆ తరువాత మరింత కీలకంగా దర్యాప్తులో ఇడికి అప్పగించింది. ఇప్పుడు ఇడి రెండునెలల క్రిందట నలుగురు ప్రధాన సూత్రదారుల ఆస్తులపై సోదాలు చేసి భారీగా రికార్డులు, నగదు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇదే కేసులో తాజాగా మళ్లీ సుకృతిఫుడ్స్ ప్రమోటర్ కైలాష్‌చంద్ మంగ్లాను ఇడి అరెస్ట్ చేయడం సంచల

>>2

## నరసాపురం వశిష్ట వారధికి గ్రీన్ సిగ్నల్

**రూ.299 కోట్లకు టెండర్ ఖరారు**

**720 రోజుల్లో నిర్మాణం**

**నరసాపురం, సెప్టెంబరు19 ప్రభాతవార్త:** దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నరసాపురం వశిష్ట గోదావరి నదిపై వారధి నిర్మాణానికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. వారధి నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తికాగా, జైపూర్‌కు చెందిన బిఆర్ఎన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ పనులు దక్కించుకున్నట్లు సమాచారం. రూ.419 కోట్ల అంచనా వ్యయానికి సంస్థ సుమారు 25 శాతం తక్కువగా రూ.299 కోట్లకు బిడ్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.

**నాలుగు సంస్థలు పోటీ:**

వారధి నిర్మాణ టెండర్‌లో నాలుగు సంస్థలు పాల్గొనగా, బిఆర్ఎన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ తక్కువ మొత్తానికి బిడ్ దాఖలు చేయడంతో టెండర్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. పనులను సుమారు 720 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

**భూసేకరణకు గతంలోనే రూ.60.00 కోట్లు**

వారధి బైపాస్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు హయాంలోనే రూ.60.0 కోట్లు విడుదలయ్యాయి. అనంతరం కోర్టులో దాఖలైన పిటిషన్ల కారణంగా పనుల్లో

>>2

# వికసిత్ భారత్ సాధనే ధ్యేయం

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఆర్థికంగా పటిష్టం**

**త్వరలో మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్**

**ఢిల్లీలో మీడియాతో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల**

**విజయవాడ, సెప్టెంబర్ 19,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఆర్థికంగా పటిష్టమయ్యే రంగాల్లో మంచి ఫలితాలు సాధించడం సాధ్యమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేసారు. విజన్ 2047 లక్ష్యాల సాధన కోసం దేశంలోనూ, వివిధ రాష్ట్రాలు తమ లక్ష్యాలను ఏ విధంగా నిర్దేశించుకోవాలన్నారు. ఆలక్ష్యాలను చేరుకోవడానికి ఆర్థిక వనరులను ఏ రకంగా సమీకరించుకోవాలి అనే అంశాలపై కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రులు నిపుణులతో అత్యున్నత స్థాయి బ్రెయిన్‌స్టార్మింగ్ సెషన్ జరిగినట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే సాధారణ నిధులకు భిన్నంగా, భవిష్యత్ అవసరాల కోసం అదనపు వనరులను ఎలా సమకూర్చుకోవాలనే కోణంలో ఈ సదస్సు ఉపయోగపడిందని ఆయన తెలిపారు. మంత్రి కేశవ్ న్యూఢిల్లీలోని ఎపి భవన్‌లో ప్రత్యేకంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కేంద్ర ఆర్థిక శాఖ నేతృత్వంలో అన్ని రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రులు, ప్రైవేట్ రంగ నిపుణులు, ఆర్థిక వేత్తలు, రిటైర్డ్ సీనియర్ బ్యూరోక్రాట్లతో కలిసి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు., ఇది ఒక గొప్ప శుభపరిణామమని ఆయన తెలిపారు. ఈసమావేశంలో ప్రధానంగా కీలక రంగాలపై దృష్టి పెట్టామని మంత్రితెలిపారు. వ్యవసాయ రంగంలో ఉన్న సవాళ్లు, ఆ రంగానికి కావలసిన పెట్టుబడులు, క్రెడిట్ ఫెసిలిటీస్, వాటర్ ఇంటిగ్రేషన్, రైతులకు ఎదురయ్యే క్లైమేట్ మార్పుల రిస్క్‌లను తగ్గించడంవంటి అంశాలపై చర్చించినట్లు చెప్పారు. అలాగే ఎనర్జీ రంగంలో అవకాశాలు, పబ్లిక్‌ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యాన్ని పెంచడంపై టాటా గ్రూప్, కోటక్ గ్రూప్ నిపుణులు, మాజీ ప్లానింగ్ కమిషన్ చైర్మన్ల సలహాలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. కొన్ని రాష్ట్రాల్లో విజయవంతమైన ప్రయోగాలను ఇక్కడ చర్చించామని, ఇది కేంద్రానికి, రాష్ట్రాలకు సమాజానికి భవిష్యత్తులో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హార్టికల్చర్ అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ.. సిఎం చంద్రబాబు సెప్టెంబరు చివరి వారంలో లేదా అక్టోబరు మొదటి



వారంలో మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రారంభోత్సవాన్ని నిర్వహించాలని భావిస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌నుకూడా ఆహ్వానించడం జరిగిందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన తేదీలు ఖరారు కానున్నాయని చెప్పారు. ఈసారి ఎల్నినో ప్రభావం దక్షిణ భారతదేశంలో చాలా తీవ్రంగా ఉందన్నారు. దీనివల్లతలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముందుగాఉన్న పంటలను కాపాడుకోవడం, మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి మార్గదర్శకాల మేరకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఒక గర్వం.. గుర్తింపు

**రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**



**విశాఖపట్నం, సెప్టెంబరు 19ప్రభాత వార్త :** మనిషి జీవితంలో పుట్టినరోజు, పెళ్లిరోజు, ఇతర శుభకార్యాలు ఎంత మంచి జ్ఞాపకాలను అందిస్తాయో.. అంతకన్నా ఎక్కువ అనుభూతిని ఉద్యోగం వచ్చిన మొదటి రోజు అందిస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒక గర్వం, ఒక గుర్తింపు అని పేర్కొన్నారు విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలోని కళావాణి ఆడిటోరియంలో శనివారం జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ఈ సమావేశంలో భాగస్వామ్యం అయ్యారు. దేశ వ్యాప్తంగా ఉద్యోగాలు సంపాదించిన 51000 మందికి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో 200 మందికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నియామక పత్రాలను అందించారు. వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన యువతను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు.ప్రభుత్వ ఉద్యోగం కోసం లక్షలాది మంది యువత ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి పోటీ వాతావరణంలో ఈరోజు ఉద్యోగాన్ని సాధించడం ఎంతో గొప్ప విజయమని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ విజయానికి వెనుక నిలిచిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సహకారాన్ని ఎప్పటికీ మర్చిపోకూడదని యువతకు సూచించారు. ఈ ఉద్యోగం మీ జీవితానికి, మీ వైవాహిక బంధానికి, మీ భవిష్యత్‌కు ఒక భరోసాను కల్పిస్తుంది. అయితే మీరు ఈ ఉద్యోగం ద్వారా ఏమి సాధిస్తున్నారన్న దానికంటే.. మీ ద్వారా ప్రజలు ఎంతగా లబ్ధి పొందుతున్నారన్నదే ముఖ్యమైన

>>2

## మరో అల్పపీడనం

**పలు జిల్లాలకు వర్షసూచన**

**విశాఖపట్నం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. రాగల 24 గంటల్లో ఉత్తరాంధ్ర, ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర అండమాన్ సముద్ర పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించింది. ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో అల్పపీడనం బలపడే అవకాశముంది. దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్రప్రదేశ్ తీరాల వైపు కదిలే అవకాశముందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని వాతావరణశాఖ హెచ్చరించింది.

## అక్టోబరు 1న కరవు మండలాల ప్రకటన

**పంట నష్టం లేకుండా ముందస్తు చర్యలు**

**వర్షాభావ పరిస్థితులపై సమీక్షలో సిఎం చంద్రబాబు**

**అమరావతి, సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను శాస్త్రీయంగా అంచనావేసి... అక్టోబరు 1న కరువు మండలాలను ప్రకటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కరువు మండలాలను గుర్తించడంతో పాటు ఎక్కడా పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై ప్రతీ నెలా కేంద్రానికి నివేదికలు పంపించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కరువు ప్రభావం, వ్యవసాయ-ఉద్యాన పంటల పరిస్థితి, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, పంటలను కాపాడేందుకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, తాగునీటి సరఫరాపై క్యాంపు కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. కరువు మండలాల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఆరుశాఖలనుంచి అందే సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని...వర్షపాతం, పంటల సాగు పరిస్థితి, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, శాటిలైట్ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నట్టు అధికారులు సిఎంకి వివరించారు.

**513 మండలాల్లో కరువు ఛాయలు..**

2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం 513 మండలాల్లో కరువు నెలకొందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో 268 మండలాల్లో పరిస్థితి తీవ్రంగాను, 245 మండలాల్లో మోస్తరుగా ఉందన్నారు. కరువు పరిస్థితులపై క్షేత్ర స్థాయి పరిశీలనను వ్యవసాయ

>>2

## 50 దాటిన నేతన్నలకు పెన్షన్లు

**అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు**

**సత్యసాయి జిల్లాలోని ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్‌కు మంత్రి సవిత ఆదేశం**

**అర్హులందరికి పెన్షన్లు అందుతాయని హామీ**



**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 50 యేళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేయడమే లక్ష్యంతో సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఎటువంటి అక్రమాలు, అవినీతి తావులేకుండా అర్హులైన నేతన్నలందరికీ పెన్షన్లు అందజేసేలా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ నేపథ్యంలో నేతన్నల దరఖాస్తుల పరిశీలనలో జరుగుతున్న చేతివాటంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో సదుద్దేశంతో సిఎం చంద్రబాబునాయుడు చేనేతలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న లక్ష్యాన్ని నీరు గార్చుతున్న అధికారులపై చర్యలు తీసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన పేరుతో పచ్చనోట్లకు కక్కుర్తిపడిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయించారు. తన క్యాంపు కార్యాలయంనుంచి శనివారం అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. నూతన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, నేతన్నల సేవలో పథకంపై అమలు తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన పెన్షన్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.వాటి పరిశీలిన గురించి ఆరా తీశారు. నూతన పెన్షన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16,521 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటికీ వెళ్లి అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 84 వేలకుపైగా చేనేతలకు పెన్షన్లు అందజేస్తున్నామన్నారు.

**అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం**

శ్రీసత్యసాయి, అనంతపురం సహా పలు జిల్లాల్లో దరఖాస్తు దారులనుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు తెలిసిందని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్, నేతన్నల సేవలో పథకం సహా పలు పథకాలను ఇటీవల

>>2



శనివారం న్యూఢిల్లీలో పర్యావరణ పరిరక్షణపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రధాని మోడీ

## నేతన్నలకు పెన్షన్లు

>> ప్రారంభించారన్నారు. ఇపుడు 50 యేళ్లు నిండిన చేనేతలకు నూతన పెన్షన్లు అందజేయాలని నిర్ణయించారన్నారు. అర్హులైన ప్రతి నేతన్నకూ పెన్షన్ అందజేస్తామని భరోసాఇచ్చారు. ఎటువంటి అపోహలకు నేతన్నలు గురికావొద్దని, ఎవ్వరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరంలేదని చేనేతలకు తెలిపారు. అర్హత ఉంటే ప్రభుత్వమే పెన్షన్ అందజేస్తుందని మంత్రి సవిత తెలిపారు.

**ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్**

శ్రీసత్యసాయి జిల్లాలో ఇద్దరు ఉద్యోగులు దరఖాస్తుల పరిశీలిన సమయంలో చేనేతల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసిందని మంత్రి సవిత మండిపడ్డారు. తాము ఇచ్చే అనుమతులతోనే పెన్షన్లు వస్తాయంటూ డీవో రమణారెడ్డి. ఏడీవో శీనా నాయక్ నేతన్నల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్న ఆ ఇద్దరు ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాను ఆదేశించారు. చేనేతల నుంచి వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు. మంత్రి ఆదేశాల మేరకు ఆ ఇద్దరు ఉద్యోగులనూ తొలగిస్తూ కమిషనర్ రేఖారాణి ఉత్తర్వులు జారీచేశారు.

## గరుడునిపై తిరుమలేశుడు

>> ణంలో శనివారం రాత్రి భక్తులను కటాక్షించాడు. ఐదవరోజు రాత్రి జగన్నాటకసూత్రధారి మలయప్పస్వామి గరుడునిపై విహరించారు. సాయంత్రం 6.30గంటలకు వాహనమండపంవద్ద గరుడవాహనాన్ని అధిరోహింపజేసిన మలయప్పకు అర్చకులు వేదఘోష్టితో కర్పూరహారతులిచ్చారు. చల్లటివాతావరణంలో వింజామరలు చల్లగా విసురుతుండగా భక్తుల గోవిందనామ్మరణల మధ్య భక్తకోటిని కరుణించడానికి ఆలయమాఢ వీధుల్లో ఊరేగారు. గరుడవాహనంద్వారా స్వామి దాసానుదాస ప్రపత్తికి దాసుడని స్వామి తెలియజేశారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజేశాడు. అర్ధరాత్రి 12.30గంటల వరకు మాఢవీధుల్లో వేచివున్న భక్తులందరికీ గరుడవాహన సేవ దర్శనం చేయించడంలో టిటిడి బోర్డు, అధికారులు సఫలీకృతులయ్యారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, శాంతారాం, భానుప్రకాశ్‌రెడ్డి, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఒ మురళీకృష్ణ,ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్ వర్మ,ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి,టిటిడి మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బెంగళూరుకు సిఎం

**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు ఈ నేడు బెంగళూరు వెళ్లనున్నారు. ఈ క్రమంలో బెంగళూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఎల్లుండి బెంగళూరు నుంచి కుప్పంకు సిఎం వెళ్లనున్నారు. ఈనెల 21,22 తేదీల్లో కుప్పంలో సిఎం చంద్రబాబు పర్యటించనున్నారు. గుండిశెట్టిపల్లి హంద్రీనీవా జలహారతిలో పాల్గొననున్నారు. కొత్తపేటలో పలు పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

## టీచర్ ఎమ్మెల్సీ స్థానాల ఓటర్ల జాబితాకు ఇసి ఆదేశాలు

**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ స్థానాల ఓటర్ల జాబితాకు ఇసి ఆదేశాలు జారీ చేసింది. వచ్చే యేడాది ఫిబ్రవరిలో రెండు ఎమ్మెల్సీ స్థానాల పదవీకాలం పూర్తి కానున్నాయి. తాజాగా ఓటర్ల జాబితా నవీకరణకు ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది.

## వశిష్ట వారధికి గ్రీన్ సిగ్నల్

>> జాప్యం చోటుచేసుకుంది. వారధి నిర్మాణం కోసం మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య, కొత్తపల్లి సుబ్బారాయుడు, బండారు మాధవనాయుడు తదితరులు కృషి చేశారు. ముఖ్యమంత్రి జగన్ హయాంలో వశిష్ట వారధికి శంకుస్థాపన కూడా జరిగింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఫైల్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయగా, కూటమి నాయకులు కూడా వారధి నిర్మాణంకోసం పట్టుదలతో ప్రయత్నాలు కొనసాగించారు. ఈ నేపథ్యంలో టెండర్ ఖరారు కావడంతో వారధినిర్మాణానికి మార్గం సుగమమైనట్లు తెలుస్తోంది.

## 'సుప్రీం'కు దానం అప్పీలు

### హైకోర్టు అనర్హత తీర్పును సవాల్ చేసిన దానం

### బిఆర్ఎస్, బిజెపి కేవియట్‌లు

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. తెలంగాణ హైకోర్టు తనపై ఇచ్చిన అనర్హత తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ శనివారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మధ్యాహ్నం ఆయన తరఫు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దానం నాగేందర్ పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పటికే బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా బీజేపీ కూడా హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసింది. దానం నాగేందర్ అప్పీల్‌పై ఎలాంటి ఆదేశాలు జారీ చేసే ముందు తమ వాదనలు కూడా వినాలని రెండు పార్టీలు కేవియట్ ద్వారా కోరాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీనిపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, దానం నాగేందర్‌పై స్పీకర్ అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పక్కనపెట్టి, 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు కోర్టు స్పష్టం చేసింది.

# ఇక పేదలకు పట్టాభిషేకం

>> సుమారు 22 వేల మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉందని, వారందరికీ త్వరలోనే పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేవాదాయ శాఖకు చెందిన భూముల్లో నివసిస్తున్న పేదలకుకూడా ఇంటి జాగా, ఆత్మగౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే వివిధ జిల్లాల్లో 12 వేల కుటుంబాలకు భూములను క్రమబద్ధీకరించి పట్టాలు అందించామని చంద్రబాబు తెలిపారు. గత రెండేళ్లలో ఐదు లక్షలకు పైగా ఇళ్లు నిర్మించామని, వచ్చే మార్చిలోగా మరో ఐదు లక్షలకు పైగా ఇళ్లను అందిస్తామని చెప్పారు. పేదలకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించి శాశ్వత చిరునామా కల్పిస్తామని స్పష్టం చేశారు.

**విశాఖ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం..**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం వల్ల విశాఖలో కొంతమేర తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని సిఎం చంద్రబాబు తెలిపారు. దేశం, రాష్ట్రం, ప్రపంచవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, రాష్ట్రంలో సుమారు 50శాతం వర్షపాతం లోటు నమోదవుతోందనిపేర్కొన్నారు. విశాఖకువచ్చిన వెంటనే తాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించానని, సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విశాఖకు తీసుకువచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని సిఎం వెల్లడించారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నీటి కొరత లేకుండా చూస్తామని తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను తీసుకువచ్చామని, వాటిని వంశధారకు అనుసంధానించే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

**విశ్వనగరంగా విశాఖ అభివృద్ధి..**

దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటని చంద్రబాబు అన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించామని తెలిపారు. విశాఖ భవిష్యత్తులో విశ్వనగరంగా రూపుదిద్దుకోనుందని, ఈ అభివృద్ధిలో పేదలకుకూడా భాగస్వామ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విశాఖను పరిశుభ్రంగా, సుందరంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సిఎం పేర్కొన్నారు.

**గత పాలనపై విమర్శలు..**

2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగిందని చంద్రబాబు ఆరోపించారు. గత పాలకులు ప్రజల భూములపై వివాదాలు సృష్టించి, ఇళ్ల కూల్చివేతలకు పాల్పడ్డారని విమర్శించారు. విశాఖను రాజధానిగా చేస్తామని చెప్పిన వారు భూకబ్జాలు, ఇతర అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రుషికొండలో ప్రజాధనంతో నిర్మించిన విలాసవంతమైన భవన సముదాయాన్ని ఏం చేయాలో అర్థం కావడం లేదని, దాని నిర్వహణ భారంగా మారే అవకాశం ఉందని అన్నారు. దీనిపై త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుని ప్రజలకు ప్రయోజనం కలిగేలా చేస్తామని తెలిపారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంతోపాటు అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. విశాఖ ప్రజలకు తాగునీరు, పరిశ్రమలు, కంపెనీలకు అవసరమైన నీరు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**విశాఖ అభివృద్ధి ఆగదు..**

2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి ఇచ్చిన తీర్పు వేలాది కుటుంబాలకు ఆస్తి హక్కులు కల్పించేలా చేసిందని చంద్రబాబు అన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నామని తెలిపారు. పేదలకు పట్టాల పంపిణీ మాత్రమే కాదని, వారి ఆత్మగౌరవానికి, హక్కులకు, పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకం చేస్తున్నామని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని పునరుద్ఘాటించిన సీఎం, ఉక్కు కర్మాగారాన్ని కాపాడేందుకు కేంద్రం సహకరించిందన్నారు. పెండింగ్‌లో ఉన్న విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. విశాఖ అభివృద్ధి ఆగదని, నగరాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు.

# సుంకాల చట్టానికి ట్రంప్ ఓకే

>> ఆమోదం పొందింది. రిపబ్లికన్ల మెజారిటీగా ఉన్న ప్రతినిధుల సభ 262-159 ఓట్ల తేడాతో ఈ ఆంక్షల ప్యాకేజీకి ఆమోదముద్ర వేయగా, సెనేట్ ఇప్పటికే దీనిని ఆమోదించింది. గత జూలైలో మరణించిన సౌత్ కరోలినా రిపబ్లికన్ సెనేటర్, రష్యా విధానాల తీవ్ర విమర్శకుడు లిండ్సే గ్రాహం జ్ఞాపకార్థం ఈ చట్టానికి ఆయన పేరును ఖరారు చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉన్నతాధికారులు, సైనిక రంగానికి సహకరించే అంతర్జాతీయ సంస్థలు, అంతర్జాతీయ నిషేధాలనను దాటవేసేందుకు రష్యా ఉపయోగిస్తున్న షాడో ఫ్లీట్ ఆఫ్ ట్యాంకర్స్‌పై తీవ్రమైన ఆంక్షలు అమల్లోకి వస్తాయి. దీనితో పాటు ఇరాన్ ఆర్థిక మూలాలను సైతం దెబ్బతీసే ఉద్దేశంతో ఇరాన్ ఆంక్షల చట్టాన్ని 2031 వరకు మరో ఐదేళ్ల పాటు పొడిగించే నిబంధనలను ఇందులో స్పష్టంగా చేర్చారు. ఈ చట్టం అమెరికా అంతర్గత రాజకీయంలో కొత్త వైరుధ్యాలకు దారితీసింది. సాధారణంగా ఉక్రెయిన్ ప్రతిఘటనకు సంపూర్ణ మద్దతు ఇచ్చే డెమోక్రాటిక్ పార్టీ చట్టసభ సభ్యులు, ఈ చట్టంలోని విస్తృత వాణిజ్య నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకించారు. అంతర్జాతీయ వాణిజ్య విధానాలపై వైట్ హౌస్‌కు, డొనాల్డ్ ట్రంప్‌కు పరిమితి లేని అపారమైన అధికారాలు ఇవ్వడం వల్ల, భవిష్యత్తులో ఇతర మిత్రదేశాలు కూడా అమెరికా ఆగ్రహానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. వాషింగ్టన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరగనున్న కీలక దౌత్య సమావేశానికి కేవలం ఒక వారం ముందే ట్రంప్ ఈ తీవ్రమైన చట్టంపై సంతకం చేయడం అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ వర్గాలలో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అమెరికా తీసుకున్న ఈ సడన్ నిర్ణయంపై భారత ప్రభుత్వం స్పష్టమైన ప్రాధాన్యతలను వ్యక్తపరిచింది. ప్రపంచంలో రష్యా చమురును కొనుగోలు చేస్తున్న రెండో అతిపెద్ద దేశంగా ఉన్న భారత్, విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారా ప్రకటన విడుదల చేస్తూ.. 140 కోట్ల మంది పౌరుల ఇంధన భద్రత తమకు అత్యంత ప్రాథమిక బాధ్యత అని పునరుద్ఘాటించింది. మారుతున్న గ్లోబల్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ విదేశీ వనరుల ద్వారా చమురు కొనుగోళ్లను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. భారత పారిశ్రామిక రంగాన్ని, ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ ఈ చట్టం ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ అమెరికా చట్టసభలకు ధన్యవాదాలు తెలియజేశారు. అయితే, ఈ చట్టం ట్రంప్ ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాత కూడా నిరంతరంగా అమల్లో ఉండేలా డిజైన్ చేయడం వల్ల, గ్లోబల్ ట్రేడ్ కారిడార్లు, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు, భారత్ అమెరికా దౌత్య సంబంధాలపై రాబోయే దశాబ్ద కాలంలో ఇది తీవ్ర ప్రభావం చూపనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## కైలాస్‌చంద్ అరెస్టు

>> నంగా మారింది. 230 కోట్ల రూపాయలు మేర కల్తీ నెయ్యి సరఫరా చేసినట్టు గుర్తించింది. ప్రధానంగా పామాయిల్, రసాయనాలతో నెయ్యి తయారు చేసి మోసం చేసినట్టు ఆరోపణలపై మంగ్లా అరెస్ట్‌తో కీలక పరిణామం దిశగా వెళ్లింది. ఇదే కేసులో ప్రధాన నిందితుడు విపిన్ జైన్ అరెస్ట్ అయిన సందర్భం ఉంది. టిటిడికి నెయ్యి కల్తీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)దర్యాప్తును వేగవంతం చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఆయనను అదుపులోకి తీసుకున్న అధికారులు, అనంతరం అరెస్ట్ చేసి విశాఖపట్నంలోని పిఎంఎల్ఎ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. లడ్డూల తయారీకి సరఫరా చేసే నెయ్యిలో భారీస్థాయిలో కల్తీ జరిగిందనే ఆరోపణలతో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడీ దర్యాప్తు చేపట్టింది. పామాయిల్, పామోలిన్, ఇతర రసాయనాలు కలిపి తయారు చేసిన నకిలీ నెయ్యిని, "అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి"గా నమ్మబలికి టిటిడికి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2019 నుండి 2024 మధ్య కాలంలో సుమారు 230 కోట్ల విలువైన కల్తీ నెయ్యిని నిందితులు సరఫరా చేసినట్లు ఇడి గుర్తించింది. ఇందులో 96 కోట్ల రూపాయలు విలువైన కల్తీ నెయ్యిని కైలాష్ చంద్ మంగ్లా తన ఫ్యాక్టరీలో తయారు చేసినట్లు అధికారులు నిర్ధారించారు.

ఈ కుంభకోణంలో కైలాష్ చంద్ సహ కుట్రదారుడిగా వ్యవహరించినట్లు ఇడి తేల్చింది. వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్, మల్‌గంగా మిల్క్ ఆగ్రో ప్రొడక్ట్స్ వంటి సంస్థలపేర్లతో మంగ్లా కల్తీనెయ్యిని సరఫరా చేసినట్లు గుర్తించారు. కల్తీని కప్పిపుచ్చేందుకు, అసలైన ఆవు నెయ్యిని ఉత్పత్తి చేసినట్లుగా తప్పుడు రికార్డులను సృష్టించి నట్లు ఇడి పేర్కొంది. దీంతో మళ్లీ తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదం తయారీలో ఉపయోగించిన నెయ్యి కల్తీ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. శ్రీవారి ప్రసాదం తయారీ కోసం ముడి సరుకుగా ఉపయోగించిన నెయ్యిలో భారీ స్థాయిలో కల్తీ జరిగినట్లు ఇడి దర్యాప్తులో నిర్ధారణ అయ్యింది. ఇలా తయారు చేసిన కల్తీ నెయ్యిని నేరుగా అమ్మితే అనుమానం వస్తుందని గ్రహించిన నిందితుడు, పలు ఇతర డెయిరీ సంస్థలను కూడా రంగంలోకి దించారనేది ఇడి వెల్లడి.

## 38 లక్షలకోట్ల డాలర్లకు చేరనున్న భారత్ ఆర్థికవ్యవస్థ: అజిత్ దోవల్

**డెహ్రాడూన్, సెప్టెంబరు 19:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ భారత్ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న 20 ఏళ్లలో భారత జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని హర్షం వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఉన్న 4.015 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ నుంచి 38 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకు చేరుతుందని ఆయన అంచనా వేశారు. ఉత్తరాఖండ్ లోని ఐఐటీ రూర్కీలో నిర్వహించిన స్నాతకోత్సవం కార్యక్రమానికి అజిత్ దోవల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం మాట్లాడారు.

ప్రస్తుతం ఇలాంటి కాలంలో విద్యార్థులు జీవిస్తున్నందుకు వాళ్లు అదృష్టవంతులను రానున్న కాలంలో విద్యార్థుల భవిష్యత్తు మరింత నమ్మకమైన భరోసా ఇక్కడ ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థులు శ్రీ రాముడి మాదిరి ధైర్య సాహసాలతో ఉండాలని సూచించారు. శ్రీరాముడి ధైర్య సాహసాలను చూసే మహర్షి విశ్వామిత్రుడు రాక్షసులను అంతమొందించేందుకు ఆయన్ను ఎంచుకున్నాడని గుర్తుచేశారు. దేశంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అత్యద్భుతమైన భవిష్యత్తు దిశగా భారత్ అడుగులు వేస్తోంది. 2047 అమృత్ కాల్ అని ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటికే తెలిపారు. ఇది నిజంగా అద్భుతమైన అమృత కాలం. భారత ప్రస్తుత జీడీపీ 4.015 ట్రిలియన్ గా ఉంది. అయితే వచ్చే 20 ఏళ్లలో అది 38 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుతుంది" అని దోవల్ స్పష్టం చేశారు.

### వారం - వర్జ్యం

20-09-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి.నవమి సా.5.50, న.పూర్వాషాఢ తె.4.34
వ.మ.12.27 - మ.2.14
దు.సా.4.24 - సా.5.13
రాహు సా.4.30-సా.6.00 శుభ స. లేదు

### వార్తాఫలం

**మేషం :** మీ పేరుమీద చేసే వ్యాపారాలు మధ్యస్తంగా ఉంటాయి. ఋణభారాన్ని దించుకోగలుగుతారు.

**వృషభం :** మార్పురాని వ్యక్తులలో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తారు. ఇచ్చిన మాటను నిలుపుకుంటారు. ధనం చేతికందుతుంది.

**మిథునం :** మీరు ఊహించిన విధంగానే నేడు కొన్ని సంఘటనలు చోటు చేసుకుంటాయి. వ్యవహారాలలో స్పష్టత ఏర్పడుతుంది.

**కర్కాటకం :** కుటుంబ సభ్యులతో కలిసి వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. శుభకార్య ప్రసంగాలను, చర్చలను సాగిస్తారు.

**సింహం :** ఇష్టంలేని అంశాలపట్ల అంటి ముట్టనట్లు వ్యవహరిస్తారు. సహోదర, సహోదరీ వర్గం యొక్క యోగక్షేమాలను విచారిస్తారు.

**కన్య :** నేర్పును కనబరుస్తారు. నేల విడిచి సాము చేయరు. స్వయం నిర్ణయాలకు ప్రాముఖ్యతనిచ్చి లాభ పడతారు.

**తుల :** ముఖ్యమైన పత్రాలు చేతికందుతాయి. ఆత్మసాక్షికి విరుద్ధంగా వ్యవహరించవలసి వచ్చినప్పటికీ పరిస్థితులకు లొంగరు.

**వృశ్చికం :** పెండింగ్లో ఉన్న రిజిస్ట్రేషన్ పనులు సానుకూలపడతాయి. మనీ రొటేషన్స్ స్కీమ్లు, లక్కీడాలు అమితంగా ఆకర్షిస్తాయి.

**ధనుస్సు :** స్నేహబృందంతో కలిసి కష్టసుఖాలను చర్చించుకుంటారు. నూతన ఉద్యోగ అవకాశాలు కలిసి వస్తాయి. ప్రోత్సాహం లభిస్తుంది.

**మకరం :** ఆర్థిక పరమైన విషయాలు ప్రధాన ప్రస్తావనాంశాలవుతాయి. గృహంలేక వాహనం మరమ్మత్తులను జరుపుతారు.

**కుంభం :** అప్రయత్నంగా ఓకార్యంలో సఫలత లభిస్తుంది. ఆరోగ్యం సాధారణం. స్వల్పమైన విషయాలకు కూడా ఎక్కువగా ఆందోళన పడతారు.

**మీనం :** రాజకీయ, పారిశ్రామిక వర్గాలలోని వారికిప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలు లాభసాటిగా సాగుతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం చంద్రబాబు

## 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

### 20వ రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోడీ సందేశం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించిన 20 'రోజ్‌గార్ మేళా'లో 51వేల మందికిపైగా యువతకు కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోడీ, 2047 నాటికి భారత్‌ను 'వికసిత్ భారత్'గా మార్చే ప్రయాణంలో యువతదే అత్యంత కీలక పాత్ర అని స్పష్టం చేశారు. దేశంలో పండుగల సీజన్ ప్రారంభమైన వేళ, వేలాది కుటుంబాల్లో ఈ ఉద్యోగాలు కొత్త ఆనందాన్ని నింపాయని ప్రధాని అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతున్న తరుణంలో యువత ప్రభుత్వంలో చేరుతున్నారని, వీరు తీసుకునే ప్రతి నిర్ణయం 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' ఆశయాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. భారతీయ యువత నైపుణ్యాలపై ప్రపంచానికి ఎంతో నమ్మకం ఉందని ప్రధాని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా దాదాపు 40 దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు యువతకు నూతన ఉద్యోగ, వ్యాపార అవకాశాలను తెచ్చాయని చెప్పారు.

రూ. 60,000 కోట్ల వ్యయంతో 'పిఎం సేతు' పథకం ద్వారా 1,000 ప్రభుత్వ ఐటిఐలను పరిశ్రమల భాగస్వామ్యంతో ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ నెట్‌వర్క్ భారత్‌లో ఉందన్న ప్రధాని, గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో సగానికి పైగా టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయని, చిన్న నగరాల యువత ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని ప్రశంసించారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు రూ. 1 లక్ష కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించామని, దీని ద్వారా తొలిసారి ఉద్యోగంలో చేరే దాదాపు 2 కోట్ల మంది యువతకు రూ. 15,000 వరకు ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ 20వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. రైల్వే, హోం శాఖ, రక్షణ, రెవెన్యూ, ఆరోగ్య, ఆర్థిక సేవల శాఖల్లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నియామకపత్రాలను అందించారు. ఇప్పటివరకు నిర్వహించిన రోజ్‌గార్ మేళాల ద్వారా మొత్తం దాదాపు 12.75 లక్షల మంది యువతకు కేంద్ర ప్రభుత్వలో ఉద్యోగ అవకాశాలు లభించాయి.

## ఒక గర్వం.. గుర్తింపు

>> విషయం" అని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగం సాధించామనే సంతృప్తితో యువత తమ ఎదుగుదలను ఆపకూడదని ఆయన అన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, నిరంతరం నేర్చుకుంటూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. తమ కార్యాలయాల్లో సీనియర్లతో సమన్వయం చేసుకుంటూ, వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను గుర్తించి వాటిని భర్తీ చేసేలా పనిచేయాలని కోరారు. ప్రపంచం మొత్తం నేడు భారతదేశం వైపు చూస్తోందని రామ్మోహన్ నాయుడు అన్నారు. దేశం సాధిస్తున్న ప్రగతి, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భారతదేశ ప్రతిష్టను మరింత మెరుగుపరిచే బాధ్యత నేటి యువతపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు వ్యవస్థపై నమ్మకం కలిగించేలా పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం కలిగించినప్పుడు, నెల జీతం అందుకునే సమయంలో కలిగే ఆనందం కంటే ఎక్కువ అనుభూతి కలుగుతుంది" అని అన్నారుదేశ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని యువత ఆదర్శంగా తీసుకోవాలని రామ్మోహన్ నాయుడు సూచించారు. దేశ ప్రగతి కోసం ఆయన చూపుతున్న అంకితభావం, నిరంతర శ్రమ యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అదేవిధంగా కాలానుగుణంగా తనను తాను మార్చుకుంటూ, భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి సారిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు ఐటీ విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లిన ఆయన.. నేడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటమ్ టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి సారిస్తున్నారని తెలిపారు. భవిష్యత్ అవసరాలను ముందుగానే అర్థం చేసుకుని, అందుకు అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంచుకుంటూ యువత ముందుకు సాగాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, సీబీఐసీ చీఫ్ కమిషనర్ ఎన్. శ్రీధర్, ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ దండా శ్రీనివాస్, ఐఆర్ఎస్ అధికారి, ప్రిన్సిపల్ కమిషనర్ కేవీవీజీ దివాకర్, ఎల్.వి.వి.ఎస్. పాత్రుడు, అడిషనల్ కమిషనర్ ఎన్. బలరాం తదితరులు పాల్గొన్నారు.

## కరవు మండలాల ప్రకటన

>> శాఖ చేపడుతుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో క్షేత్ర స్థాయి బృందాలు పంట నష్టం, దిగుబడి నష్టాన్ని పరిశీలిస్తాయని, అనంతరం వ్యవసాయ శాఖ క్షేత్ర పరిశీలన నివేదికను జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తుందని చెప్పారు. కరువు ప్రతిపాదనలను రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖకు జిల్లా కలెక్టర్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. దీనికి సెప్టెంబర్ 24 చివరి తేదీగా నిర్ణయించినట్టు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలను సెప్టెంబర్ 29న రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో పరిశీలిస్తారని తెలిపారు

**ఉద్యాన పంటలపై ఎల్‌నినో ప్రభావం..**

ఉద్యాన పంటలు కాడటానికి ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించామని, వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సమీక్షలో సిఎం అన్నారు. వర్షాభావ పరిస్థితులతో పాటు ఎల్‌నినో ప్రభావాన్ని కూడా అధికారులు వివరించారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 1,357 ఆర్ఎస్‌కెలపరిధిలో ఉన్న పంటలు హై రిస్క్ కేటగిరీలో ఉన్నాయన్నారు. ఎల్‌నినోతో 17,916 హెక్టార్లలోని నారింజ, బత్తాయి, మామిడి, ఎర్ర మిరప, ఉల్లి, కూరగాయల పంటలు ప్రభావితం కానున్నాయని తెలిపారు. నీటి లభ్యత తగ్గుతున్న పరిస్థితుల్లో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేందుకు మైక్రో ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్(ఏపీఎంఐపి) కింద రైతులకు సంబంధించిన నాలుగు కీలకసేవలను "మన మిత్ర" వాట్సప్ గవర్నెన్స్ కింద అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. సూక్ష్మసేద్యంతో పాటు ప్రకృతి సేద్యం వైపు రైతులను మళ్లించేలా చూడాలని సిఎం నిర్దేశించారు.

**మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు..**

రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ప్రజలు ఇబ్బందిపడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తాగునీటికి బోర్లపైన ఆధారపడే ప్రాంతాలకు అవసరమైతే అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేలా చూడాలన్నారు. విశాఖ తాగునీటిసమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి విశాఖ తాగునీటి సరఫరా సంబంధిత పనులు చేపట్టాలని సీఎం స్పష్టంచేశారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లు నింపేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టే అవకాశాలను పరిశీలించాలన్నారు. మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్ఎంసీ నుంచి ప్యాకేజీ నెం.8 కింద పైపులైన్ ద్వారా నీటిని తరలించే పనుల్లో వేగం పెంచాలన్నారు. విశాఖ నగరానికి మరో 2 నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

## ఎపికి నీళ్లు దోచిపెడుతున్న రేవంత్

### కృష్ణా జలాల్లో పాలమూరు వాటా దక్కేదాకా ఊరుకోం

### పెబ్బేరు వద్ద రోడ్‌షోలో కెటిఆర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** ఎల్ నినో పేరిట సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్రాకు సాగు జలాలు దోచిపెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వనపర్తి నియోజకవర్గం పెబ్బేరులో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. ప్రకృతి కావాల్సినన్ని నీళ్లు ఇచ్చినా రైతులకు సాగునీరు లేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ముందుచూపు లేకపోవడమే కారణమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 7వేల మెగావాట్లు ఉన్న విద్యుత్ స్థాపిత సామర్థ్యాన్ని తమ ప్రభుత్వం 24 వేల మెగావాట్లకు పెంచామన్నారు. కెసిఆర్ హయాంలో కృష్ణా జలాల్లో 30 శాతానికి పైగా నీళ్లు వాడుకున్నామని, పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి 7 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. సీఎం సొంత జిల్లాలోనే రైతులు కరెంట్, సాగునీటి కష్టాలతో రోడ్డెక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను రెండు సబ్ స్టేషన్లకు రైతులతో కలిసి వెళితే అధికారులు సమాధానం చెప్పలేకపోయారని, ఆరు గంటలకు మించి విద్యుత్ రావడం లేదని, లో ఓల్టేజీతో మోటర్లు కాలిపోతున్నాయని రైతులు చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే కరెంట్, తాగునీటి కష్టాలు ఉన్నాయని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా ఏపీకి నీళ్లు పోతుంటే తెలంగాణకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి పంపులు ఆన్ చేయడం లేదని, అవి రోజుకు రెండు మూడు సార్లు ఆన్ ఆఫ్ చేసే పంపులు కావని, ఒకసారి ఆన్ చేస్తే కంటిన్యూగా నడపాలని అన్నారు. కర్ణాటక, ఏపీ ప్రణాళికతో వెళ్తుంటే తెలంగాణ ప్రభుత్వం కృష్ణా జలాల విషయంలో ప్రణాళిక లేకుండా ఉందని విమర్శించారు. ఆలమట్టి ఎత్తు పెంచే యోచనలో కర్ణాటక ఉందని, దీంతో భవిష్యత్తులో పాలమూరుకు నీళ్లు రావని, ఈ విషయంలో పక్కనే ఉన్న కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు.

# తిరుమల సమాచారం



## 'శృంగార రసాధిదేవతగా మోహినీరూపం'

**తిరుమల,సెప్టెంబరు 19 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో కొలువైన వేంకటేశ్వరస్వామి శనివారం ఉదయం మోహినీ అలంకారంలో ముగ్ధమనోహరంగా భక్తులను కటాక్షించాడు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు ఉదయం నిత్యకైంకర్యాలు ముగించుకుని ఆలయంలోపల నుంచి వెలుపలకు పల్లకీపై వచ్చిన మలయప్పస్వామి శృంగారరసాధిదేవతగా మోహినీ రూపంలో భక్తులకు మోక్షంకలిగించాడు. మలయప్పస్వామి దంతపువల్లకిపై చేతిలో బంగారపు చిలుకను ధరించి మరోరూపంలో పక్కనే శ్రీకృష్ణుడు అలంకృతుడై కన్నులపండువగా ఆలయం ముందుకు విచ్చేశారు. కమనీయమైన శ్రీకాంతునిరూపం జగత్సమ్మోహకంగా కనువిందుచేసింది. 'పుంసాం మోహనరూపాయ' అన్నట్లు శ్రీమహావిష్ణువు ఏరూపం ఎత్తినా,పురుషులకు కూడా సమ్మోహకుడవుతాడు. ఇక మోహినీ రూపంలో చెప్పవలసిన అవసరం లేదు. తనకు ప్రసన్నులైనవారు మాయనుసులభంగా దాటగలరని ఈ మోహినీ రూపంలో ప్రకటించాడు. ఈ జగత్తునుంచి బయటపడటానికి మోహినీ రూపంలో తిరుమల మాఢవీధులలో ఊరేగిన మలయప్ప దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, శాంతారాం,భానుప్రకాశ్‌రెడ్డి,టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీ కృష్ణ,ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్ వర్మ,ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి తదితరులు పాల్గొన్నారు.



## భక్తులను మంత్రముగ్ధులను చేసిన నృత్యాలు


**తిరుమల,సెప్టెంబరు 19 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం మోహినీ అవతార సేవలో భారతీయ కళా వైభవం వెల్లివిరిసింది. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన కళాకారుల ప్రదర్శనలు జానపద, శాస్త్రీయ కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, కేరళ, పంజాబ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన కళాబృందాలతోపాటు టిటిడికి చెందిన వివిధ కళా ప్రాజెక్టులు, సంస్థల కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. మొత్తం 18 కళాబృందాలకు చెందిన 502 మంది కళాకారులు 18 కళారూపాలను ప్రదర్శించారు. భరతనాట్యం, కూచిపూడి, సత్రియ, ఒడిస్సీ, భాంగ్రా, కోలాటం, పెరిణి శివతాండవం,మయూర నృత్యం, డమరుక ధ్వని విన్యాసం, అన్నమయ్య జానపదాల తదితర ప్రదర్శనలు భక్తులను అలరించాయి. మహారాష్ట్రకు చెందిన కథేకర్ బృందం గూమర్, పెద్దతాళాలతో జెంజ్ నృత్యం, మధ్యప్రదేశ్‌కు చెందిన మయాంక్ తివారి బృందం బదాయి నృత్యం, కేరళకు చెందిన కె. రవిత బృందం తిరువతిర నృత్యం, అస్సాంకు చెందిన సతీశ్ సైకియా బృందం సత్రియ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేంకటేశ్వర సంగీత నృత్యకళాశాల కళాకారులు మోహినీ అవతారసన్నివేశం, భరతనాట్యం, పెరిణి శివతాండవం తదితర ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. దాససాహిత్య ప్రాజెక్టు,హిందూధర్మ ప్రచారపరిషత్తు, అన్నమాచార్య ప్రాజెక్టులకు చెందిన కళాబృందాలను కూడా భక్తిరసభరిత కళా ప్రదర్శనలు అందించాయి. వాహనసేవలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాలుగు కళాబృందాలను టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర శాలువాతో సత్కరించారు. దాస సాహిత్య ప్రాజెక్టు ఎం. గౌరవి రెడ్డి బృందం 28మంది (హైదరాబాద్), హిందూ ధర్మ ప్రచార పరిషతు కథేకర్ బృందం - పండర్‌పూర్ వార్కరీ గర్భ నృత్యం 60మంది (మహారాష్ట్ర), వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ఎన్. శివకుమార్ బృందం భరతనాట్యం (తిరుపతి) హర్దీప్ సింగ్ బృందం - భాంగ్రా, (పంజాబ్) కళా ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతోపాటు భారతీయ శాస్త్రీయ, జానపద కళల వైభవాన్ని పరిచయం చేస్తున్నాయి.



### బ్రహ్మోత్సవాల వేళ చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు

## 37,932 మందికి చైల్డ్ ట్యాగింగ్

**తిరుమల,సెప్టెంబరు 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండపై జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చిన్నారుల భద్రతకు తిరుపతి జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా చైల్డ్ ట్యాగింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తూ, చిన్నారులు తల్లిదండ్రుల నుండి విడిపోయిన సందర్భాల్లో వారిని త్వరగా గుర్తించి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించేలా చర్యలు చేపడుతోంది. ఈనెల 15 నుండి చిన్నారులకు చైల్డ్ ట్యాగ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో నాలుగు రోజుల్లో మొత్తం 37,932 మంది చిన్నారులకు చైల్డ్ ట్యాగింగ్ కట్టారు. చైల్డ్ ట్యాగింగ్ ద్వారా ఇప్పటివరకు తప్పిపోయిన ముగ్గురు బాలికలను గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. రద్దీ ప్రాంతాల్లో చిన్నారులు తల్లిదండ్రుల నుండి విడిపోయినప్పుడు చైల్డ్ ట్యాగ్‌పై ఉన్న వివరాల ఆధారంగా వారిని త్వరితగతిన గుర్తించి కుటుంబ సభ్యులతో కలిపేందుకు ఇది ఎంతగానో దోహదపడుతోంది. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు చిన్నారులను ఎల్లప్పుడూ తమ వెంట ఉంచుకోవడంతో పాటు, చైల్డ్ ట్యాగ్‌ను భద్రంగా ఉంచాలని పోలీసులు సూచించారు. చిన్నారులు తప్పిపోయిన సందర్భంలో వెంటనే సమీపంలోని పోలీసు సిబ్బందిని గానీ భద్రతా సిబ్బందిని సంప్రదించాలని



శనివారం సౌకర్యాలపై భక్తులను అడుగుతున్న టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు

# 'గరుడ'సేవకు ఉదయమే నిండిన కొండ!

### వాహనసేవ వీక్షణకు గ్యాలరీల్లోకి భారీగా భక్తులు

### మరో 50వేల మంది బయటే నిరీక్షణ

### సౌకర్యాలు సంతృప్తికరం అయినా తప్పని తిప్పలు





గ్యాలరీల్లో నిండిన భక్తులు, రాంభగీచా గేట్‌వద్ద భక్తులు వెళ్ళలేకుండా ఇనుపకంచెలతో బందీ, వాహనాలు అనుమతించకపోవడంతో అలిపిరి టోల్‌గేట్ ఖాళీ

**తిరుమల,సెప్టెంబరు 19 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలస్వామికి ఎంతో పవిత్రమైన శని వారం (పెరటాసి మాసం తొలివారం)రోజున సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు భారీగా భక్తు లు తరలివచ్చారు. ఉదయం 11గంటలకే ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీలన్నీ భక్తులతో నిండిపోయాయి. బ్రహ్మోత్సవాలు మొదలైన తొలి నాలుగురోజులు మోస్తరుగా ఉన్న భక్తులు ఒక్కసారిగా శుక్రవారం రాత్రికే అశేషంగా వచ్చారు. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రద్దీ ముందుగానే ఊహించిన టిటిడి బోర్డు, అధికారులు ఆ దిశగా అన్ని చర్యలు ,ఏర్పాట్లు చేపట్టారు. మాఢ వీధుల్లోకి భక్తులు చేరుకునేలా ప్రవేశ మార్గాల గేట్లను సూచిస్తూ బోర్డులు ఏర్పాటుచేయడం, ప్రసారసాధనాల ద్వారా ప్రకటించడం చేసినా అనూహ్యంగా వచ్చిన భక్తుల సంఖ్యతో మాఢవీధులు పూర్తిగా నిండిపోయాయి. బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడవాహనసేవ వీక్షణకు ఆంధ్రప్రదేశ్ నుండే గాక తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక,మహారాష్ట్రల నుంచి భారీగా భక్తులు రావడంతో తిరుమలకొండలు భక్తజనసం దోహంగా మారింది. శనివారం మధ్యాహ్నం 12గంటలకు మాఢవీధుల్లోని గ్యాలరీల్లో 2.50లక్షల మంది భక్తులు నిండిపోయారు. వెలుపల ఉన్న భక్తులు గ్యాలరీల్లోకి చేరుకోవడానికి పోలీసులతో రాంభగీచా విశ్రాంతి గృహాలు, లేపాక్షి కూడలి, వరాహస్వామి గేట్, పడమరమాఢవీధి గేట్ల వద్ద వాగ్వాదానికి దిగారు. గ్యాలరీలు నిండిపోవడంతో ఎక్కడ భక్తులను అక్కడే నిలువరించారు. దాదాపు 70వేలమందివరకు భక్తులు తిరుమల లోనే పలు చోట్ల మాఢవీధుల వెలుపల వేచి ఉండాల్సిన పరిస్థితి కనిపించింది. శనివారం మధ్యాహ్నం సమయంలో మాఢవీధుల్లో గ్యాలరీలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్‌వర్మ, బోర్డుసభ్యులు పనబాక లక్ష్మి, శాంతారాం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జెఇఒ డాక్టర్ ఎ.శరత్, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ మాఢవీధుల్లో వేచివున్న భక్తులను పలకరించి సదుపాయాలపై ఆరా తీశారు.

**అలిపిరి వద్ద ఆగిపోయిన వాహనాలు:** గరుడసేవ రోజు తిరుమలకు పూర్తిగా ద్విచక్రవాహనాలను నిషేధించిన టిటిడి ,పోలీసు అధికారులు మధ్యాహ్నం 1గంటకే నాలుగుచక్రాల వాహనాలను కూడా అలిపిరి వద్ద నిలిపివేశారు. తిరుమలలో సుమారు 40ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం 12వేల వాహనాలకు మాత్రమే సరిపోయింది. ఆ తరువాత వచ్చే వాహనాలకు తిరుపతి జిల్లా పోలీసులు వాహనాలను అలిపిరి గరుడవిగ్రహం కూడలి నుండి తిరుమలకు అనుమతించలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుండేగాక తిరుపతి పరిసరాల్లోని భక్తులు కూడా తమతమ వాహనాలను అలిపిరిలోనే ఆపివేసి ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించి తిరుమలకు చేరుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది అదనంగా మరో 50వేలమంది భక్తులకు ఆలయం ఎదురుగా వున్న గ్యాలరీల్లో, తూర్పుమాఢవీధి గ్యాలరీల్లోనికి భక్తులను రాత్రి 9గంటల తరువాత అనుమతించి వాహనసేవ వీక్షించేలా పోలీసులు చక్కగా సేవలందించారు.

# అర్హులైన కళాకారులకు త్వరలో ఐడి కార్డులు

### రాజమహేంద్రవరం తెలుగువర్సిటీకి బోయి భీమన్న కళాపీఠం తరలింపునకు చర్యలు: మంత్రి దుర్గేష్



మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న జయంతి సభలో ప్రసంగిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ, సెప్టెంబరు 19, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న జయంతిని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమ ప్రాంగణంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోయి భీమన్న జీవిత ఛాయా చిత్రమాలికను మంత్రి దుర్గేష్ పరిశీలించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వేడుకలో భాగంగా గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లుకు 'బోయి భీమన్న అవార్డు2026'తో సత్కరించి రూ. 2,00,000 నగదు పారితోషికం చెక్కును మంత్రి కందుల దుర్గేష్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'మహాకవి బోయి భీమన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన రచనల ద్వారా అమరుడిగా నిలిచారన్నారు. నేటి తరానికి మహాపురుషుల రచనలను అందించి సామాజిక వికాసానికి దోహదపడదాం' అన్నారు. సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో చర్చించి, ప్రస్తుతం తెలంగాణలో ఉన్న భీమన్న కళాపీఠాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్ ఎస్ రావత్ తో మాట్లాడి అర్హులైన ప్రతి కళాకారునికి గుర్తింపు కార్డులు ఇప్పిస్తామన్నారు. బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి మాట్లాడుతూ భీమన్న జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్‌కి, మంత్రి దుర్గేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి దుర్గేష్ ప్రసంగ శైలిని, వాగ్ధాటిని ఈ సందర్భంగా ఆమె ప్రశంసించారు. రాష్ట్ర నాటక రంగ అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ బోయి భీమన్న గొప్ప సామాజిక రచయిత అని, సమాజ శ్రేయస్సు కోరిన ఆయన సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. అవార్డు గ్రహీత భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, బోయి భీమన్నలను త్రిమూర్తులుగా, మహాకవులుగా కీర్తించారు. ఈ ముగ్గురూ పద్మ పురస్కారాలు పొందారని గుర్తుచేశారు. కవితా ప్రపంచాన్ని ఏలిన భీమన్న పేరిట తనకు అవార్డు రావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. భీమన్న సతీమణి హైమావతి కృషి వల్లే ఆయనకు ఈ గౌరవం ప్రతీ ఏటా దక్కుతోందని పేర్కొన్నారు. మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల విక్రమరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు తర్వాత అంతటి కష్టపడే మనస్తత్వం ఉన్న వ్యక్తి మంత్రి కందుల దుర్గేష్ అని కొనియాడారు. సాంస్కృతిక సృజనాత్మక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పోడపాటి మాట్లాడుతూ. రాష్ట్రంలో మళ్లీ సాంస్కృతిక పునరుజ్జీవనం వచ్చిందంటే అది మంత్రి దుర్గేష్ చొరవే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సాంస్కృతిక సృజనాత్మక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పోడపాటి, నాటక రంగ అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల విక్రమరావు, బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి, వారి కుటుంబ సభ్యులు, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, అధికారులు సుమన్, శ్రీనివాస్, పలువురు ప్రముఖ రచయితలు, కవులు మరియు కళాకారులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాల దర్యాప్తులో సిబ్బంది సామర్థ్యం మరింత బలోపేతం

### ఎపి సిఐడి డిజిపి డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్



**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** సైబర్ నేరాల దర్యాప్తులో ఏపీ పోలీస్ సిబ్బంది సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తామని ఏపీ సీఐడీ డీజీపీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. సైబర్ నేరాలను సమర్థవంతంగా దర్యాప్తు చేయడంతో పాటు, పోలీస్ వ్యవస్థలో సైబర్ సెక్యూరిటీ మరియు సైబర్ హైజీన్‌పై అవగాహన, నైపుణ్యాలను మరింత పెంపొందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పోలీస్ నేర దర్యాప్తు విభాగం (ఏపీ సీఐడీ) ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల సైబర్ సెక్యూరిటీ సైబర్ హైజీన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ (ఫేజ్1 )" విజయవంతంగా ముగిసింది. ఏపీ సీఐడీ డీజీపీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వేగంగా మారుతున్న సైబర్ నేరాల ధోరణులకు అనుగుణంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, దర్యాప్తు విధానాలపై నిరంతర శిక్షణ అందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైబర్ సెక్యూరిటీ నిపుణుడు,సీఈఓ సందీప్ మదుల్కర్ పాల్గొని సైబర్ నేరాల దర్యాప్తు, సాంకేతిక అంశాలు, ఆధునిక సైబర్ సెక్యూరిటీ విధానాలపై అధికారులకు శిక్షణతో పాటు విలువైన సూచనలు, సలహాలు అందించారు. హెడ్‌క్వార్టర్స్‌తో పాటు రాష్ట్రంలోని 7 రీజినల్ ఆఫీసుల నుంచి కానిస్టేబుల్ స్థాయి నుంచి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి వరకు సుమారు 60 మంది అధికారులు, సిబ్బంది ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్యాలరీల్లో సౌకర్యాలెలా ఉన్నాయి!?

### అన్నప్రసాదాలు అందుతున్నాయా..

### గరుడసేవ భక్తులతో టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు మాటామంతీ

**తిరుమల,సెప్టెంబరు 19 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన విశిష్టత కలిగిన గరుడసేవకు శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం మోహనీ అలంకారం వాహనసేవలో గ్యాలరీల్లో ఉన్న భక్తులు అలాగే రాత్రి గరుడసేవ వీక్షణకు కూర్చుండిపోయారు. ఉదయం 11గంటల నుండి నాలుగు మాఢవీధుల్లోని గ్యాలరీల్లో ఉంటున్న 2లక్షలమంది భక్తులకు అందుతున్న సౌకర్యాలు, సేవలు, ఇతరత్రా సదుపాయాలపై శనివారం మధ్యాహ్నం 1గంటకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులతో కలసి తనిఖీ చేశారు. తనదైన శైలిలో భక్తుల్లో తానూ భక్తుడిగా ఆయన ఆప్యాయంగా భక్తులను పలకరించి సేవలపై ఆరాతీశారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణపైటిటిడి ప్రత్యేక దృష్టి సారించింది. గత ఏడాది గరుడ సేవలో 6.13 లక్షల అన్నప్రసాదాలు అందించగా, ఈసారి 9.30 లక్షల మందికి సరిపడా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రసాదాలను 30 శాతం, పానీయాలను 50 శాతం అదనంగా సిద్ధం చేశారు. అదనంగా లక్ష మందికి భోజనాలు వండేందుకు ప్రత్యేక వంటశాలను ఏర్పాటు చేశారు. రవాణా పరంగా ఆర్టీసీ 500 అదనపు ట్రిప్పులు నడిపింది. క్షేత్రస్థాయిలో గరుడ సేవ ఏర్పాట్లను టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర ,అదనపు ఇఒ వెంకయ్యచౌదరి శనివారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. మాడ వీధుల్లోని గ్యాలరీలకు వెళ్లి భక్తులతో ముఖాముఖి మాట్లాడారు. అన్నప్రసాదాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలపై ఆరా తీశారు. అందిస్తున్న వసతులపై తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, ఢిల్లీ వంటి వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులు కూడా ఓర్పు, సంయ మనంతో వ్యవహరించి, సిబ్బందికి సహకరించి స్వామివారి సేవను విజయవంతం చేయాలని ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు.

### విఆర్ఎ నుండి విఆర్ఒ పదోన్నతులకు

# 'వన్ టైం సెటిల్‌మెంట్'

### ఎపి విఆర్ఎ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం

**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖలో పని చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)లు యొక్క దీర్ఘకాలిక సమస్య లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం అన్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీ.వో ఎంఎస్ నెంబర్ 480కు అను గుణంగా అర్హులైన వీఆర్ఏలను వీఆర్ఓలుగా ఖాళీలు అన్ని ఒకే దఫాలో "వన్ టైం సెటిల్ మెంట్" ద్వారా పదోన్నతులు లభిస్తాయన్నారు. ఈ దిశలో జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఏపీ వీఆర్ఏ అసోసియేషన్ ఇచ్చిన విన తులకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏ లకు వీఆర్ఓలుగా పదోన్నతులు కల్పించే అంశంపై జిల్లాలు వారీగా వివరాలు కోరుతూ సి.సి.ఎల్.ఏ. ప్రధాన కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయని ఆయన తెలిపారు.

## చిలుకవాహనంపై గణనాధుని చిద్విలాసం



**కాణిపాకం, సెప్టెంబరు 19 ప్రభాత వార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం ఉభయదేవేరులతో కలసి స్వామివారు చిలుకవాహనంపై కాణిపాకం పురవీదుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులైన కాణిపాకం ఆర్యవైశ్యులచే స్వామివారికి చిలుకవాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.

# ఆసియా క్రీడల్లో భారత్ పతాకాన్ని రెపరెపలాడించాలి: మంత్రి మండిపల్లి

### రాష్ట్రం తరపున పాల్గొంటున్న క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలిపిన మంత్రి



**అమరావతి, సెప్టెంబరు 19, ప్రభాతవార్తప్రతినిధి:** జపాన్ లోని ఐచి-నగోయా వేది కగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న 20వ ఆసియా క్రీడలు-2026లో భారత్ తరఫున పోటీ పడుతున్న తెలుగు రాష్ట్రాల క్రీడా కారులకు రాష్ట్ర రవాణా, యువ జన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆసియా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి, తెలుగు రాష్ట్రాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. భారతదేశం నుంచి 492 మంది క్రీడాకారులు 35 క్రీడాంశాల్లో పాల్గొంటున్నారని, ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి సురేఖ వెన్నం (విజయవాడ-ఆర్చరీ), జ్యోతి యర్రాజీ (విశాఖపట్నం-100 మీటర్ల హర్డిల్స్), నితీష్ కుమార్ రెడ్డి (విశాఖపట్నం-క్రికెట్), మొగిలి వెంకట రామ రెడ్డి (విశాఖపట్నం-800 మీటర్లు), సాయి కృష్ణ నల్లూరి (రాజమండ్రి-ఇస్పోర్ట్స్) భారత బృందంలో చోటు దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడా కారులు కూడా ఉండటం రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



# మంగళగిరిలో మొదలైన మహిళల టి20 క్రికెట్ సందడి

### డబ్ల్యూఎపిఎల్ ట్రోఫీని ఆవిష్కరించిన నారా బ్రాహ్మణి, మిథాలీ రాజ్

**మంగళగిరి, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** మహిళా యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసి, వారిని ఉమెన్ ప్రీమియర్ లీగ్, భారత మహిళా క్రికెట్ జట్టు వైపు నడిపించడవే లక్ష్యంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తలపెట్టిన మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టీ20 క్రికెట్ తొలి సీజన్ ప్రారంభమైంది. మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఉమెన్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్1 ప్రారంభోత్సవ వేడుకలకు హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ను లాంఛనంగా ప్రారం భించారు. ముందుగా స్టేడియం ప్రాంగణానికి చేరుకున్న నారా బ్రాహ్మణికి ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, రాజ్యసభ ఎంపీ, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు ఘనస్వాగతం పలికారు. అనం తరం డబ్ల్యూఏపీఎల్ ను ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ తో కలిసి ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారా బ్రాహ్మణి మాట్లాడుతూ ఉమెన్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్స వేడుకలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మహిళా క్రికెటర్లకు ఇదో అద్భుతమైన అవకాశమని పేర్కొన్నారు. భవిష్యత్ తరా లకు మీరంతా రోల్ మోడల్స్ గా నిలుస్తారని చెప్పారు. ప్రతిభ ఉండి అవకాశం వస్తే మహిళా క్రీడాకారిణులు అద్భుతంగా రాణిస్తారని తెలిపారు. మంగళగిరి వేదికగా యువ మహిళా క్రికెటర్లకు అవకాశం కల్పించిన ఏసీఏ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

**ఏసీఏ క్రికెట్ స్టేడియంలో 7 రోజులు 13 మ్యాచ్‌లు:** భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ డబ్ల్యూఏపీఎల్ కు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నారు. ఫ్రాంచైజీ విధానంలో రాష్ట్రంలో తొలిసారిగా జరుగుతున్న డబ్ల్యూఏపీఎల్ టీ20 క్రికెట్ పోటీల్లో నాలుగు జట్లు రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్, అమరావతి ఈఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ తలపడనున్నాయి. మంగళగిరిలోని ఏసీఏ క్రికెట్ స్టేడియంలో 7 రోజుల పాటు 13 మ్యాచ్ లు జరగనున్నాయి. శనివారం మధ్యాహ్నం రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్ మధ్య ప్రారంభ మ్యాచ్ జరిగింది. సాయంత్రం అమరావతి ఈఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ మధ్య రెండో మ్యాచ్ జరిగింది.

డబ్ల్యూఏపీఎల్ ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నారా బ్రాహ్మణికి నిర్వాహకులు ప్రత్యేక జ్ఞాపికను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ మెంబర్ డి.విష్ణుతేజ, ఏసీఏ క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ కల్యాణ్ కృష్ణ, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ వైఎస్ రంగనాథ్ పాల్గొన్నారు.



డబ్ల్యూఎపిఎల్ ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నారా బ్రాహ్మణికి ప్రత్యేక జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

# ద్రవిడ వర్సిటీలో కరపత్రాల కలకలం

### ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా ప్రచారం

**కుప్పం, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:** ద్రవిడ భాషల స ంస్కృతి, పరిరక్షణకోసం ఏర్పాటైన ద్రవిడ వర్సిటీలో మరోమారు కరపత్రాల కలకలం రేకెత్తింది. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వర్సిటీ ప్రాంగణంలో ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను చల్లినట్లు తెలిసింది. కరపత్రాల్లో రిజిస్ట్రార్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆయన వైకాపా ఉగ్రవాది అని పేర్కొన్నారు. బోగస్ సర్టిఫికెట్లతో అక్రమ పదోన్నతి పొందారని, దూరవిద్యా కేంద్రాలను అర్హత లేని సెంటర్లకు డబ్బు తీసుకుని కేటాయించారని కరపత్రాల్లో పేర్కొన్నారు. అలాగే కంప్యూటర్ల కొనుగోలు, రూసా కోఆర్డినేటర్‌గా ఉన్న సమయంలో భవన నిర్మాణాల్లో అవినీతికి తెరలేపారని ఇంజనీరింగ్ ల్యాబ్‌ను నాసిరకం కంప్యూటర్ పరికరాలు తెచ్చిడబ్బులు దోచుకున్నారని కరపత్రాల్లో పేర్కొన్నారు. వర్సిటీలో 600 ఎకరాల్లో ఉన్న అకేషియా చెట్ల ద్వారా టెండర్ల ముసుగులో లక్షలు సంపాదించారని పేర్కొన్నారు. విలువైన వస్తువులను స్క్రాప్ కి ంద తన శిష్యుడికి కట్టబెట్టారనిపేర్కొన్నారు. 2023లో మైనింగ్ అధికారులు సీజ్ చేసిన గ్రానైట్ దిమ్మెలను తన శిష్యుడి ద్వారా తరలించారన్నారు. నాక్ కమిటీ అభివృద్ధి పనులు, దూరవిద్య పిహెచ్‌డిల్లో 300అవార్డులు చేసి కోట్లలో సంపాదించారని కరపత్రాల్లో పేర్కొన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VISAKHAPATNAM

Short Tender Notice No.51/2026-27/SE (W-East)/EE-East / DB/GVMC/ Dt:17-09-2026

| | | |
|---|---|---|
| 01. No.of Works | : | 1 No |
| 02. Value of works (ECV) | : | Rs.53.91 Lakhs |
| 03. Downloading Starting Date | : | 17-09-2026 @ 11.00 PM |
| 04. Downloading End Date | : | 25-09-2026 @ 02.00 PM |
| 05. Last date for Submission of bid | : | 25-09-2026 @ 03.00 PM |

Further details at http://www.apeprocurement.gov.in
O/o The Executive Engineer (PW-III) Division
Sd/- Commissioner, GVMC

20-9pg4:20-9pg4.qxd 9/19/2026 10:22 PM Page 1



గతంలో సంచలనం రేపిన టాలీవుడ్ డ్రగ్స్ కేసు గురించి తెలిసిందే. పలువురు సినీ తారలకు డ్రగ్స్‌తో సంబంధాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. వీరితో పాటు అనేక మంది సెలబ్రిటీలు సైతం ఇందులో ఇరుక్కోవడం విదితమే. డ్రగ్స్ మాఫియాపై సర్కారు కఠిన చర్యలు తీసుకుంటుందని కేంద్రంతో పాటు రాష్ట్రాలు పదేపదే చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు దీనికి భిన్నంగా వున్నాయి. డ్రగ్స్ మాఫియాలో పదుల సంఖ్యలోనే నేరగాళ్లు వుండే వీలుండగా గంజాయి స్మగ్లింగ్‌లో వందలాది మంది వుండడం చెప్పుకోదగ్గ అంశం. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై వీటిని అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నార్కోటిక్ బ్యూరో నిబంధనల ప్రకారం పట్టుబడిన వారికి బెయిలు రాకుండా చేసి, ఏడాదిలోపు విచారణ పూర్తి చేసి పదేళ్ల వరకు జైలు శిక్షలుపడేలా చేయాల్సిన అవసరం వుంది. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నవారు పోలీసులు లేదా అబ్కారీ అధికారులకు పట్టుబడిన సమయంలో చాలా సులభంగా బెయిలు పొందుతూ తప్పించు కుంటున్నారు. ఇలా పారిపోతున్న వారు మళ్లీ కనిపించడం లేదు. ఇదే సమయంలో కాగితాలకే పరిమితమైన మరో అంశం గంజాయి సాగు దారులపై పిడి అమలు. దీనిపైనా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వెంటనే స్పందించాల్సిన అవసరం వుంది. గంజాయి సాగు చేస్తున్నవారు కూడా సుల భంగా బెయిలు పొందుతూ మళ్లీ అదే నేరం చేస్తున్నా ఇప్పుడున్న సాదాసీదా చట్టాల వల్ల పోలీసు, అబ్కారీ శాఖ ఏమీ చేయలేకపోతున్నాయి. వీరిపై పిడి అమలు చేసి ఏడాది పాటు జైల్లో వుంచితే మరోసారి నేరం చేసేందుకు భయపడే వీలుంది. డ్రగ్స్ మాఫియా, గంజాయి మాఫియా బీద, మధ్య తరగతి వర్గాల ప్రజల జీవితాలను నాశనం చేస్తున్న నేపథ్యంలో ఇందులోని నేరగాళ్లపై ఇకనైనా ఉక్కుపాదం మోపాల్సిన అవసరం వుంది.

# డ్రగ్స్ వలయంలో భారత్

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

అభివృద్ధిలో అగ్రదేశాలను సవాల్ చేస్తున్న భారత్ డ్రగ్స్‌ను అరికట్టే విషయంలో వెనుబడుతున్నట్లు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) నివేదికలు చెబుతున్నాయి. విదేశాలతో పోలిస్తే కుటుంబ వ్యవస్థ బలంగా వున్న భారత్‌లో మాదకద్రవ్యాల వాడకం గతంలో చాలా తక్కువగా వుండేది. కానీ ప్రపంచీకరణ ప్రభావం వల్ల ఏర్పడ్డ మార్పులు యువతను డ్రగ్స్ ఉచ్చులో పడేస్తున్నాయని ఆ నివేదిక తేటతెల్లం చేసింది. భారత్‌లో ఒకప్పుడు డ్రగ్స్ అంటే మారుమూల ప్రాంతాలలో కొందరు ఎక్కువగా సేవించే గంజాయి వరకే పరిమితం అయ్యేది. కానీ దీంతో పాటు భారత్‌లోనే అనేక చోట్ల తయారవుతున్న టన్నుల కొద్ది సింథటిక్ డ్రగ్స్, విదేశాల నుంచి దిగుమతి అవుతున్న కొకైన్, హెరాయిన్,ఘాటైన గంజాయి యువతను నిర్వీర్యం చేస్తోంది. మొత్తం మీద భారత్‌లో పది కోట్ల మంది డ్రగ్స్ వాడుతున్నారని ఎన్‌సిబి నివేదిక చెబుతోంది. ఇదే సమయంలో ఏటా 30లక్షల మంది కొత్తగా ఈ ఊబిలో చేరుతున్నట్లు అందులో వుంది. ఇదిచాలా ప్రమాదకరమని ఎన్‌సిబి చెబుతోంది. భారత్‌లో డ్రగ్స్ వాడకం ఎక్కువగా వున్న రాష్ట్రం పంజాబ్ మొదటి స్థానంలో వుండగా ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్, మిజోరం, నాగాలాండ్ ఆ తరువాతి స్థానాల్లో వున్నాయి. ఇందులో పంజాబ్ పాక్‌కు సరిహద్దుల్లో వుండడంతో డ్రగ్స్ స్మగ్లింగ్‌తో పాటు వాడకం కూడా ఎక్కువగా వుంది. పంజాబ్ రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం పెరిగిపోయి ప్రమాదకర స్థాయికి చేరడంపై పదేళ్ల క్రితం వచ్చిన ఉడ్తా పంజాబ్ సినిమా దేశవ్యాప్తంగా ఘన విజయం సాధించింది. ఇక ఈశాన్య రాష్ట్రాలు బంగ్లాదేశ్, మయన్మార్‌కు సరిహద్దులో వుండడం వల్ల అక్కడ మాదకద్రవ్యాల వాడకం ఎక్కువగా వుంది. ఎన్‌సిబి గణాంకాల ప్రకారం 2025లో భారత్‌లో లక్షా33 వేల 965 కిలోల డ్రగ్స్ పట్టుబడ్డాయి. వీటి విలువ 1980 కోట్ల రూపాయలుగా తేలింది. మొత్తం మీద 994 మంది కరుడుగట్టిన స్మగ్లర్లతో పాటు మరో వెయ్యి మంది చోటా స్మగ్లర్లు పట్టుబడ్డారు. ఇందులో 25 మంది విదేశీయులు వున్నారు. ఇదే సమయంలో డ్రగ్స్ స్మగ్లర్లకు సంబంధించి 96.69 కోట్ల రూపాయల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. దక్షిణాది రాష్ట్రాలవరకు వస్తే కేరళ, తమిళనాడులో డ్రగ్స్ వాడకం ఎక్కువగా వుందని ఎన్‌సిబి నివేదికలు చెబుతున్నాయి. దీని తరువాత తెలంగాణ, ఎపిలోనూ డ్రగ్స్ వాడకం పెరిగిందని ఆ నివేదిక తేటతెల్లం చేసింది. భారత్‌లో ఎక్కువగా ఉత్పత్తి అయ్యే డ్రగ్స్‌లో గంజాయి మొదటి స్థానంలో వుంది. ఏటా ఆరు లక్షల కిలోలకు పైగా గంజాయిని భారత్‌లోని పలు రాష్ట్రాల్లో ఉత్పత్తి చేస్తున్నారు. గంజాయి ఉత్పత్తిలో ఒడిషా అగ్రభాగాన వుంది. ఒడిషాలోని రాయగడ,



మల్కన్‌గిరి, కోరాపుట్, బౌద్ధ్, గంజాం తదితర జిల్లాలలో గంజాయి సాగు ఎక్కువగా వుంది. ఇవన్నీ అటవీ ప్రాంతం ఎక్కువగా వున్న జిల్లాలు కావడం, పోలీసులు వెళ్లలేకపోవడం వంటి అంశాలు స్మగ్లర్లకు వరంగా మారింది. దీని తరువాత హిమాచల్ ప్రదేశ్‌లో ఇటీవల హైబ్రీడ్ గంజాయి సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. దీనిని హైడ్రోపోనిక్ గంజాయి అని కూడా పిలుస్తారు. సాధారణ గంజాయితో పోలిస్తే ఎక్కువ ఘాటు, నాణ్యత కూడా మంచిగా వుండడం దీని ప్రత్యేకత. ఇండోనేషియా, థాయ్‌లాండ్‌లో కూడా ఇది ఎక్కువగా సాగవుతోంది. అక్కడ సాగుదారులు భారతీయులే కావడం గమనార్హం. ఇక రసాయన డ్రగ్స్ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఉత్పత్తి అవుతోంది. మూతపడ్డ పరిశ్రమల్లో ఎవరికి అనుమానం రాకుండా ఈ డ్రగ్స్‌ను కొందరు కెమిస్ట్‌లు తయారు చేస్తున్నారు. గంజాయితో పాటు ఇతర రకాల డ్రగ్స్ రవాణా, స్మగ్లింగ్ కష్టంగా మారడంతో చాలా మంది వ్యసనపరులు సులభంగా అందుబాటులో వుంటున్న సింథటిక్ డ్రగ్స్ వైపు చూస్తున్నారని ఎన్‌సిబి అధికారులు చెబుతున్నారు. గంజాయి సాగు వరకు వస్తే నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో గణాంకాల ప్రకారం దేశంలోని 15రాష్ట్రాల్లో గంజాయి సాగు ఏయేటి కాయేడు పెరుగుతూనే వుంది. ఈశాన్య రాష్ట్రాల్లో గంజాయి సాగు ఎక్కువగా వుండగా ఒడిషాతో పాటు దక్షిణాది రాష్ట్రం తమిళనాడుతో పాటు ఎపిలో దీని సాగు ఎక్కువగా వుంది. ఒడిషాకు ఎపి సరిహద్దు కావడంతో దాని ప్రభావం ఎపిలోని పలు ప్రాంతాల్లో వుందని అధికారులు చెబుతున్నారు. ఇక తెలుగు రాష్ట్రాలు గంజాయి కారిడార్‌గా మారడం గమనార్హం. ముంబాయి అండర్ వరల్డ్ మాఫియాకు చెందిన డాన్‌లతో పాటు అదే ప్రాంతానికి చెందిన డ్రగ్స్ మాఫియా నేరగాళ్ల ఎపితో పాటు ఒడిషాలో గంజాయి సాగును ఎక్కువగా ప్రోత్సహిస్తున్న విషయం చాలా కాలం క్రితమే వెలుగు చూసింది. గంజాయి సాగుకు అనువైన అనేక మారుమూల ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు, దట్టమైన అడవులు వున్న ఏజెన్సీ ప్రాంతాలు, పోలీసులు, అబ్కారీ, రెవెన్యూ శాఖల అధికారులు సులభంగా వెళ్లలేని గ్రామాలు ఇక్కడ వందల సంఖ్యలో వుండడం స్మగ్లర్లకు బాగా కలిసి వస్తుంది. ఈ ఒక్క కారణంతోనేస్మగ్లర్లు ఆయా ప్రాంతాలలోని రైతులను మచ్చిక చేసుకుని డబ్బులు ఆశచూపుతూ వేలాది ఎకరాల్లో గంజాయిని సాగు చేయిసున్నారని ఎన్‌సిబి తేల్చింది. ఎపి, ఒడిషాలో గంజాయి సాగుకు సంబంధించి అటు కేంద్రం,ఇటు రాష్ట్రాల వద్ద ఇంత పక్కాగా లెక్కలు వున్నా దీని నివారణకు పగడ్బందీ వ్యూహం లేకపోవడం పెద్ద మైనస్ పాయింట్ కాగా సరిగ్గా ఈ అంశమే స్మగ్లర్ల పాలిట వరంగా మారిందని నిపుణులు అంటున్నారు.గంజాయి పంట సాగు చేయాలంటేమొదట స్మగ్లర్లు రావాలి.వారికి స్థానిక గంజాయి స్మగ్లర్లు, ఇతర నేరగాళ్లు కలవాలి. ఆ తరువాత ఎన్ని ఎకరాల్లో సాగు చేయాలి, ఎక్కడ సాగు చేయాలి,ఆయా ప్రాంతాలలోని రైతులను ఒప్పించి వారికి పెట్టుబడులతోపాటు నాణ్యమైన విత్తనాలు,ముందుగానే లాభాలను ఇచ్చేస్తారు. దీని తరువాత ఐదారు నెలలకు గంజాయి పంట ఏపుగా పెరిగి చేతికి వస్తుంది. ఈలోపు స్మగ్లర్లు ఐదారుసార్లు వచ్చి పంట ఏ విధంగా సాగవుతుందో చూస్తారు. ఒకవేళ పంట ఏపుగా పెరగకుంటే ఎరువులు వాడతారు. ఇందుకు కావాల్సిన పెట్టుబడులు కూడా స్మగ్లర్లే సమకూరుస్తారు. ఇదంతా జరిగిన తరువాత గంజాయి పంటనుకోయడం మరో ఎత్తుగా చెప్పాలి. గంజాయి పంట చూడడానికి జనుముపంట లాగా వుంటుంది. గంజాయి పంటను కూడా ఇలాగే ఎండలో ఆర పెట్టాల్సి వుంటుంది. ఇలా ఆరపెట్టిన గంజాయి పంటను స్మగ్లర్లు పొలంలోనే గ్రేడింగ్ చేస్తా రు. దీనిద్వారా దేనికి ఎంతధర అనేదివారు నిర్ణయిస్తారు. గంజాయి స్మగ్లింగ్‌లో రవాణా కీలకంగా వుంటుంది. పొలం నుంచి గంజాయిని మొదట సమీపంలోని బస్ లేదారైల్వే స్టేషన్లకు తరలించి అక్కడినుంచి పలు వస్తువుల మధ్యవుంచి కావాల్సిన ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ క్రమంలోనే చాలాసార్లు బస్, రైల్వేస్టేషన్ల వద్ద ప్రత్యేక తనిఖీల సమయంలో అనేకసార్లు గంజాయి పట్టుబడిన ఉదంతాలున్నాయి.ఈ క్రమంలోనే స్మగ్లర్లు రెవెన్యూ, పోలీసు, అబ్కారీ విభాగాలకు దండిగా మామూళ్లు ఇస్తున్నారనే అభియోగాలున్నాయి. ఈ నేపథ్యంలోనే మూడు విభాగాల అధికారులు గంజాయి పంట సాగుచేస్తున్న పొలాల జోలికి వెళ్లడం లేదని, ఒకవేళ వెళ్లినా తూతూ మంత్రంగా దాడులు చేస్తూ నాంకే వాస్తేగా కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలూ వున్నాయి. ఇక దేశవ్యాప్తంగా ఇటీవలపాఠశాలలు, కాలేజీలు మొదలుకొని ఐటి కంపెనీల వరకు గంజాయి మహమ్మారి కమ్మేస్తున్న ఘటనలు పెరిగిపోయాయి.ఐదేళ్ల క్రితం పేరొందిన వరంగల్ ప్రాంతీయ ఇంజినీరింగ్ కాలేజీలో అనేకమంది విద్యార్థులు, పూర్వవిద్యార్థులు గంజాయి సేవిస్తూ లేదా తమ వెంట వుంచుకుంటూ పోలీసులకు దొరికిపోయిన ఉదంతం సంచలనం రేపింది. ఈ కాలేజిలో అనేకమార్లు ఈ తరహా ఉదంతాలు వెలుగు చూశాయి. ఈ కాలేజీయే కాదు తెలుగు రాష్ట్రాల్లోని అనేక కాలేజీలు, ముఖ్యంగా ఇంజినీరింగ్ కాలేజీలలో ఇదే పరిస్థితి నెలకొందని ఈగల్ విభాగం దాడుల్లో తేటతెల్లం అయింది. ఇతర రాష్ట్రాల్లో పట్టుబడుతున్న అనేక మంది స్మగ్లర్లు తాము కొంటున్న గంజాయి తెలుగు రాష్ట్రాల నుంచే రవాణా అవుతోందని, ఇదంతా ఎపి, ఒడిషా నుంచి వస్తోందని చెబుతున్నారు. ఇక రాష్ట్రంలో సామాన్యుల నుంచి సెలబ్రటీల వరకు ఈ ఉచ్చులో చిక్కుకోవడం గమనార్హం. ●

# కొత్త 'బాల్' ఆట!

పశ్చిమ బెంగాల్

**ఎ.వి.వి ప్రసాద్**

పిట్ట పోరు పిల్లి తీర్చినట్టుగా మమతా బెనర్జీ, రితబ్రత బెనర్జీ మధ్య తలెత్తిన రాజకీయ పోరును ఎన్నికల కమిషన్ చాలా చిత్రంగా పరిష్కరించింది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాది నాదంటూ ఆ రెండు వర్గాలు తగవులాడుకొంటున్న వేళ.. మీ ఇద్దరిదీ కాదు, కొత్త పేరు, గుర్తు పెట్టుకోండంటూ మధ్యేమార్గం సూచించింది. అది 'న్యాయ' సమ్మతమో కాదో అలా ఉంచితే, ప్రస్తుతానికి మారిన పేరు, గుర్తుతో వారిద్దరు సర్దుకోకతప్పని పరిస్థితి ఏర్పడింది. ఓ వంక నందిగ్రామ్, రెజీ నగర్ ఉప ఎన్నికలు ముంచుకొస్తున్నాయి.ఆ ఎన్నికలకు రెండు గ్రూపులు టిఎంసి పేరుతోనే తలపడాలని భావించడంతో ఇసి రంగప్రవేశం చేసింది. మమత వర్గానికి 'మమతా ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్', రితబ్రత వర్గానికి 'డెమొక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరును ఇసి ఖరారుచేసింది.ఈ రెండు పేర్లలోను 'తృణమూల్ కాంగ్రెస్'.అలాగే ఉండడం గమనించవలసిన అంశం. అలాగే మమత పార్టీకి 'ఫుట్ బాల్ ప్లేయర్' గుర్తు,రితబ్రత వర్గానికి 'ఎన్వలప్' గుర్తును కేటాయించడం విశేషం. ఫుట్‌బాల్ ఆటతోను, ప్లేయర్ల తోను మమతకు ఉన్న అనుబంధం వల్ల కాబోలు! ఆమెకు ఫుట్ బాల్ ప్లేయర్ గుర్తు లభించి ఉంటుంది. ఆమెకు ఫుట్‌బాల్ ఆటపై మక్కువ ఎక్కువ కావడంతో ప్రత్యర్థులను ఆమె ఇక ఫుట్‌బాల్ ఆడేస్తారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అలాగే రితబ్రత తన ప్రత్యర్థులను 'మడిచి కవర్లో పెట్టేస్తా'రనే వ్యాఖ్యలూ వినవస్తున్నాయి. వాటిమాటెలా ఉన్నా, ఈ ఎన్నికల్లోనైనా గట్టెక్కాలనుకొన్న మమత ఆశలకు ఆదిలోనే హంస పాదుపడినట్లు కనిపిస్తోంది.నందిగ్రామ్ నుంచి మమత స్వయంగా పోటీ చేస్తారని చాలా ప్రచారమే జరిగింది కానీ చివరికి సంచితా ప్రదాన్ అనే అభ్యర్థిని బరిలోకి దింపారు. అయితే ఏం జరిగిందోఏమో! ఆమె హఠాత్తుగా పోటీ నుంచి విరమించి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తారు. ముఖ్యమంత్రి సువేందు అధికారితో గత గురువారం సమావేశమైన ఆమె వెంటనే శుక్రవారమే తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకోవడం మమతకు నిజంగానే పెద్ద 'షాక్' అనవచ్చు. నామినేషన్ దాఖలుకు గడువు పూర్తవడంతో మరొకరిని బరిలోకి దింపే అవకాశం మమతకు లేకపోయింది.దీనితోకాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు మమత ప్రకటించారు. కానీ విచిత్రంగా కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రదాన్ శుక్రవారం నాడే అరెస్టయ్యారు. భూసేకరణకు వ్యతిరేకంగా2007లో నందిగ్రామ్‌లో చేపట్టిన ఆందోళనల కేసులో మిలన్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఇది మరోవివాదం తృణమూల్ కాంగ్రెస్ అసలు గుర్తుఅయిన'పూలు గడ్డి'ని పక్కన పెట్టి



మమతా బెనర్జీ

రెండు వర్గాలకు కొత్త గుర్తులు కేటాయించడం వెనుక చాలా పెద్ద కుట్ర ఉన్నదని మమత ఆరోపిస్తూ 'సుప్రీం' తలుపు తట్టారు. అక్కడ ఏం తేలుతుందనేది తర్వాత కథ. ముందు ఉప ఎన్నికలైతే ఆమెకు అడ్డం తిరిగినట్లే కనిపిస్తున్నాయి. అరూప్ రాయ్ అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న టిఎంసి ప్రత్యర్థి వర్గం బలం కూడా ఎక్కువే. అయితే తిరుగుబాటు వర్గానికి చెందిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ దాఖలైంది. అసెంబ్లీ వారికి నోటీసులుకూడా ఇచ్చింది. పార్టీ కార్యాలయం, నిధులు,సంస్థాగత నియంత్రణపై రెండు వర్గాల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఉపఎన్నికల్లో కూడా ముందే ఎదురు దెబ్బతగలడం మమతకు కొత్త తలనొప్పే అనిపిస్తుంది.నాలుగు నెలలక్రితం అసెంబ్లీ ఎన్నికల్లో కలిగిన ఘోర పరాజయం తలకు పెద్ద బొప్పినే కట్టించగా, ఉప ఎన్నికలు దానిపై సమ్మెట దెబ్బ కొట్టినట్లుగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి 46 శాతం ఓట్లు రాగా, టిఎంసికి 40 శాతం వచ్చాయి. అయితే సీట్లు 80 దగ్గరే ఆగిపోయాయి.2021లో 215 సీట్లతో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మమతా బెనర్జీ 2026 ఎన్నికల్లో సాధారణ మెజారిటీకి కూడా చాలా దూరంలోనే ఉండిపోయారు. అదే సమయంలో బిజెపి 46 శాతం ఓట్లు, 208 సీట్లతో అధికారం కైవసం చేసుకుంది. అంటే మమత పార్టీ 2021 కంటే 2026 లో 133సీట్లు కోల్పోయింది. ఒక్క సీటు కూడా లేని కాంగ్రెస్‌కు ఇటీవలి ఎన్నికల్లో కంటి తుడుపుగా ఓ రెండు సీట్లు మాత్రం దక్కాయి అటువంటి కాంగ్రెస్‌తో చేతులు కలిపి గట్టెక్కాలనుకోవడాన్ని చూస్తే మమత వ్యూహ రచనపై అనేక సందేహాలు కలుగుతాయి. భవానీపూర్‌లో మమతను ఓడించిన ముఖ్యమంత్రి సువేందు అధికారి నందిగ్రామ్‌లో కూడా గెలిచారు. ఆయన ఖాళీ చేసిన సీటు కావడంతో ఉపఎన్నికలోకూడా ఆ సీటు బిజెపికే లభిస్తుందనడంలో సందేహం లేదు. టిఎంసి విభజన, కొత్త పార్టీ పేరు, గుర్తు వంటి పరిణామాల నేపథ్యంలో ఉప ఎన్నికల్లో ఓటర్లు తిరిగి బిజెపి వైపే మొగ్గు చూపవచ్చు. రెండు పార్టీల మధ్య ఓటు శాతం తేడా కేవలం ఐదు పాయింట్లే అయినా సీట్ల తేడా 127 పైగా ఉంది. దీనిని బట్టి చూస్తే ఉప ఎన్నికలు జరిగే రెండు నియోజకవర్గాలలో కూడా బిజెపికే ఎక్కువ విజయావకాశాలు ఉన్నాయనిపిస్తుంది. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో బిజెపికి 50.4 శాతం ఓట్లురాగా,టిఎంసికి 46శాతం వచ్చాయి.కాంగ్రెస్‌కు కేవలం 0.31శాతం ఓట్లే వచ్చాయి. టిఎంసిగా ఇప్పుడు ఆ పార్టీ ఉనికి లేదు గనుక కొత్త పార్టీ ఎంతవరకు ఓట్లు ఆకర్షించగలదన్నదికూడా సందేహమే. నందిగ్రామ్‌తో పాటు రెజీనగర్‌లో కూడా మమత అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకొనడంతో రెండు చోట్లా ఆమెకుఅభ్యర్థులు లేని పరిస్థితి ఏర్పడింది. ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులు బిజెపికి గట్టి పోటీ ఇచ్చే స్థితిలో లేరు. మమత పార్టీ ప్రత్యక్షంగా బరిలో లేకపోవడంతో ప్రస్తుతానికి వెనుకబడినట్లే అనుకోవాలి. మమత పార్టీ ఓట్లు ఎంత మేరకు కాంగ్రెస్‌కు బదలీ కాగలవో వచ్చే అక్టోబరు తొమ్మిదవ తేదీన వెలువడే ఫలితాలే చెబుతాయి. మొత్తానికి చేతిలోకి ఫుట్ బాల్ వచ్చినా మమత సరైన ఆట ఆడలేకపోతున్నారనే అభిప్రాయమే వినిపిస్తోంది. ●

# పుతిన్ ప్రతిష్టకు పరీక్ష!

రష్యా

**గన్ని మోహన్**

ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధం, ఆర్థిక ఒత్తిళ్లు, రాజకీయ ప్రతిపక్షాలపై పెరుగుతున్న ఆంక్షల మధ్య రష్యాలో మూడు రోజుల పార్లమెంటరీ ఎన్నికలు ప్రారంభమయ్యాయి. 450 మంది సభ్యులతో కూడిన రష్యా దిగువ సభ స్టేట్ డూమాకు ప్రతినిధులను ఎన్నుకోవడంతో పాటు ప్రాంతీయ, స్థానిక ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. సుమారు 11.1 కోట్ల మంది అర్హత కలిగిన ఓటర్లను దృష్టిలో ఉంచుకుని ఓటింగును మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచడమే దీని ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. ఈసారి తొలిసారిగా 2022లో ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి దాడి అనంతరం రష్యా విలీనం చేసుకున్నట్లు ప్రకటించిన నాలుగు ఉక్రెయిన్ ప్రాంతాల నివాసితులను కూడా ఎన్నికల ప్రక్రియలో చేర్చారు. అయితే ఈ ఎన్నికలను ఉక్రెయిన్ చట్టవిరుద్ధమైనవిగా పేర్కొంటున్నా ఆక్రమిత ప్రాంతాల్లోకూడా రష్యా ఎన్నికలు నిర్వహిస్తోంది. నిజానికి ఈ ఎన్నికలు నామమాత్రమేనని చెప్పాలి. ఎందుకంటే పుతిన్ నేతృత్వంలోని యునైటెడ్ రష్యా పార్టీకే మళ్లీ పగ్గాలు దక్కుతాయనేది అందరికీ తెలిసిందే. క్రెమ్లిన్‌కు అనుకూలమైన ప్రధాన పార్టీ యునైటెడ్ రష్యా ప్రస్తుతం స్టేట్ డూమాలోమూడింట రెండొంతులకుపైగా స్థానాలను కలిగి ఉంది. ఈ ఎన్నికల్లోనూ ఆపార్టీ తన ఆధిపత్యాన్ని కొనసాగించే అవకాశం లేకపోలేదు. ఉక్రెయిన్‌పైయుద్ధం, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, మరో పక్క అమెరికాతో నిరంతర వివాదం ఆంక్షలు, సుంకాల విధింపు వంటి వాటి నేపథ్యంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. కమ్యూనిస్ట్ పార్టీ, లిబరల్ డెమోక్రటిక్ పార్టీ, ఎ జస్ట్ రష్యా వంటి అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విధానాలకుమద్దతు ఇచ్చే ఇతర పార్టీలు కూడా పార్లమెంటులో తమ ప్రాతినిధ్యాన్ని కొనసాగించే అవకాశం ఉంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా పూర్తి స్థాయి దాడిని ప్రారంభించిన తర్వాత జరుగుతున్న తొలి యుద్ధకాల పార్లమెంటరీ ఎన్నికలు ఇవే. వేసవిలో ఉక్రెయిన్‌కు చెందిన డ్రోన్ దాడులు రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు, రవాణాలాజిస్టిక్స్ కేంద్రాలు, ఇతర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నాయి. చమురు శుద్ధి కేంద్రాలపై జరిగినదాడులు ఇంధన కొరతకు, ఆర్థిక ఒత్తిళ్లకు కారణమయ్యాయి. దీనికి ప్రతిస్పందనగా రష్యా,ఉక్రెయిన్‌నగరాలపై క్షిపణి, డ్రోన్ దాడులను మరింత తీవ్రతరం చేసింది. నల్ల సముద్రంలోని నౌకాశ్రయాలపై కూడా దాడులు పెరిగాయి. ఎన్నికల అనంతరం మరోసారి పెద్దఎత్తున సైనిక సమీకరణ చేపట్టవచ్చన్న చర్చ కూడా కొనసాగుతోంది. అయితే అలాంటి సమీకరణపై



పుతిన్

వస్తున్న వార్తలను పుతిన్ అర్థంలేని మాటలు'గాకొట్టిపారేసినా తప్పకుండా భీకర దాడులు ఎన్నికల తర్వాత ఉంటాయన్నది నిర్వివాదాంశం. 2022లో రష్యా3లక్షల మందిరిజర్వ్ సైనికులను పాక్షికంగా సమీకరించింది. ఆ సమయంలో లక్షలాది మంది రష్యన్లు దేశం విడిచి వెళ్లారు.ఎన్నికలకు ముందు రష్యాలోరాజకీయ ప్రతిపక్షాలపై ఆంక్షలుమరింత పెరిగాయి. పార్లమెంటరీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం మొదట 11పార్టీలను ఆమోదించింది. వాటిలో యుద్ధాన్ని బహిరంగంగా విమర్శించిన ఏకైక పార్టీగా యాబ్లోకో నిలిచింది. అయితే జాతీయవాద పార్టీ మదర్లాండ్ చేసిన అప్పీల్ అనంతరం రష్యా సుప్రీంకోర్టు యాబ్లోకోను ఎన్నికల బరిలో నుంచి తొలగించింది.రష్యా ప్రాదేశిక సమగ్రతను దెబ్బతీసే విధానాలను ఆ పార్టీ ప్రోత్సహిస్తోందని మదర్లాండ్ ఆరోపించింది. యాబ్లోకోకు చెందిన పలువురు నేతలుకూడా యుద్ధంపై విమర్శలు చేసిన కేసుల్లో చట్టపరమైన చర్యలను ఎదుర్కొన్నారు. మాక్సిమ్ క్రుగ్లోవ్‌కు సైన్యం గురించి అధికారులు తప్పుడు సమాచారంగా పేర్కొన్న విషయాలను ప్రచారం చేసిన కేసులో ఏడేళ్ల జైలు శిక్ష విధించారు.మరో యాబ్లోకో నేత లెవ్ ష్లోస్బర్గుకు 11 సంవత్సరాలకు పైగా శిక్ష విధించారు. అలాగే వ్యక్తిగత నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలనుకున్న పలువురు యాబ్లోకో అభ్యర్థులను కూడా అధికారులు అడ్డుకున్నారు. యుద్ధం కొనసాగుతున్న కొద్దీ రష్యా ఆర్థికవ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది. పెరుగుతున్న బడ్జెట్ లోటును నిర్వహించేందుకు ప్రభుత్వం పన్నులను పెంచడంతోపాటు దేశీయ రుణాలపై ఆధారపడుతోంది. రష్యా,ఇంధనమౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ దాడులు ఇంధన కొరతకు దారితీశాయి. ఆన్లైన్ రిటైల్ సంస్థలు వైల్డ్ బెర్రీస్,ఓజోన్ నిర్వహిస్తున్న గిడ్డంగులపై జరిగిన దాడుల్లో లక్షలాది మంది విక్రేతలకు నష్టం వాటిల్లింది.స్వతంత్ర లెవాడా సెంటర్ గణాంకాలప్రకారం పుతిన్ ఆమోద రేటింగ్ 2026 ఆగస్టులో 76శాతానికి పడిపోయింది. 2025సెప్టెంబరులో ఇది 87శాతంగా నమోదైంది. అయినప్పటికీ, యుద్ధం, ఆర్థికసమస్యలపై ప్రజల్లో ఆందోళనలు ఉన్నప్పటికీ క్రెమ్లిన్ రాజకీయ ఆధిపత్యానికి తక్షణ ముప్పులేదని అధికార పార్టీ నేతలు ధీమాతో ఉన్నారు. రష్యా స్టేట్ డూమాలో మొత్తం 450 స్థానాలు ఉన్నాయి. ఇందులో సగం స్థానాలను పార్టీ జాబితాల ద్వారా,మిగిలిన సగాన్నిఏకసభ్య నియోజకవర్గాల ద్వారా ఎన్నుకుంటారు.ప్రస్తుతం యునైటెడ్ రష్యాకు స్పష్టమైన మెజారిటీ ఉంది. ఓట్లశాతం తగ్గినా ఆపార్టీ ఆధిపత్యం కొనసాగించేలా క్రెమ్లిన్ చర్యలు తీసుకుంటుందన్న అంచనాలు భారీగా ఉన్నాయి. ఎన్నికల్లో పోలింగ్ శాతం, ఉక్రెయిన్ యుద్ధంపై ప్రజల వైఖరికి సంబంధించిన విస్తృత రాజకీయ సందేశం కూడా ఈఎన్నికల్లో కీలకంగా మారింది. రష్యా ప్రభుత్వం ఈ ఎన్నికలను దేశనాయకత్వానికి, సైన్యానికి ప్రజల మద్దతును చాటే అవకాశంగా చూపుతోంది. మరోవైపు ప్రతిపక్ష నేతలు, విమర్శకులు యుద్ధ వ్యతిరేక అభ్యర్థులు, పార్టీలపై విధించిన ఆంక్షలను ప్రశ్నిస్తున్నారు. మూడు రోజుల పాటు కొనసాగే ఓటింగ్‌లోపుతిన్ పట్ల ప్రజల్లో ధీమా ఏమాత్రం సడలదన్న ధీమాతో ఆ పార్టీనేతలుంటే ప్రజల తీర్పు ఎలా ఉంటుందన్నది ఈ స్టేట్‌డుమా ఎన్నికలు చెప్పబోతున్నాయి. ●

# పేద, మధ్యతరగతికి పెరుగుతున్న 'నెల బిల్లు'



**డాక్టర్ రామకృష్ణ బండారు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి మన దేశ స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి) 7.8 శాతంగా నమోదు అయింది. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది అని గణాంకాలు చెపుతున్నాయి. కానీ, దేశంలో పేద, మధ్య తరగతి ప్రజల నెలవారీ బడ్జెట్ గత కొన్ని నెలలుగా ఆకాశానికి చేరుతుంది. ప్రతీ నెల మొదటి తేదీన జీతం కోసం ఎదురుచూసే పేద, మధ్య తరగతికి చెందిన సగటు వ్యక్తి జీతం బ్యాంకులో పడగానే ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజు, కరెంట్ బిల్లు, వంటింటి సరుకులు, ప్రయాణ ఖర్చులు, రుణ వాయిదాలు (ఇన్స్టాల్మెంట్స్) వంటి ఖర్చులకు బడ్జెట్ వేసుకొని మిగిలినదానిని పొదుపు రూపంలో భవిష్యత్ అవసరాలకోసం దాచుకుంటాడు. కానీ గత రెండు నెలలుగా దేశంలో పేద,మధ్యతరగతి ప్రజానీకం ఆర్థిక పరిస్థితి మారిపోయింది. పొదుపు సంగతి పక్కన పెడితే, అత్యవసర పరిస్థితి వస్తే ఆర్థికంగా ఎలా ఎదుర్కోవాలో తెలియని ఆందోళన దేశంలోని సగటు పేద మధ్యతరగతి కుటుంబాలను వెంటాడుతోంది. దానికి కారణం దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడమే. ఈ పరిస్థితికి ప్రత్యక్షంగా ఎవరూ కారణం కాకపోయినప్పటికీ, పరోక్షంగా పకృతి వైపరీత్యాలు,అంతర్జాతీయ సంక్షోభాలు కారణం అని చెప్పక తప్పదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజానీకం నెలవారీ బడ్జెట్ పెరిగిపోతుంది. అది వారి పొదుపును ప్రభావితం చేస్తుంది.ఒకవిధంగా దేశంలో 'ద్రవ్యోల్బణం' నెమ్మదిగా పెరుగుతుంది అని చెప్పవచ్చు. అసలు ఏయే వస్తువుల ధరలు మధ్యతరగతి ప్రజల నెలవారీ బడ్జెట్ పెరుగుదలకు కారణమవుతున్నాయి? ధరల పెరుగుదలకు కారణాలు ఏమిటి? ఎంతకాలం ఈపరిస్థితి కొనసాగుతుంది? ప్రభుత్వాల చర్యలు ఏమిటి ? అనేవి సామాన్య ప్రజానీకానికి అంతుపట్టని అంశాలు,ప్రస్తుత పరిస్థితులలో పేద, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్‌ను ఎక్కువ ప్రభావితం చేసేది వారి వంటింటి బడ్జెట్. వంటింటిలోకి కావలసిన నిత్యావసరాల వస్తువుల ధరలు ఇప్పుడు ఆకాశాన్ని అంటుతున్నాయి. గ్యాస్, నూనెలు, ఉప్పు,పప్పుదినుసులు, ఉల్లిపాయలు, కూరగాయల ధరలు ఇలా అన్నిరకాల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా, వంట గ్యాస్ ధరల పెరుగుదల సామాన్య ప్రజానికినిపై పెను భారమే మోపుతోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, ఇంధన సరఫరా మార్గాల్లో ఏర్పడుతున్న అంతరాయాలు, అంతర్జాతీయ ముడిచమురు, ఎల్.పి.జి మార్కెట్లలో చోటుచేసుకుంటున్న హెచ్చుతగ్గులు భారత్‌లో ఇంధన ధరలపై ప్రభావం చూపుతున్నాయి. సెప్టెంబర్ 2025 లో 853 రూపాయలుగా ఉన్న 14.2 కిలోల గృహ ఎల్.పి.జి సిలిండర్ ధర సెప్టెంబర్ 2026 నాటికి ప్రాంతాన్ని బట్టి సుమారు 1000 రూపాయలకు చేరింది. అంటే ఒక్క సిలిండర్పై సుమారు 150రూపాయల వరకు అదనపు భారం పెరిగింది. అలాగే, బియ్యం,నూనె ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. బియ్యం విషయానికి వస్తే రెండు నెలల క్రితం వరకు బహిరంగ మార్కెట్లో కిలో 50 నుండి 55 రూపాయల వరకు లభించిన సన్నరకం బియ్యం ధర, ప్రస్తుతం ఏకంగా 10 నుండి 20 వరకు పెరిగింది. ఇప్పుడు కిలో సన్నబియ్యం ధర 60 నుండి 70 రూపాయలకు చేరింది. 25 కేజీల బియ్యం బస్తాపై సుమారు 400 వందల వరకు ధరలు పెరిగాయి. బియ్యంధరలు ఈ స్థాయిలో పెరగడానికి వివిధ కారణాలున్నాయి. గత సీజన్లో ఆశించిన స్థాయిలో సన్న బియ్యం దిగుబడి రాకపోవడం, రైస్ మిల్ వ్యాపారస్తుల వద్ద నిల్వలు క్రమంగా తగ్గిపోవడంతో మార్కెట్లలో సన్నబియ్యానికి కొరత ఏర్పడింది. ముఖ్యంగా, 'ఎలినినో' ప్రభావంతో ఈ సంవత్సరం కేవలం కర్ణాటకలోనే కాకుండా దేశవ్యాప్తగం వర్షాలు తగి



నంతగా పడలేదు. ఫలితంగా వరి దిగుబడి ఈ సంవత్సరం తగ్గుతుంది. అందుకే, వ్యాపారస్తులు బియ్యం అక్రమంగా నిల్వఉంచి, కృత్రిమ కొరతసృష్టించి భవిష్యత్‌లోబియ్యాన్ని ఎక్కువ ధరకు అమ్ముకునే పక్రియ జరుగుతుంది. అలాగే, ప్రభుత్వం వరి మద్దతు ధరను పెంచడం కూడా బహిరంగ మార్కెట్లో ధరల పెరుగుదలకు ఒక కారణమైంది. సాధారణంగా 4 నుంచి 5 మంది ఉన్న ఒక సగటు కుటుంబానికి నెలకు కనీసం 25నుండి 40 కిలోల బియ్యం అవసరమవుతాయి. బియ్యం ధరలు కిలోపై 15 నుండి 20 రూపాయలకు పెరగడంతో ప్రతి కుటుంబంపై నెలకు 500 నుండి 800 రూపాయల వరకు అదనపు భారం పడుతోంది. ఇక వంట నూనెల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. గత ఏడాది లీటరు 110 నుండి 140 రూపాయల మధ్య ఉన్న వంట నూనెల ధరలు ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో సుమారు 180 నుండి 200 రూపాయల మధ్య ఉన్నాయి. మన దేశం వంట నూనెల అవసరాలలో దాదాపు 60 శాతం పైగా ఇతర దేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. అందువల్ల ప్రపంచ మార్కెట్లో వచ్చే చిన్న మార్పు కూడా మన 'వంటింటి బడ్జెట్' పై తీవ్రప్రభావం చూపుతుంది. ప్రపంచంలోనే అతిపెద్ద పామాయిల్ ఎగుమతిదారు అయిన ఇండోనేషియా తన 'బయో ఇంధన విధానాన్ని' (ఇంధనంలో 50 శాతం పామాయిల్ కలపడం) వేగవంతం చేసింది. దీనివల్ల వంట నూనెగా వాడే 'పామాయిల్'ను వాహనాల ఇంధనం తయారీకి మళ్లిస్తున్నారు. ఫలితంగా ప్రపంచ మార్కెట్లో పామాయిల్ లభ్యత తగ్గి ధరలు పెరిగాయి. ఇక సెప్టెంబర్ 2025లో ఒక్క కిలో కందిపప్పు ధర 106రూపాయలు కానీ ప్రస్తుతం అది 150 రూపాయలకు రిటైల్ మార్కెట్‌లో లభిస్తుంది. అదేవిధంగా, వేరుశనగ ఒక్క కిలో ధర 2025 సెప్టెంబర్‌లో 140నుండి 150 రూపాయల వరకు ఉండగా, ప్రస్తుతం 180 రూపాయల వరకు పెరిగింది. ఎండు మిర్చి కిలో ధర 2025 సెంప్టెంబర్‌లో 160 రూపాయలు ఉండగా ప్రస్తుతం 270 నుండి 300 వరకు పెరిగింది. ఇక ప్రతీ వ్యక్తికీ నిత్యావసరమైన పంచదార, బెల్లం ధరలు సుమారు 70 శాతం వరకు పెరిగాయి. పంచదారను ప్రతీ కుటుంబం ఉపయోగిస్తుంది. రానున్న రోజుల్లో పండగలు రానున్నాయి. ఇటువంటి సమయంలో పంచదార, బెల్లం వంటి ధరలు పెరుగుదల పేద మధ్యతరగతి వారికీ భారమే అని చెప్పాలి. గడచిన ఏడాదితో పోల్చితే ప్రస్తుతం అన్నిరకాల 'వంటింటి దినుసుల ధరలు సుమారు 20 శాతం పెరిగాయి. కేవలం గ్యాస్, వంటింటి దినుసుల ధరలే కాకుండా కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ముఖ్యంగా, ఉల్లిపాయ ధర వినియోగదారునికి కన్నీరు తెప్పిస్తుంది. గతనెల రోజుల క్రితం ఒక కిలో ఉల్లిపాయ రూ.20నుండి రూ.25 మధ్య ఉండగా, ప్రస్తుతం అది 65నుండి 70 రూపాయల మధ్య లభిస్తుంది. అంటే సుమారు 100శాతం ధరలు పెరిగాయి. ఇక కూరగాయల ధరలు కూడా పెరిగాయి. అన్ని రకాల కురాగాలు కిలో 50 రూపాయల పైననే రిటైల్ మార్కెట్‌లో అమ్ముతున్నారు. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఫలితంగా దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉన్నది. తాజా అధికారిక గణాంకాలు కూడా అదే తెలియచేస్తున్నాయి. 2025 జులైలో రిటైల్ ద్రవ్యల్బణం 1.55 శాతం గా ఉండగా అది 2026 జులై నెలకి 4.45శాతానికి పెరిగింది. భారతదేశంలో వ్యవసాయం ఇప్పటికీ 50శాతం పైగా వర్షాలపైనే ఆధారపడి ఉంది. భూగర్భ జలాలు,జలాశయాల క్షీ ణత వలన ఈ సంవత్సరం పంటల దిగుమతి తక్కువే. ఇలా వివిధ కారణాల వలన ఆహారధాన్యాల ధరలు దేశంలో పెరుగుతు న్నాయి. ఆ ప్రభావం దేశంలోని పేద, మధ్య తరగతి నెల వారీ బడ్జెట్‌పై పడుతుంది. పేద కుటుంబాల్లో ఇది ఇంకా ఎక్కువగా ఉంటుంది. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నది. అందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా, దేశీయంగా కొరత గా ఉన్న బియ్యం, గోధుమలు, చక్కెర, ఉల్లిపాయ వంటి వాటి ఎగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే, విదేశాల నుండి దిగుమతి చేసుకునే పప్పుధాన్యాలు,వంట నూనెలపై దిగుమతి సుంకాలు తగ్గించాలి. ప్రభుత్వం, రేషన్ షాప్ ల ద్వారా పంచదార, ఆయిల్ వంటి ధరలు పెరిగే ఇతర నిత్యావసర వస్తువులను పేద, మధ్య

20-9Pg5:20-9Pg5.qxd 9/19/2026 10:23 PM Page 1



# పర్యావరణ పరిరక్షణలో భారత్ ప్రపంచానికే దిక్సూచి

## ప్రధాని నరేంద్రమోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** పర్యావరణాన్ని కాపాడుకుంటూనే ఆర్థికంగా ఎలా ఎదగాలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్" అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. మన దేశంలో పునరుత్పాదక ఇంధనం, పరిశుభ్రమైన రవాణా వ్యవస్థలు, నీటి సంరక్షణ ఎంత వేగంగా విస్తరిస్తున్నాయో వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటే ఆర్థిక పురోగతి కూడా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రకృతితో మమేకమై జీవించడం భారత్‌కు శతాబ్దాల నుంచి వస్తున్న ఆచారం అని మోడీ గుర్తుచేశారు. తరతరాలుగా పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన భారత్, ఆ సాంప్రదాయ అనుభవాలు, సిద్ధాంతాల పునాదిగానే నేటి ఆధునిక వాతావరణ సమస్యలకు పరిష్కారాలు చూపుతోందన్నారు. ప్రపంచ దేశాలన్నీ పర్యావరణ పరిరక్షణకు కలిసికట్టుగా ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో తలసరి కార్బన్ ఉద్గారాల పరిమాణం చాలా తక్కువగా ఉందన్నారు. మన ప్రాచీన పర్యావరణ ఆలోచనలనే నేటి ఆధునిక పరిష్కారాలుగా మారుస్తూ ప్రకృతిని కాపాడుకుంటున్నామని తెలిపారు. భారత్ వాతావరణ వ్యూహంలో పునరుత్పాదక ఇంధనానిదే ప్రధాన పాత్ర అని మోడీ స్పష్టం చేశారు. ముఖ్యంగా సౌర విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేవలం 12 ఏళ్ల క్రితం 2 గిగావాట్లుగా ఉన్న మన సోలార్ సామర్థ్యం, ఈరోజు ఏకంగా 160 గిగావాట్లకు పైగా పెరిగిందని వెల్లడించారు. ఒక్క సోలార్ ఎనర్జీ వల్లే దాదాపు 20 కోట్ల టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలో కలవకుండా నిరోధించగలిగామని చెప్పారు. పవన విద్యుత్ సామర్థ్యం కూడా గత 12 ఏళ్లలో మూడు రెట్లు పెరిగిందని, దీనికి తోడు జల విద్యుత్ రంగాన్ని కూడా విస్తరించామని చెప్పారు. వీటితో పాటు అణు విద్యుత్‌ను పెంచడానికి, క్లీన్ ఎనర్జీ రంగంలోకి ప్రైవేట్ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

# ట్రంప్‌కు నానాటికి తగ్గుతున్న ప్రజాదరణ

## ఆర్థిక సమస్యలపై అమెరికన్ల ఆందోళన

## అధ్యక్షుని తీరుపట్ల 60 శాతం మందిలో అసంతృప్తి




**వాషింగ్టన్, సెప్టెంబరు 19:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రజాదరణ రేటింగ్ తాజాగా మరింత దిగజారింది. యూగోవ్ తాజా ట్రాకర్ ప్రకారం, ట్రంప్ పనితీరును 35 శాతం మంది అమెరికన్లు మాత్రమే ఆమోదిస్తుండగా, 60 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆయన నెట్ అప్రూవల్ రేటింగ్ మైనస్ 25గా నమోదైంది. అమెరికన్ల ప్రధాన ఆందోళనల్లో ఆర్థిక అంశాలు, ముఖ్యంగా ద్రవ్యోల్బణం మరియు పెరుగుతున్న ధరలు ముందంజలో ఉన్నాయి. దేశం ఎదుర్కొంటున్న అత్యంత ముఖ్యమైన సమస్య ఏదని ప్రశ్నించగా, 33 శాతం మంది ద్రవ్యోల్బణం, ధరలను పేర్కొన్నారు. ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థ 13 శాతంతో రెండో స్థానంలో ఉండగా, ఆరోగ్య సంరక్షణను 11 శాతం మంది ప్రధాన సమస్యగా గుర్తించారు. యూగోవ్ గణాంకాల్లో పురుషులు, మహిళల మధ్య కూడా గణనీయమైన వ్యత్యాసం కనిపించింది. పురుషుల్లో ట్రంప్ నెట్ అప్రూవల్ సుమారు మైనస్ 18గా ఉండగా, మహిళల్లో ఇది మైనస్ 31గా నమోదైంది. వయస్సు ఆధారంగా చూస్తే, 65 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సున్న వారిలో నెట్ అప్రూవల్ సుమారు మైనస్ 15గా ఉండగా, 30 నుంచి 44 ఏళ్ల వయస్సు వారిలో మైనస్ 39కు చేరింది. జాతి ఆధారిత గణాంకాల్లో ఈ వ్యత్యాసం మరింత స్పష్టంగా కనిపించింది. శ్వేతజాతీయ ఓటర్లలో ట్రంప్ నెట్ అప్రూవల్ సుమారు మైనస్ 15గా ఉండగా, హిస్పానిక్ ఓటర్లలో మైనస్ 32,ఇతరులుగా వర్గీకరించిన వారిలో మైనస్ 43, నల్లజాతీయ ఓటర్లలో మైనస్ 61గా నమోదైంది. విద్యార్హతలను బట్టి కూడా ట్రంప్ పట్ల అభిప్రాయాల్లో తేడా కనిపించింది. హైస్కూల్ విద్య లేదా అంతకంటే తక్కువ విద్య ఉన్నవారిలో నెట్ అప్రూవల్ సుమారు మైనస్ 15గా ఉండగా, కొంత కాలేజీ విద్య ఉన్నవారిలో మైనస్ 25గా ఉంది. కాలేజీ గ్రాడ్యుయేట్లలో ఇది మైనస్ 31, పోస్ట్‌గ్రాడ్యుయేట్లలో మైనస్ 32గా నమోదైంది. ఇటీవలి నెలల్లో ట్రంప్ ఆమోద రేటింగ్ సగటున 30ల చివరి శాతాల్లో కొనసాగుతున్నట్లు పలు పోలింగ్ గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే కొన్ని ప్రత్యేక సర్వేల్లో ఆయన ఆమోదం 30 నుంచి 40 శాతం మధ్య నమోదైంది. దీంతో వ్యక్తిగత సర్వేలు, పోలింగ్ సగటుల మధ్య కొంత వ్యత్యాసం కనిపిస్తోంది. ట్రంప్ అధ్యక్ష పదవీకాలాన్ని అంచనా వేయడంలో ఇరాన్‌పై అమెరికా సైనిక చర్య కూడా ఇటీవల నిర్వహించిన సర్వేల్లో కీలక అంశంగా మారింది. జూలైలో క్విన్నిపియాక్ యూనివర్సిటీ నిర్వహించిన జాతీయ సర్వేలో, ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యకు 34 శాతం మంది నమోదిత ఓటర్లు మద్దతు తెలిపారు. 60 శాతం మంది వ్యతిరేకించారు. ఈ అంశంపై క్విన్నిపియాక్ ప్రశ్నించడం ప్రారంభించిన తర్వాత నమోదైన అత్యధిక వ్యతిరేకత ఇదేనని సర్వే పేర్కొంది. ఏప్రిల్‌లో నిర్వహించిన క్విన్నిపియాక్ సర్వేలో, ఇరాన్ పరిస్థితిని ట్రంప్ ఎదుర్కొంటున్న తీరును 36 శాతం మంది ఆమోదించగా, 58 శాతం మంది వ్యతిరేకించారు. అదే సమయంలో ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యకు 40 శాతం మంది మద్దతు ఇవ్వగా, 53 శాతం మంది వ్యతిరేకించారు. తాజా యూగోవ్ ట్రాకర్ ప్రకారం, విదేశాంగ విధానంతో పాటు దేశీయ సమస్యలు కూడా అమెరికన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ద్రవ్యోల్బణం, ధరలు, ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలు ప్రజల ఆందోళనల్లో ముందున్నాయి. ట్రంప్ అధ్యక్ష పనితీరుపై 35 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయగా, 60 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తాజా యూగోవ్ గణాంకాలు చెబుతున్నాయి.

### హెచ్1బి వీసాలపై మరో యేడాది అనిశ్చితి

### విదేశీ ఉద్యోగుల కోసం 1 లక్ష డాలర్ల ఫీజు కొనసాగింపు

అమెరికాలో పనిచేస్తున్న భారతీయ ఐటీ నిపుణులు, అక్కడి టెక్నాలజీ కంపెనీలకు మరో ఏడాది అనిశ్చితి ఎదురుకానుంది. విదేశీ ఉద్యోగులను అమెరికాకు తీసుకురావడానికి యజమానులు చెల్లించాల్సిన 1,00,000 అమెరికన్ డాలర్ల హెచ్1బి వీసా ఫీజును మరో ఏడాది పాటు కొనసాగిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా వైట్‌హౌస్ ప్రకారం ఈ ఫీజు కొనసాగింపు ద్వారా అమెరికన్ ఉద్యోగులను రక్షించడం, అధిక నైపుణ్యం కలిగిన, అత్యవసరమైన విదేశీ నిపుణులకు మాత్రమే హెచ్1బి వీసాలు అందేలా చూడడం లక్ష్యంగా పెట్టుకున్నారు. హెచ్1బి కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో భారతీయులు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. శుక్రవారం జారీ చేసిన అధ్యక్ష ప్రకటనలో ట్రంప్ మాట్లాడుతూ 2025లో విధించిన 1,00,000 డాలర్ల ఫీజు కారణంగా పెద్ద ఐటీ ఔట్‌సోర్సింగ్ సంస్థల నుంచి వచ్చిన హెచ్1బి రిజిస్ట్రేషన్లు 92 శాతం తగ్గాయని పేర్కొన్నారు. 2025లో జారీ చేసిన ప్రకటనను మరో ఏడాది పొడిగించడం ద్వారా అమెరికా ఆర్థిక, జాతీయ భద్రతా ప్రయోజనాలను కాపాడవచ్చు. అమెరికన్ ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లకు కార్మిక మార్కెట్‌లో అవకాశాలను మెరుగుపరచడంతో పాటు, అత్యంత నైపుణ్యం కలిగిన మరియు అవసరమైన విదేశీ ఉద్యోగులను మాత్రమే నియమించేలా చేయవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వం తొలిసారిగా 2025 సెప్టెంబర్‌లో ఈ భారీ ఫీజును ప్రకటించింది. ఆ నిర్ణయం గడువు ఈ నెలతో ముగియాల్సి ఉండగా, తాజాగా మరో ఏడాది పాటు పొడిగించారు. అయితే అమెరికాలో ఇప్పటికే విద్యార్థి వీసాలపై ఉన్న విదేశీ పౌరులకు మంజూరయ్యే హెచ్1బి వీసాలకు, ప్రస్తుత వీసాల పునరుద్ధరణకు ఈ ఫీజు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం అమెరికాలో నైపుణ్యం కలిగిన భారతీయ ఉద్యోగులను నియమించుకునే భారతీయ, అమెరికన్ ఐటీ సంస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# పాక్ కదలికలు కనిపెట్టే ఇఒఎస్05 శాటిలైట్!



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 19:** భారత్ అంతరిక్ష రంగంలో మరో కీలక అడుగు వేసింది. భూస్థిర కక్ష్యలోకి పంపిన ఈఓఎస్05 ఉపగ్రహం దేశానికి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుందని ద డిప్లొమాట్ నివేదిక పేర్కొంది. ముఖ్యంగా సంక్షోభ సమయంలో పాకిస్థాన్ నౌకలు, విమానాలు, వ్యూహాత్మక వనరులు, సైనిక బలగాల కదలికలను ఎప్పటికప్పుడు గమనించే అవకాశం భారత్‌కు లభించనుందని తెలిపింది. ఈనెల 4న జీఎస్ఎల్‌వీఎఫ్17 రాకెట్ ఈఓఎస్ 05ను భూస్థిర కక్ష్యలోకి చేర్చింది. భూమికి దాదాపు 34,900 నుంచి 35,900 కిలోమీటర్ల ఎత్తులో ఉండే ఈ కక్ష్యతో భారత ఉపఖండంపై నిరంతర నిఘా కొనసాగించవచ్చు. ఈ ఉపగ్రహం ద్వారా దేశానికి వ్యూహాత్మక సమాచారాన్ని అందించే తొలి ప్రత్యేక ఇమేజింగ్ ఉపగ్రహంగా ఈఓఎస్ 05 నిలుస్తుందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. భారత్ ఇప్పటికే పలు నిఘా ఉపగ్రహాలను దిగువ భూకక్ష్యలో ఉపయోగిస్తోంది. ఇవి అత్యంత స్పష్టమైన చిత్రాలను అందిస్తాయి. అయితే అవి భూమి చుట్టూ వేగంగా తిరుగుతుండటంతో ఒక ప్రాంతాన్ని నిరంతరం గమనించడం సాధ్యం కాదు. ఈఓఎస్05 విషయంలో ఈ పరిమితి తగ్గనుంది. సైనిక కదలికలను నిరంతరం గమనించడం వల్ల లక్ష్యాన్ని గుర్తించిన తర్వాత దానిపై చర్య తీసుకునే సమయం తగ్గుతుందని నివేదిక తెలిపింది. కచ్చితమైన దాడులకు క్షిపణుల సామర్థ్యంతో పాటు లక్ష్యం ఎక్కడుందన్న తాజా సమాచారం కూడా కీలకమేనని పేర్కొంది. ఇదే సమయంలో భారత్ తన అంతరిక్ష నిఘా వ్యవస్థను మరింత విస్తరించే ప్రణాళికలో ఉంది. 2024లో కేంద్ర భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ 52 రక్షణ ఉపగ్రహాలను ప్రయోగించే స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్3 కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. వీటిలో 21 ఉపగ్రహాలను ఇస్రో, 31 ఉపగ్రహాలను ప్రైవేటు రంగం అభివృద్ధి చేయనున్నాయి.

# రెజీనగర్ టిఎంసి అభ్యర్థి పోటీనుంచి విత్‌డ్రా

## అంతలోనే యుటర్న్.. పోటీకి సై



**కోల్‌కత్తా, సెప్టెంబరు 19:** పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల రాజకీయాలు నాటకీయ పరిణామాలతో ఒక్కసారిగా వేడెక్కాయి. శనివారం ఉదయం మమత బెనర్జీకి షాకిస్తూ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన రెజీనగర్ అభ్యర్థి రబీఉల్ ఆలమ్ చౌదరి, కొన్ని గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. మమత బెనర్జీ స్వయంగా చొరవ చూపి పట్టుబట్టడంతో ఆయన తిరిగి పోటీలో నిలిచేందుకు అంగీకరించారు. శనివారం ఉదయం, రాష్ట్ర యంత్రాంగం తమ పార్టీ కార్యకర్తలను వేధిస్తోందని, తమకు అధికారిక పార్టీ గుర్తును కేటాయించలేదని ఆరోపిస్తూ రబీఉల్ ఆలమ్ చౌదరి ఉప ఎన్నిక బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామం మమత వర్గంలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. అయితే, వెంటనే రంగంలోకి దిగిన మమత బెనర్జీ ఇతర సీనియర్ నాయకులతో కలిసి ఆయనతో చర్చలు జరిపారు. పార్టీ అధిష్ఠానం ఒత్తిడితో తన మనసు మార్చుకున్న రబీఉల్, తాను పోటీలో కొనసాగుతున్నట్లు మధ్యాహ్నం స్పష్టం చేశారు. అక్టోబర్ 6న రెజీనగర్‌తో పాటు నందిగ్రామ్‌లోనూ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే నందిగ్రామ్‌లో మమత వర్గం అభ్యర్థిగా ప్రకటించిన సంచితా ప్రధాన్ డే, ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన అనంతరం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో అక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి మమత మద్దతు ప్రకటించగా, ఆ కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌ను 2007 నాటి ఓ పాత హత్య కేసులో పోలీసులు అరెస్ట్ చేయడం గమనార్హం. తృణమూల్ కాంగ్రెస్‌లో తలెత్తిన చీలిక కారణంగా ఎన్నికల సంఘం పార్టీ పేరును, గుర్తును తాత్కాలికంగా స్తంభింపజేసింది. మమత వర్గానికి "మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్" పేరుతో "ఫుట్‌బాల్ ప్లేయర్" గుర్తును, ప్రత్యర్థి వర్గానికి "డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్" పేరుతో "ఎన్వలప్ కవరు" గుర్తును కేటాయించింది.

# పంజాబ్‌లో కేంద్ర మాజీ మంత్రి అరెస్టు!

**అమృత్‌సర్, సెప్టెంబరు 19:** పంజాబ్ ఎన్నికల ముందు రాజకీయ ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరాయి. బీజేపీ నాయకుడు, మాజీ కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ బిట్టును శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పంజాబ్‌లోని లుధియానాలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఎం భగవంత్ మాన్ కాన్వాయ్‌పై టొమాటో, గుడ్లు విసరడానికి ప్రయత్నించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ముందు గేటు వద్ద ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆయన చేతిలో గుడ్లు, టొమాటోలు ఉన్నాయని, సీఎం మాన్ కాన్వాయ్‌పై విసిరేందుకు ప్రయత్నించారని పోలీసులు చెబుతున్నారు. లూథియానాలో ఆప్ భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, సీఎం భగవంత్ మాన్, పార్టీ నేత మనీష్ సిసోడియా మొదలైన వారు వస్తున్నారు. ఈ కార్యక్రమానికి వెళ్లేందుకు పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వెలుపల ఉన్న మార్గం గుండా ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లా ఉంది. ఇదే సమయంలో బిట్టూ టొమాటోలు, గుడ్లతో అక్కడి చేరుకున్నారు. ఈ లోపే పోలీసులు అడ్డుకున్నారు. ఇదిలా ఉంటే, దీనికి ఒక రోజు ముందు బటాలా సమీపంలో బిట్టూ కాన్వాయ్‌పై గుడ్లు, టొమాటోలు విసిరారు. ఆప్ కార్యకర్తలే ఈ దాడికి పాల్పడినట్లు బిట్టూ ఆరోపించారు. వరస ఘటనలో పంజాబ్‌లో ఎన్నికల ముందు ఆప్, బీజేపీ మధ్ పొలిటికల్ హీట్ పెరుగుతోంది. బీజేపీ నషా ముక్త్ పంజాబ్ యాత్ర ప్రారంభించింది.

# మేం ఒకరిపై ఒకరం గూఢచర్యం చేసుకుంటాం

## చైనాపై డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, సెప్టెంబరు 19:** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో సతీసమేతంగా అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా-అమెరికా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. అదే సమయంలో ఇరుదేశాలూ పరస్పరం గూఢచర్యం చేసుకుంటాయని పేర్కొన్నారు. గతంలో తమ అధికారి ఒకరు మాట్లాడుతూ.. అగ్రరాజ్యంపై చైనా గూఢచర్యం చేస్తోందని చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. అయితే తాము కూడా బీజింగ్ విషయంలో అదే పని చేస్తుండడంతో దాన్ని అంతగా పట్టించుకోలేదని తెలిపారు 'జిన్‌పింగ్ వచ్చే వారం అమెరికాకు వస్తారు. ఇతర దేశాలతో సంబంధాలు అంత బాగా లేకపోయినా.. మాకు చైనాతో మంచి అనుబంధం ఉంది. ఆయనతో సమావేశానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఆ చర్చల్లో పలు కీలక ఒప్పందాలు చేసుకోబోతున్నాం. ప్రతి ఒప్పందం వెనక ఓ స్పష్టమైన ఉద్దేశం ఉంటుంది' అని ట్రంప్ పేర్కొన్నారు. జిన్‌పింగ్ అమెరికా పర్యటన.. ఈ నెలాఖరులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్.. సతీమణి పెంగ్ లియువాన్‌తో కలిసి అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ట్రంప్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి మరీ ఆయనను స్వాగతించనున్నట్లు తెలుస్తోంది. వాషింగ్టన్ డిసికి సమీపంలోని సైనిక స్థావరంలో ఉన్న ఎయిర్ పోర్టుకు వెళ్లి జిన్‌పింగ్ దంపతులను అధ్యక్షుడు స్వాగతించే అవకాశం ఉందని వైట్‌హౌస్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల నేతలతో ప్రముఖ టెక్ దిగ్గజాలు ఎలాన్‌మస్క్, సుందర్ పిచాయ, టిమ్ కుక్, మైఖేల్ డెల్, జెఫ్ బెజోస్, బెన్సన్ హు వాంగ్, శామ్ ఆల్ట్‌మన్, జేన్ ఫ్రేజర్ సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ భేటీలో కృత్రిమ మేధపైనా చర్చలు జరిగే అవకాశం ఉంది.

# ఢిల్లీలో హత్యాచారం కేసుపై రాహుల్, ప్రియాంకల ఆగ్రహం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** దేశ రాజధాని ఢిల్లీలో బాలికపై సామూహిక అత్యాచారం, హత్య ఘటనపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. మహిళల భద్రత విషయంలో ఢిల్లీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరుపై వారు ప్రశ్నలు సంధించారు. ఎక్స్ వేదికగా స్పందించిన ప్రియాంక గాంధీ బాలికపై జరిగిన దారుణం క్రూరత్వానికి అన్ని హద్దులు దాటిందని పేర్కొన్నారు. బాలికపై అత్యాచారం అనంతరం ఆమెను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఇటీవల మరో మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలతో కూడిన ఘటనను ప్రస్తావిస్తూ మహిళలు, బాలికలపై హింస కొనసాగుతున్నప్పటికీ నిందితులపై తగిన చర్యలు తీసుకుంటున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. మహిళలకు భద్రత, స్వేచ్ఛ, సమానత్వం కల్పించడంలో సమాజంతో పాటు ప్రభుత్వం కూడా విఫలమవుతోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. మహిళలపై హింసకు సంబంధించిన కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, నిందితులపై చర్యలు తీసుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కూడా ఎక్స్ వేదికగా ఈ ఘటనపై స్పందించారు. 17 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని బహిరంగ ప్రదేశంలో పడేశారని పేర్కొన్నారు. దేశ రాజధానిలో ఇంత దారుణమైన నేరం జరిగినప్పటికీ అది రోజుల తరబడి ఎలా గుర్తించబడకుండా ఉండిపోయిందని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి రాహుల్ గాంధీ ఢిల్లీ పోలీసు వ్యవస్థ కేంద్ర హోంశాఖ పరిధిలో ఉందని పేర్కొన్నారు. నగరంలో మహిళల భద్రతకు చివరికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. నేరస్థులు ఎలాంటి భయం లేకుండా తిరుగుతున్నారని ఆరోపించిన ఆయన ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఘటనలో జరిగిన నిర్లక్ష్యానికి బాధ్యతను నిర్ణయించాలని కోరారు. మహిళల భద్రత లేకుండా భారత్ ముందుకు సాగలేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## సైబర్ చీటింగ్‌కు గురైన బిజెపి ఎమ్మెల్యే



**లక్నో,సెప్టెంబరు 19:** ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి చెందిన ఓ మహిళా ఎమ్మెల్యే సైబర్ మోసానికి గురయ్యారు. కౌశాంబి జిల్లా చైల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పూజా పాల్ బ్యాంకు ఖాతా నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.1.55 లక్షలు అపహరించారు. ఈ ఘటనపై ఆమె ప్రయాగ్‌రాజ్‌లోని ధూమన్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన ఐఫోన్ 17 ఎయిర్‌ను హ్యాకర్లు హ్యాక్ చేసి, బ్యాంకు వివరాలతో పాటు వ్యక్తిగత డేటాను తస్కరించి ఈ మోసానికి పాల్పడి ఉంటారని పూజా పాల్ అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన లావాదేవీలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తన మొబైల్ ఫోన్‌కు టెక్నికల్ ఆడిట్ నిర్వహించాలని ఆమె కోరారు.

## బెంగాల్‌లో ఇంగ్లీష్ విలేజ్



**కోల్‌కత్తా, సెప్టెంబరు 19:** పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాలో ఉన్న కలియాచక్ గ్రామం ఇంగ్లీష్ విలేజ్‌గా దేశవ్యాప్తంగా అరుదైన గుర్తింపు పొందింది. ఇక్కడి పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఇంగ్లీష్ భాషను ఒక భాగంగా మార్చుకున్నారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం, నేర్పించడం ఇక్కడ తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. కలియాచక్‌లో ఇంగ్లీష్ కేవలం ఓ పాఠ్యాంశం కాదు, అది వారి జీవన విధానం, ప్రధాన ఉపాధి మార్గం. గ్రామంలో ఎక్కడ చూసినా ట్యూషన్ సెంటర్లు, ప్రైవేట్ క్లాసులు కనిపిస్తాయి.

## ఢిల్లీ హైకోర్టుకు ఏడుగురు న్యాయాధికారుల నియామకం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుల మేరకు ఢిల్లీ హైకోర్టుకు ఏడుగురు న్యాయాధికారులను న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తులుగా కేంద్ర ప్రభుత్వం శనివారం నియమించింది.

నివేదిత అనిల్ శర్మ, నిషా సహాయ్ సక్సేనాలను ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించారు. సంజయ్ శర్మ, భరత్ పరాశర్, అదితి చౌదరి, దినేశ్ భట్, అరుణ్ భారద్వాజ్‌లను అదనపు న్యాయమూర్తులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## ఢాకాలో వరుస పేలుళ్లు.. 200కు పైగా చెక్‌పోస్టుల ఏర్పాటు



**ఢాకా, సెప్టెంబరు 19:** బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో వరుసగా క్రూడ్ బాంబు పేలుళ్లు చోటుచేసుకోవడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పేలుళ్లు జరిగిన అనంతరం కఫ్రుల్ ప్రాంతంలో ఓ బస్సుకు నిప్పుపెట్టిన ఘటన కలకలం రేపింది. దీంతో ఢాకా మెట్రోపాలిటన్ పోలీస్ నగరవ్యాప్తంగా 200కు పైగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. పలు ప్రాంతాల్లో పోలీసు గస్తీ, వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి.

## పంజాబ్‌లో ఎఎస్ఐ కాల్చివేత



**అమృత్‌సర్, సెప్టెంబరు 19:** పంజాబ్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న పోలీసు అధికారిపై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరపడంతో అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ మృతి చెందారు. అమృత్‌సర్‌లోని భగ్తావాలా ధాన్యం మార్కెట్‌లో ఈ ఘటన జరిగింది. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఎఎస్ఐ హర్జీత్ సింగ్ భగ్తావాలా గ్రెయిన్ మార్కెట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో పలుమార్లు కాల్పులు జరిపారు.

# ముంబయి ఒలింపియా కాఫీహౌస్ లైసెన్స్ సస్పెన్షన్

**ముంబయి, సెప్టెంబరు 19:** హాలీవుడ్ స్టార్లు క్రిస్టోఫర్ నోలన్, మాట్ డామన్, టామ్ హాలండ్ సందర్శించిన ముంబైలోని ప్రముఖ ఒలింపియా కాఫీ హౌస్‌కు షాక్ తగిలింది. తీవ్రమైన అపరిశుభ్రత, ఆహార భద్రత లోపాలు బయటపడటంతో మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) ఈ కేఫ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు లైసెన్స్‌పై సస్పెన్షన్ కొనసాగనుంది. కస్టమర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్‌డీఏ అధికారులు కేఫ్‌లో తనిఖీలు చేపట్టారు.



# తుళు భాషకు అదనపు అధికార భాష హోదా

## దక్షిణ కన్నడ జిల్లాపేరు ఇకపై మంగుళూరు జిల్లా

**మంగళూరు, సెప్టెంబరు 19:** కర్ణాటకలోని ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాల్లో తుళు భాషను రాష్ట్ర రెండో అదనపు పరిపాలనా భాషగా గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళూరులో జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాల్లో తుళు భాషను అమలు చేయాలని, రాష్ట్ర రెండో అదనపు పరిపాలనా భాషగా ప్రకటించాలని నిర్ణయించామన్నారు.

# కిమ్ అణుపరీక్షలతో 1399 భూకంపాలు!

## శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలిన నిజాలు

**సియోల్, సెప్టెంబరు 19:** ఉత్తర కొరియా చేపట్టిన భూగర్భ అణు పరీక్షలు తీవ్రమైన, దీర్ఘకాలిక పర్యావసనాలకు దారితీసినట్లు తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. 2006 నుంచి 2017 మధ్య పంగ్యేరి అణు పరీక్ష కేంద్రంలో నిర్వహించిన ఆరు అణు పరీక్షల కారణంగా, గతంలో నిద్రాణంగా ఉన్న భూమి పొరల్లోని ఫాల్ట్‌లు తిరిగి ఉత్తేజితమై, ఏకంగా 1,399 భూకంపాలను ప్రేరేపించి ఉండవచ్చని ఈ పరిశోధన తేల్చింది. ఈ సంచలన వివరాలతో కూడిన అధ్యయనం ప్రతిష్ఠాత్మక సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. దక్షిణ కొరియాలోని పూసాన్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ క్వాంగ్‌హీ కిమ్, చైనాలోని చెంగ్‌డు యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన జియాంగ్‌లి ఫాన్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధనను చేపట్టింది. ఇందుకోసం చైనా, దక్షిణ కొరియా సీస్మిక్ స్టేషన్ల నుంచి 2008-25 మధ్య 17 ఏళ్లపాటు సేకరించిన డేటాను విశ్లేషించారు. మ్యాచ్డ్‌ఫిల్టర్ డిటెక్షన్ అనే ఆధునిక పద్ధతి ద్వారా సాధారణ మానిటరింగ్‌లో గుర్తించలేని అతి చిన్న భూకంపాలను కూడా వీరు కనుగొన్నారు. మొత్తం 1,399 భూకంపాలు నమోదు కాగా, వాటిలో 955 ఎక్కడ సంభవించాయో కచ్చితమైన ప్రదేశాలను నిర్ధారించారు. అణు పరీక్షలు జరిగిన మంటాప్ పర్వత ప్రాంతం గతంలో భూకంప కార్యకలాపాలు లేని ప్రదేశంగా ఉండేది. 2006-17 మధ్య ఇక్కడ కేవలం 60 భూకంపాలు మాత్రమే నమోదయ్యాయి. కానీ 2017 సెప్టెంబర్‌లో జరిగిన ఆరో, అత్యంత శక్తివంతమైన అణు పరీక్ష తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆ పరీక్ష జరిగిన 20 రోజుల తర్వాత భూకంపాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 1,330కి పైగా భూకంపాలు సంభవించాయి. ఇవన్నీ దాదాపు 24 కిలోమీటర్ల పొడవైన రెండు ఫాల్ట్ జోన్‌ల వెంబడి కేంద్రీకృతమయ్యాయని పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా అణు పరీక్షల తర్వాత భూకంప కార్యకలాపాలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా 2017 తర్వాత భూకంపాల సంఖ్య, తీవ్రత రెండూ పెరిగాయి. చాలా వరకు భూకంపాల తీవ్రత 2 కంటే తక్కువగా ఉన్నప్పటికీ, 2023-24 మధ్య కొన్ని 3.0 కంటే ఎక్కువ తీవ్రతతో, గరిష్ఠంగా 3.4 మాగ్నిట్యూడ్‌తో నమోదయ్యాయి. వరుస పేలుళ్ల వల్ల భూమి పైపొర దెబ్బతిని, ఒత్తిడిలో మార్పులు జరిగి, నిద్రాణమైన ఫాల్ట్‌లు క్రియాశీలమయ్యాయని శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ఈ 24 కిలోమీటర్ల ఫాల్ట్ జోన్ పూర్తిగా చురుకైతే, భవిష్యత్తులో 6.4 తీవ్రతతో భారీ భూకంపం సంభవించే ప్రమాదం ఉందని ప్రొఫెసర్ కిమ్ అంచనా వేశారు. ఈ పరిణామం సహజ భూకంపాలు, రహస్య అణు పరీక్షల మధ్య తేడాలను గుర్తించడాన్ని మరింత సంక్లిష్టం చేస్తుందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




## అవినీతి, అలసత్వానికి తావులేదు

### నరసాపురం ఎమ్మెల్యే నాయకర్

**నరసాపురం, సెప్టెంబరు19, ప్రభాతవార్త:** ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అలసత్వానికి తావు ఉండకూడదని నరసాపురం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. మండల రెవెన్యూ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ ట్రె జరీ కార్యాలయాలను సందర్శించి సిబ్బంది పనితీరును, ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను మర్యాదగా, గౌరవంగా చూసి వారి సమస్యలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం, అలసత్వం ఎంతమాత్రం ఉండకూడదని స్పష్టం చేశారు. అవి నీతికి తావులేదని, ఫిర్యాదులు అందితే తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కచ్చితమైన పాలనా విధానాలను అమలు చేస్తోందని నాయకర్ తెలిపారు. కార్యాలయాల్లో వసతుల కొరత, సిబ్బంది లోటు లేదా పని తీరును మెరుగుపరిచేందుకు అవసరమైన ఇతర అంశాలు తన దృష్టికి తీసుకువస్తే ఉన్న తాధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఉప ఖజానా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



అర్థ గణాంక శాఖ సంచాలకులు బి. గోపాల్‌ను సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సబ్ ఆర్డినేట్ సర్వీసెస్ అసోసియేషన్

## అర్థ గణాంక శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి: బి. గోపాల్ హామీ

**విజయవాడ.సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో భాగంగా క్షేత్రస్థాయి గణాంక వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని అర్థ గణాంక శాఖ సంచాలకులు బి. గోపాల్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని బెంజ్ సర్కిల్ వద్ద గల అర్థ గణాంక శాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సబ్ ఆర్డినేట్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డేపల్లి గౌరీ మనోహరరావు, ప్రధాన కార్యదర్శి వెంకట్ జోడాల అధ్యక్షతన జరిగిన రెండవ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సంచాలకులు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన పి4 కార్యక్రమం, నియోజకవర్గ విజన్ యూనిట్లు, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు , ఎకనామిక్ రిపోర్ట్ మానిటరింగ్ వంటి కీలక విధాన రూపకల్పనలో గణాంక శాఖ పాత్ర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.ముఖ్యంగా మండల స్థాయిలో సహాయ గణాంక అధికారులు, నియోజకవర్గ స్థాయిలో డివిజనల్ స్టాటిస్టికల్ అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అభివృద్ధి ప్రణాళికలకు అవసరమైన కచ్చితమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు సమస్యలు, క్షేత్ర స్థాయివిధుల్లో ఎదురవుతున్న సవాళ్లపై సంచాలకులకు వినతిపత్రం అందజేశారు.



## మహిళా ఆంధ్రా క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు

### తొలి మ్యాచ్‌లో రాయలసీమ జెన్ స్టార్స్ ఘన విజయం

### గోదావరి గోల్డెన్ ఈగల్స్‌పై 7వికెట్ల తేడాతో గెలుపు

**విజయవాడ/మంగళగిరి,సెప్టెంబరు 19ప్రభాతవార్త:** మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఉమెన్ ఎపిఎల్లో భాగంగా రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి గోల్డెన్ ఈగల్స్ జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో రాయలసీమ జెన్ స్టార్స్ ఘన విజయం సాధించింది. 117 పరుగుల లక్ష్యాన్ని రాయలసీమ జట్టు 17.3 ఓవర్లలోనే కేవలం మూడు వికెట్లు కోల్పోయి ఛేదించి, ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన రాయలసీమ జెన్ స్టార్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గోదావరి గోల్డెన్ ఈగల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది.గోదావరి జట్టు కెప్టెన్ హేన్రిట్టా పెరీరా అద్భుతంగా బ్యాటింగ్ చేసి 49 బంతుల్లో 63 పరుగులు సాధించారు. ఆమె ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు ఉన్నాయి. గుండుపల్లి ఉద్విత 36 బంతుల్లో 30 పరుగులు చేసి జట్టు స్కోరుకు కీలక సహకారం అందించారు. ఒక ఫోర్, ఒక సిక్స్ తో జట్టుకు సహకారం అందించారు. రాయలసీమ బౌలర్లలో బి. అనూష మూడు వికెట్లు పడగొట్టి గోదావరి బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశారు. ఈ. పద్మజ రెండు వికెట్లు తీసి బౌలింగ్‌లోనూ తన సత్తా చాటారు.

117 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాయలసీమ జెన్ స్టార్స్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. ఓపెనర్ సేతు సాయి కేవలం 23 బంతుల్లోనే 33 పరుగులు చేసి 6 ఫోర్లతో మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. మరో ఓపెనర్ శుభశ్రీ 40 బంతుల్లో 23 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను నిలకడగా నడిపించారు.మరోవైపు ఈ.పద్మజ కేవలం 18 బంతుల్లోనే 30 పరుగులు చేసి, 5 ఫోర్లతో రాయలసీమ విజయంలో కీలక పాత్ర పోషించారు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించిన పద్మజ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.రాయలసీమ జెన్ స్టార్స్ 17.3 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 120 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. గోదావరి గోల్డెన్ ఈగల్స్ బౌలర్లలో కెప్టెన్ పెరీరా, విన్నీ, హారిక తలో వికెట్ తీసుకు న్నారు.బ్యాటింగ్‌లో కీలకమైన 30 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో రెండు వికెట్లు పడగొట్టి ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన ఈ. పద్మజకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.తొలి మ్యాచ్‌లోనే సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకున్న రాయలసీమ జెన్ స్టార్స్ విజయంతో ఉమెన్ ఎ.పి.ఎల్.లో శుభారంభం చేసింది.

### పిఠాపురంలో రూ.1,500కోట్లతో

# అభివృద్ధి కార్యక్రమాలు

### దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్న డి.సిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన మాట మేరకురాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ .ప్రతి అడుగు అభివృద్ధి వైపు వేస్తున్నారు.తన శాఖల పరిధిలోనే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల సహకారంతో నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు. దశాబ్దాలుగా ప్రజలకు అసాధ్యం అనుకున్న ఎన్నో అభివృద్ధి పనులను సుసాధ్యం చేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నారు. సార్వత్రిక ఎన్నికల విజయం అనంతరం తొలి అడుగులోనే కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. సోమవారం నుంచి రెండు రోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న ఉప ముఖ్యమంత్రి దాదాపు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, తాగునీటి సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, మత్స్యకారుల సంక్షేమం, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ పలు కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. సోమవారం ఉప్పాడ కొత్తపల్లి, పిఠాపురం రూరల్ మండలాల పరిధిలోని దాదాపు 52 ఆవాసాలకు చెందిన 97 వేల మందికి పూర్తి స్థాయి అవసరాలకు తగిన విధంగా తాగునీటి సరఫరా చేసేందుకు వీలుగా పునరుద్ధరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు పూర్తి స్థాయి మంచినీరు అందడం లేదన్న విషయాన్ని గుర్తించారు.దాంతో రూ. 9.59 కోట్లతో పవన్ కళ్యాణ్ ఆధునీకరణ పనులు చేపట్టారు. దీనితోపాటు పిఠాపురం పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో భాగంగా నిర్మించిన పీఠికాపురవనాన్ని ప్రారంభించనున్నారు. చందుర్తి, తాటిపర్తి బీటీ రోడ్డు, సుందరీకరించిన ఎఫ్.కె. పాలెం మైసమ్మ చెరువులను కూడా పవన్ కళ్యాణ్ ఈ పర్యటనలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో పిఠాపురం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అందులో రూ. 307 కోట్ల జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల నిధులతో మల్టీ విలేజ్ స్కీం, రూ. 200 కోట్లతో పిఠాపురం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్ల ఏఐబీ నిధులతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్,అమృత్ 2.0 నిధులతో పిఠాపురం మున్సిపాలిటీ వాటర్ వర్క్స్, మరో రూ. 100 కోట్ల సాస్కీ నిధులతో నిర్మించనున్న రోడ్లు, రూ. 118 కోట్ల విలువైన పిఠాపురం ప్రజల చిరకాల



కోరిక రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్ల ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ, పిఠాపురం మల్టీ విలేజ్ స్కీం తాగునీటి పథకం, పిఠాపురం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, గొల్లప్రోలు వాటర్ వర్క్స్ తదితర అభివృద్ధి పనులు ఉన్నాయి.

వీటితోపాటు ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో భద్రతతో కూడిన భరోసా నింపుతూ.ఆధునాతన లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఊతమిచ్చేలా స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు సెర్ప్, మెప్మాల సహకారంతో అందజేయనున్నారు. 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందజేసి వారి భూ హక్కులకు భరోసా కల్పించనున్నారు. రెండు రోజుల పర్యటన ఆద్యంతం పవన్ కళ్యాణ్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

# ప్రతి పాము కాటు ప్రాణాంతకం కాదు

### 108 అంబులెన్సుల ద్వారా కూడా చికిత్స

### 25 వరకు అంతర్జాతీయ పాముకాటు అవగాహన కార్యక్రమాలు

### గోడపత్రికను ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవ కార్యక్రమాలపై గోడ పత్రికను ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ.సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి పాము కాటు ప్రాణాంతకం కాదని వైద్య, ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ప్రపంచంలో 3500 జాతుల పాములున్నాయని, వీటిలో కొన్ని జాతులు మాత్రమే విషపూరితమైనవని తెలిపింది.రాష్ట్రంలో తాచు పాము, రక్త పింజర, కట్ల పాము విషపూరితమైనవని తెలిపింది. ప్రకృతి సమతుల్యతలో పాములు కూడా ఒక భాగమని, ఆత్మ రక్షణకు తప్ప మనుషులపై పాములు దాడి చేయవని పేర్కొంది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే పాములు పరిసరాలకు రావని తెలిపింది. సెప్టెంబర్ 19 మంచి 25వ తేదీ వరకు అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవ కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తన క్యాంపు కార్యాలయంలో శనివారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ విజయలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్జునరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని స్థాయిల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో పాముకాటు విరుగుడు మందు ( ఏ ఎస్ వి, యాంటీ స్నేక్ వీనం) అందుబాటులో ఉందన్నారు. పాటు కాటు విరుగుడుకు సంబంధించి వైద్య సేవల్ని బాధితులకు మరింత చేరువ చేసేందుకు 108 వాహనాల్లోనూ మందును అందుబాటులో ఉంచామన్నారు. ఈ సేవల ద్వారా 9 మందికి తక్షణ వైద్య సాయాన్ని అందించి ప్రాణాల ముప్పు నుంచి కాపాడామని మంత్రి తెలిపారు.

రాష్ట్రంలో గత మూడేళ్లలో పాము కాటు కేసులు దాదాపు 4,500 నుంచి 4,800 మధ్య నమోదయ్యాయి. 2023లో 4,809, 2024లో 4,573, 2025లో 4,702 కేసులు నమోదయ్యాయి. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు 4,111 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కేసులు పెరుగుతూ జూలైలో 890, ఆగస్టులో 1,051 కేసులు నమోదయ్యాయి. 2026 జనవరి-ఆగస్టు మధ్య శ్రీకాకుళంలో అత్యధికంగా 706 పాము కాటు కేసులు నమోదయ్యాయి. పశ్చిమగోదావరిలో 369, విజయనగరంలో 307, కృష్ణాలో 296, ఏలూరులో 271 కేసులు నమోదయ్యాయి. తీర, గ్రామీణ ప్రాంతాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండగా, అటవీ, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా పర్యవేక్షణ పెంచాలని సూచించారు.సెప్టెంబర్ 18 నాటికి జిల్లాల వారీగా మొత్తం 2,807 మోతాదులు నిల్వ ఉన్నాయి. విజయనగరంలో 1,391, నెల్లూరులో 364, కృష్ణాలో 267, పశ్చిమగోదావరిలో 260, కర్నూలులో 213 మోతాదులు ఉన్నాయి.

## పుష్కరాల్లో నెట్‌వర్క్ అంతరాయాలకు తావివ్వొద్దు: కలెక్టర్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు19,ప్రభాతవార్త:** రానున్న గోదావరి పుష్కరాలకు కోట్లాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున కాల్‌డ్రాప్స్, నెట్‌వర్క్ అంతరాయాలు లేకుండా కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేయాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి టెలికాం సంస్థలను ఆదేశించారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, బీఎస్ఎన్ఎల్ తదితర సంస్థల ప్రతినిధులతో ఆమె సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, పుష్కర్ డిప్యూటీ కలెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, పుష్కరాల రద్దీ రోజుల్లో రాజమహేంద్రవరం నగర పరిధిలోనే రోజుకు 60-70 లక్షల మంది ఉండే అవకాశం ఉందని తెలిపారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, రాజానగరం, దివాన్ చెరువు, జీరో పాయింట్, జీఎస్ఆర్ కళాశాల, వాడపల్లి, ధవళేశ్వరం తదితర ప్రాంతాల్లో భారీగా భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని నెట్‌వర్క్ సామర్థ్యాన్ని ఇప్పటి నుంచే పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అత్యధిక రద్దీ ఉండే 70 కీలక ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో టెలికాం టవర్ల ఏర్పాటుకు జాబితాను సంస్థల ప్రతినిధులకు అందించారు. కొత్త టవర్లతో పాటు పుష్కర ఘాట్లు, రద్దీ ప్రాంతాల్లో తాత్కాలిక టవర్లు ఏర్పాటు చేసి నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ప్రస్తుతం ఉన్న కాల్‌డ్రాప్స్ సమస్యలను పరిష్కరించడంతో పాటు పుష్కరాల సమయం లో నెట్‌వర్క్‌పై అధిక భారం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాబోయే 10 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వచ్చే ఏడాదిలోనే సిగ్నల్ సామర్థ్యాన్ని పెంచేలా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో టెలికాం ఆపరేటర్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎం వర్సిటీలో జాతీయస్థాయి సైన్స్ అండ్ టెక్నాలజీ సమ్మేళనం

### డిసెంబరు 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్ఎం వర్సిటీ విసి ఆచార్య సిహెచ్ సతీష్ కుమార్

**విజయవాడ, సెప్టెంబరు 19 ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ స్థాయిలో సైన్స్, టెక్నాలజీ, పరిశోధన రంగాలకు మరింత ఊతమిచ్చేలా అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మూడు రోజుల జాతీయస్థాయి సైన్స్ అండ్ టెక్నాలజీ సమ్మేళనాన్ని నిర్వహించనుంది. డిసెంబరు 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న ఈ సమ్మేళనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించింది. శనివారం విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ సమ్మేళనం వివరాలను వెల్లడించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధిపై ప్రతి ఏడాది జాతీయస్థాయిలో ప్రత్యేక సదస్సులను నిర్వహించడం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆనవాయితీగా కొనసాగిస్తోందని వీసీ తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర ఉన్నత విద్యామండలి భాగస్వామ్యంతో సదస్సును మరింత విస్తృత స్థాయిలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమ్మేళనానికి కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి ప్రొఫెసర్ ఉమేష్ వాగ్మారే ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. దేశంలోని వివిధ ప్రముఖ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, పరిశోధనా రంగ నిపుణులు, ప్రముఖ శాస్త్రవేత్తలు సమ్మేళనంలో పాల్గొని తమ పరిశోధనలు, ఆలోచనలు, అనుభవాలను పంచుకోనున్నారని వివరించారు. ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ ఆచార్య ఎస్. విజయభాస్కరరావు మాట్లాడుతూ, అన్ని రంగాల్లో పరిశోధనలకు పెద్దపీట వేస్తూ శాస్త్రీయ పరిశోధనల విస్తృతికి ఈ సమ్మేళనం ప్రత్యేక వేదికగా నిలవనుందని అన్నారు. సీఎస్ఐఆర్ నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ డైరెక్టర్ ఆచార్య ఆచంట వేణుగోపాల్ మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ సమ్మేళనం నిర్వహణతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నిరంతర సహకారం, పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో యునైట్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సొసైటీని ఏర్పాటు చేశారు. సొసైటీ అధ్యక్షుడిగా సీఎస్ఐఆర్ నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ డైరెక్టర్ ఆచార్య ఆచంట వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మంగళంపల్లి కిరణ్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ ఆర్. మహేష్, కోశాధికారిగా డాక్టర్ సభ్యసాచి ముఖోపాధ్యాయను నియమించారు. వీరితో పాటు వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన మరో పది మంది కార్యవర్గ సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా యునైట్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సొసైటీ ఏర్పాటును తెలియజేసే పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 10 వేల మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ హెల్త్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కేప సునీత విజ్ఞాన్ సేతు సైన్స్ ఎగ్జిబిషన్‌కు కోఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు.ఈ సందర్భంగా విజ్ఞాన్ సేతుతో పాటు జాతీయస్థాయి సైన్స్ అండ్ టెక్నాలజీ సమ్మేళనం పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరువనంతపురం ఐఐఎస్ఈఆర్ డైరెక్టర్ డాక్టర్ విజయమోహన్ పిళ్లై, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ చిల్లా మల్లారెడ్డి, ప్రొఫెసర్ సోమా వేణుగోపాలరావు, ఐఐటీ ముంబై ప్రొఫెసర్ శోభా శుక్లా, ఎస్ఆర్ఎం డీన్ డాక్టర్ టామి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్, విజయవాడ మధ్య ప్రత్యేక రైళ్లు

### నేడు పలు రైళ్లు రద్దు

**విజయవాడ,సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** వరంగల్- విజయవాడ మీదుగా దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ఇదిలా ఉండగా ఈ నెల 20న సికింద్రాబాద్ వరంగల్ సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రయాణించే 4 రైళ్లను రద్దు చేసింది. ప్రయాణీకుల రద్దీని క్లియర్ చేయడానికి వరంగల్-విజయవాడ మీదుగా ప్రయాగ్‌రాజ్ - తిరునెల్వేలి మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక రైళ్లు నిర్ణీత రోజుల్లో ప్రయాణిస్తాయి. ట్రైన్ నంబర్ 04171 ప్రయాగ్‌రాజ్ - తిరునెల్వేలి (శనివారం) సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 10 వరకు (మొత్తం 4ట్రిప్పులు),ట్రైన్ నంబర్ 04172 తిరునెల్వేలి-ప్రయాగ్‌రాజ్ (సోమవారం) సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 12 వరకు (మొత్తం 4 ట్రిప్పులు) నడుస్తాయి. ప్రయాగ్‌రాజ్ లో బయల్దేరే ఈ ప్రత్యేక రైళ్లు మాణిక్‌పూర్, సత్నా, కట్ని, జబల్‌పూర్, ఇటార్సి, నాగ్‌పూర్, చంద్రాపూర్, బల్హార్షా మీదుగా తెలంగాణలోకి ప్రవేశిస్తాయి. సిర్పూర్ కాగజ్‌నగర్, రామగుండం, వరంగల్, ఖమ్మం మీదుగా ప్రయాణించి ఏపీలోని విజయవాడ చేరుకుంటాయి. తిరిగి అక్కడి నుంచి తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా తమిళనాడులోని కాట్పాడి, సల్లం, మదురై, జోలార్‌పెట్టి స్టేషన్లలో నిలుస్తాయి. తిరునెల్వేలిలో బయల్దేరే రైళ్లు సైతం ఇవే స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తాయి. ఈ ప్రత్యేక రైళ్లలో 3తిది, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ నెల 20న సికింద్రాబాద్ నుంచి వరంగల్, సిర్పూర్ కాగజ్ నగర్ వెళ్లే 4 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి మార్పులు చేసుకోవాల్సిందిగా సూచించింది.ట్రైన్ నంబర్ 67761 సికింద్రాబాద్-వరంగల్: సెప్టెంబర్ 20న రద్దు చేశారు.ట్రైన్ నంబర్ 67762 వరంగల్ - సికింద్రాబాద్సెప్టెంబర్ 20న రద్దు చేశారు.ట్రైన్ నంబర్ 12757 సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ సెప్టెంబర్20న రద్దు చేశారు.ట్రైన్ నంబర్ 12758 సిర్పూర్‌కాగజ్‌నగర్ -సికింద్రాబాద్ సెప్టెంబర్ 20న రద్దు చేశారు.



## స్థానిక ఎన్నికల్లో జనసేన బలం చూపాలి

### విశాఖ మునిసిపల్ ఎన్నికలు కీలకం: మంత్రి నాదెండ్ల మనోహర్

**విశాఖపట్నం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** విశాఖపట్నంలో జరిగిన జనసేన ఆత్మీయ సమావేశంలో మాట్లాడిన జనసేన పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ 'వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు చాలా ముఖ్యమైనవి. జనసేన పార్టీ బలాన్ని చూపించాల్సిన ఎన్నికలు ఇవి. కూటమిలోని అన్ని పార్టీల నాయకులను కలుపుకొని సమష్టిగా ఎన్నికలల్లో ముందుకు సాగాలి. జన సైనికులకు క్రమశిక్షణే బలం. పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటే శిరోధార్యం. సోషల్ మీడియాలో అనవసర అపో హలకు, ప్రచారాలకు దూరంగా ఉండండి. మన అధినేత ఏం చెప్తే అది మాత్రమే వినండి, దాన్నే ఆచరించండి' అని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మొదటి దశలో జరగబోయే అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ గెలుచుకోవడం చాలా కీలకమైంది అన్నారు. బలబలాలను పక్కాగా బేరిజు వేసుకొని, ఎన్నికల రణరంగంలో దిగి, 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించాలి అన్నారు. విశాఖపట్నంలోని సాగరమాల కన్వెన్షన్ సెంటర్ వేదికగా జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. విశాఖపట్నంలోని నాలుగు నియోజకవర్గాల పార్టీ శ్రేణులు, ఉత్తరాంధ్ర నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "2021లో జరిగిన విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతికూల పరిస్థితుల్లో కూడా జనసేన పార్టీ మూడు స్థానాలను కైవసం చేసుకుంది. 7 చోట్ల రెండవ స్థానంలో నిలిచింది. అప్పటి పాలకుల వైఖరిని తట్టుకొని జనసేన పార్టీ బలంగా పోరాడింది నిలబడింది. ప్రజల ఆశీర్వాదాన్ని అందుకుంది.ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్,పంచకర్ల రమేష్‌బాబు,లోకం మాధవి,నిమ్మక జయ కృష్ణ, ఎం ఎస్ ఎం ఈ కార్పొరేషన్ చైర్మన్ ట్రి. శివశంకర్, విశాఖపట్నం నార్త్ జనసేన పార్టీ ఇన్చార్జి పి.ఉషాకిరణ్, జనసేనపార్టీనాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.



## విశాఖ ఆర్‌కే బీచ్‌లో సాగర తీర స్వచ్ఛత కార్యక్రమాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

### పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులతో ముఖాముఖి

**విశాఖపట్నం, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:** విశాఖపట్నంలోని ఆర్‌కే బీచ్‌లో నిర్వహిస్తోన్న సాగర తీర స్వచ్ఛత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించారు. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఆర్కే బీచ్ సందర్శించారు. అక్కడ జరుగుతోన్న సాగర తీర స్వచ్ఛత కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా ఉన్న మత్స్యకారులు, పారిశుద్ధ్య కార్మికులు, స్కూబా డైవర్లతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. బీచ్ శుభ్రత, సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, సముద్రగర్భంలోని వ్యర్థాల తొలగింపు తదితర కార్యక్రమాలను పరిశీలించి వాటిలో భాగస్వాములైన వారి అనుభవాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ముందుగా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి బీచ్ శుభ్రతలో పాల్గొన్న సీఎం తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వారు చేపడుతున్న విధానాలను పరిశీలించారు. అనంతరం మత్స్యకారులతో మాట్లాడి చేపల వేటతో పాటు సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. మత్స్యకారులతో మాట్లాడిన అనంతరం అక్కడే ఉన్న స్కూబా డైవర్లతో సీఎం మాట్లాడారు. సముద్ర గర్భంలో రాళ్ల మధ్య, తీరానికి సమీప ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, పాడైన చేపల వలలు, సీసాలు, ప్యాకేజింగ్ వ్యర్థాలను తొలగిస్తున్న విధానాన్ని స్కూబా డైవర్లు సీఎంకు వివరించారు. మత్స్యకారుల పడవలతో కలిసి ఉపరితలంతోపాటు సముద్రగర్భంలోనూ వ్యర్థాలను సేకరిస్తున్నామని తెలిపారు. నీటిలోపల నిర్వహిస్తున్న శుభ్రత కార్యక్రమానికి సంబంధించిన దృశ్యాలను సీఎంకు చూపించారు. అనంతరం జీవీఎంసీ ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలను సీఎం సందర్శించారు. మురుగు కాల్వలు, మ్యాన్‌హోళ్ల శుభ్రతకు వినియోగించే సీవరేజ్ రోబోలను పరిశీలించారు. మెషిన్ల సాయంతో పారిశుద్ధ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు ఈ పరికరాలను వినియోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రపీస్ ప్రతినిధులు సీఎంను కలిసి సాగర స్వచ్ఛత ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. జీవీఎంసీ ప్రాజెక్టుకు లభించిన గ్లోబల్ గుర్తింపు, ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. పెదజాలరిపేటలో సుమారు 185 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు.ఒంటరి మహిళకు పెన్షన్ ఇవ్వాలని సీఎం ఆదేశంఇదే సందర్భంలో ఆర్‌కే బీచ్‌లో మురిమిక్చర్ విక్రయిస్తున్న ఓ మహిళను సీఎం చంద్రబాబు పలకరించారు. ఆమె వ్యాపారం, జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. మురిమిక్చర్‌ను రుచి చూసిన సీఎం... ఆమె ఒంటరి మహిళ అని తెలుసుకుని, ఆమెకు పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఎస్. యానాం సముద్ర తీరంలో వింత పదార్థం లభ్యం...

- తిమింగలం వాంతిగా ప్రచారం..
- రూ.1.50 కోట్ల విలువగా అంచనా..



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు19,ప్రభాతవార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా సముద్ర తీరంలో లో అత్యంత అరుదైన ఓ వింత పదార్థం లభ్యమైంది. ఉప్పలగుప్తం మండలం ఎస్. యానాం బీచ్ తీరంలో అత్యంత విలు వైనదిగా ప్రచారం జరుగుతున్న పదార్థం లభించడం కలకలం రేపింది. ఇది తిమింగలం వాంతి (అంబర్‌గ్రిస్) అయి ఉండొచ్చని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.1.50 కోట్ల వరకు ఉంటుందని ప్రచారం జరుగుతున్నపటికీ, అది. కారికంగా ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ పదార్థాన్ని దక్కించుకునే విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తడంతో సమాచారం అందుకున్న ఉప్పలగుప్తం ఎస్ఐ షేక్ జానీ బాషా సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం లభ్యమైన పదార్థాన్ని అధికారులు పరీక్షల కోసం పంపినట్లు సమాచా రం. అది నిజంగా అంబ టర్‌గ్రిస్‌నా? దాని విలువ ఎం? అనే విషయాలు పరీక్షల నివేదిక వచ్చిన తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది. దీనిపై అ ధికారులు అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# ధర పతనంతో టమోటా రైతు కుదేలు

- రైతు వద్ద కేజీ రూ.3..రిటైల్‌లో రూ.15
- పంట పెట్టుబడులు కూడా తిరిగిరాని దుస్థితి
- పంటను పీకేందుకు కూలీల ఖర్చు అదనం
- పంటను అలాగే వదిలేస్తున్న రైతులు

**ఉరవకొండ, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** ధర పతనం కావడంతో టమోటా రైతులు కుదేలవుతున్నారు. మూడు నెలల క్రితం వరకు రిటైల్‌లో కిలో 20 నుంచి 30 రూపాయల వరకు ధర పలికిన టమోటా నేడు 10 నుంచి 15 రూపాయలకు పడిపోవడంతో పంట సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. బోర్లు, బావుల కింద వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఆరుగ్రాలం శ్రమించిపంట సాగు చేస్తే పెట్టుబడుతు తిరిగి రాకపోగా పంట పీకేందుకు కూలీల ఖర్చును అదనంగా భరించాల్సి వస్తోందని వాపోతున్నారు. పంట పీకించి దాన్ని మార్కెట్‌కు తరలించి విక్రయించినా వచ్చే లాభమేమి లేకపోగా ఎదురు ఖర్చు అవుతోందంటూ అనేక మంది రైతులు పంట పీకకుండా అలాగే వదిలేస్తున్నారు.

**వివరాల్లోకి వెళితే...**

జిల్లా వ్యాప్తంగా బోర్లు, బావుల కింద అనేక మంది రైతులు వేల ఎకరాల్లో ఈ ఏడాది టమోటా పంట సాగు చేశారు. అయితే పంట ఆశాజనకంగానే పెరిగి మంచి దిగుబడులు వచ్చినా ధర అమాంతం పతనమైంది. పంట పెట్టే సమయంలో రైతు నుంచి వ్యాపారి కొనగోలు చేసే కిలో టమోటా ధర 15 నుంచి 25 రూపాయల వరకు (14 కేజీల బాక్స్ రూ.250 నుంచి రూ.300) ఉండేదని తీరా పంట చేతికొచ్చి అమ్ముకునే సమయంలో కేజీ 3, 4 రూపాయలు (14 కేజీల బాక్సు రూ.30) పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 60 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి పంట సాగు చేసి పంటను విక్రయించేందుకు వెళితే వ్యాపారులు నిర్ణయించే ధర కంటతడి పెట్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటపై పెట్టిన పెట్టుబడి మా ట అటుంచితే పంట పీకడానికి, ట్రాన్స్ పోర్టుకు అదనంగా చేతినుంచే డబ్బులు పెట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పీకడానికి ఒక కూలీ లకు రోజుకు 300 రూపాయలు కూలీ చెల్లించాలని ఒక ఎకరం పంట పీకడానికి కనీసం 10 మంది కూలీలు పెట్టుకుంటే వారికి 3,000 రూపాయలు కూలీ డబ్బులు చెల్లించాల్సి రాగా ధర పతనం కారణంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. పంట పీకించి మార్కెట్‌కు తరలించడం లాంటి వృధా ప్రయాస ఎందుకని పంటను అలాగే వదిలేస్తున్నామని పలువురు రైతులు చెప్పడం విశేషంగా చెప్పాలి. ప్రభుత్వం టమోటా పంటను గిట్టుబాటు ధరకు కొనగోలు చేసి రైతు బజార్లు ఇతరత్రా ప్రదేశాల్లో విక్రయిస్తే తమకు కాస్త ఊరట లభిస్తుందని పలువురు రైతులు కోరుతున్నారు

మోపిడి గ్రామంలో పంటల పీకకుండా వదిలేసిన టమోటా పంట పొలం



### భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తే అప్పులే మిగిలాయి



గ్రామంలో 1.5 ఎకరాల భూమిని 30వేల రూపాయలు కౌలుకు తీసుకొని మరో 70 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే పెట్టుబడులు తిరిగి రాకపోగా అ ప్పులే మిగిలాయని ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి చెందిన హుసేన్ అనే కౌ లు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంట దిగుబడి బాగానే ఉన్నా ధర పతనం కావడం చేత నష్టపోవాల్సి వచ్చిందని చెబుతున్నాడు. ప్రభుత్వం పరిహారం అందించి టమోటా రైతులను ఆదుకోవాలని ఆయన కోరుతున్నాడు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- సగ్గూరులో రోడ్లు ఊడ్చిన మంత్రి పార్థసారథి



**ఆగిరిపల్లి, సెప్టెంబరు19, (ప్రభాతవార్త) :** స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం సగ్గూరు గ్రామంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి స్వయంగా రోడ్లు ఊడ్చి, మొక్కలు నాటి, ప్రజలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్లాస్టిక్, ప్యాకేజింగ్ వస్తువుల వినియోగంతో చెత్త సమస్య పెరుగుతోందని, దాన్ని నియంత్రించేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రతి ఒక్క రూ మొక్కలు నాటి సంరక్షి ంచాలని కోరారు. చెత్త సేకరణ వాహనాలకు ఇంటి చెత్తను అందజేసి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. నూ జీవీడుసబ్‌కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ పారిశుధ్య సమస్యలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## భూసేకరణలో అక్రమాలకు తావులేదు

- ఎమ్మెల్యే బాలరాజు



**ఏలూరు, సెప్టెంబరు19, (ప్రభాతవార్త):** పోలవరం నియోజకవర్గంలో భూసే కరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియలో రైతులు, గిరిజనులకు ఎలాంటి అన్యా యం జరగకుండా అధికారులు నిబంధనల మేరకు పారదర్శకంగా వ్యవహ రించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. భూసేకరణలో అవినీ తి, అక్రమాలకు తావివ్వబోమని, భూములు కోల్పోతున్న వారికి చట్టప్రకా రం అందాల్సిన పరిహారం, హక్కులు పూర్తిస్థాయిలో కల్పించాలని అన్నారు. 1/70, పీసా చట్టాలను ఉల్లంఘించి గిరిజన భూములపై అక్రమ లావాదేవీలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే పేరు చెప్పి భూసేక రణ వ్యవహారాల్లో మధ్యవర్తులు, దళారులు అక్రమ వసూళ్లకు పాల్పడు తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఆధారాలతో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మిగులు భూముల విషయం లోనూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని అర్హులైన గిరిజన రైతులకు హక్కులు, సాగు అవకాశాలు కల్పించాలని సూచించారు. గతంలో జరిగిన భూసేకరణ అక్రమాలపైనా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమ స్యలు, ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణ అంశాలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఆర్‌డిఎస్‌ఎస్ పనుల వేగవంతం

- పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ



**తిరుపతి,సెప్టెంబర్ 19 ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడిసిఎల్ పరిధిలో పునర్వ్య వస్థీకరణ విద్యుత్ పంపిణీ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను వేగ వంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివ శంకర్ ఆదేశించారు. కార్పొరేట్ కార్యాలయం నురి శివశంకర్ లోతేటి ఆర్డిఎస్ఎస్ పనుల పురోగతిపై సంస్థ అధికారులు, కాంట్రాక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షి ంచారు. ఆర్‌డిఎస్ఎస్ కింద చేపట్టిన విద్యుత్ పంపిణీ వ్యవస్థ ఆధునికీకరణ, మౌళిక వసతుల బలోపేతం, నష్టాల నియంత్రణతోపాటు వినియోగదారులకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరాకు సంబంధించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ పథకం కింద పనులను నిర్దేశించిన లక్ష్యం లోగా పూర్తి చేయాలని సూచించారు. సంస్థ అధికారులు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షి స్తూ, పనుల్లో జాప్యానికి దారితీస్తున్న సమస్యలను గుర్తించి, వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్‌డిఎస్ఎస్ కాంట్రాక్టర్లు పనులకు అవసరమైన మానవ వనరులు, పరికరాలను పూర్తిస్థాయిలో సమకూర్చుకుని, పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్ ఐటి, ఫైనాన్స్ ఎఫ్‌ఏసీ) పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జే. రమణాదేవి, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీనివాసులు, లత, 9 జిల్లాల నుంచి సూపరింటెం డింగ్ ఇంజినీర్లు చంద్రశేఖర రావు, శేషాద్రి శేఖర్, ప్రదీప్ కుమార్, మోజెస్, చంద్రశేఖర్ రెడ్డి, అమర్ బాబు, శ్రీనివాసులు రెడ్డి, సుధాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఆర్‌డీఎస్ఎస్ పనుల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల ద్వారానే పేదరిక నిర్మూలన

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి




**ఏలూరు, సెప్టెంబరు19 (ప్రభాతవార్త).:** ప్రభుత్వ పథకాల ద్వారానే పేదరిక నిర్మూలన జరగాలని ఏలూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శ్రీదేవి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో శనివారం పేదరిక నిర్మూలన, మాదకద్రవ్యాల నియంత్రణ, ఆరోగ్య సంరక్ష ణ, న్యాయ సేవలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరినప్పుడే సమాజం అభివృద్ధి చెం దుతుందన్నారు. అధికారులు పథకాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలని, పేదలు వాటిని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ బా ధ్యతగా సహకరించాలని కోరారు. రాజ్యాంగ హ క్కులపై అవగాహన పెంచుకోవడంతోపాటు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాల న్నారు. జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కేసులను ఖర్చు లేకుండా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రూ.889.93 కోట్ల ఆర్థిక సహాయం డీఆర్‌డీఏ ద్వారా 10,086 స్వయం సహాయక సంఘాలకు చెందిన 61,120 మంది సభ్యులకు రూ.889.93 కోట్ల ఆర్థిక సహాయానికి సంబంధించిన నమూనా చెక్కును అందజేశారు. మెప్మా ద్వారా 2026 27 ఆర్థిక సంవత్సరంలో 591 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.75.5 2 కోట్ల రుణాలు మంజూరయ్యాయి. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు టచ్‌ఫో న్లు, వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. కార్య క్రమంలో 12 శాఖలకు సంబంధించిన స్టాళ్ల ను ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్ర మాలు, కళాకారుల బుర్రకథలు ఆకట్టుకున్నాయి.

**డ్రగ్స్‌పై కఠిన చర్యలు**

ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ డా.యం.జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులకు చేరేలా సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు సచివాలయాల ద్వా రా పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రజా సమ స్యలు, 22(ఏ) భూ సమస్యలకు పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా పరిష్కారం చూపుతున్నా మని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సి.హెచ్. శ్రావణ్‌కుమార్ రెడ్డి, ఏఎస్పీ వై. ప్రసా దరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్య దర్శి ఎన్. శ్రీలక్ష్మి, ఆర్డీవో కె. లక్ష్మీ ప్రసన్న, న్యాయమూర్తులు, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## చెత్తకుండీల్లో అన్నప్రసాదాల ప్యాకెట్లు



**తిరుమల,సెప్టెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల్లో అంగరంగవైభవంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు గరుడసేవకు అశేషభక్తులు తరలిరావడంతో టిటిడి మఠాల నుండి అన్నప్రసాదాల సహకారం కోరింది. ఇందుకు తగ్గట్లు తిరుమలలోని మఠాల నిర్వాహకులు కూడా శుచిగా రుచిగా అన్నప్రసాదాలు తయారుచేయించి భక్తులకు అందించేందుకు సిద్దమైంది. వారినుండి సహకారాన్ని అందించారు. అయితే బ్రహ్మోత్సవాల్లో అధిక రద్దీతో అన్నప్రసాదం పొట్లాలు నాలుగు మాడవీధుల్లో భక్తులు కోసం పంపిణీ చేసేందుకు సిద్దమైనా మఠాల నిర్వాహకుల నుండి నిర్దేశించిన సమయం కంటే ఆలస్యంగా అందించడంతో అవి భక్తులకు చేరలేక పోయాయి. దీంతో టిటిడి రెవెన్యూ ,ఆరోగ్య శాఖ, అన్నప్రసాదం విభాగం సిబ్బంది పులిహోర, దద్దోజనం, ప్యాకెట్లు భక్తులకు అందించలేకుండా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ అన్నదానం తయారు ప్రాంతంలో చెత్తకుండీల్లో పడ వేశారు. ఇలా సుమారు34 వేల అన్నం పొట్లాలు కుప్పతొట్టి పాలైందని తిరుమలలో విమర్శల వ్యాఖ్యలు వినిపించాయి. ఇలా వృధాగా నేలపాలు చేయడంతో భక్తులు కూడా అసహనం చెందారు.

# కళ్ల ముందే ఎండిపోతున్న రైతు ఆశ

- వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి డా.సాకే శైలజానాథ్



**శింగనమల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :** సకాలంలో కాలవలకు నీరు రాక తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో బోర్లలో నీరు లేక ఎండిపోయిన పంట పొలాలను రైతులు, నాయకులతో కలిసి వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ మాజీ మంత్రి డా.సాకే శైలజానాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా శింగనమల మండలంలోని నాగలగుడ్డం, వెస్ట్ నర్సాపురం, సోదనపల్లి, నర్సాపురం గ్రామాలలో రైతుల పరిస్థితి చూస్తే చాలా బాధగా ఉందని, నీరు లేక పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, మందులు పెట్టామని, పంటలు చేతికి వచ్చే సమయంలో నీరులేక ఇలా పంటలు ఎండిపోతుంటే వారి పరిస్థితి ఒక్కసారి ప్రజా ప్రతినిధులు ఆలోచన చేయాలని ఆయన పేర్కొన్నారు. రైతు ఎంత బాధపడుతున్నాడో ప్రత్యక్షంగా చూస్తున్నాం, ఇది కేవలం వర్షాలు పడలేదన్న సమస్య కాదు, అందుబాటులో ఉన్న నీటిని సకాలంలో రైతులకు అందించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్నారు. రైతులకు హామీలు కాదు, ఇప్పుడు కావాల్సింది నీరు. హామీలతో పంట పండదని, నీరు ఇస్తేనే పంట పండుతుందన్నారు. రైతు అప్పు చేసి పంట వేశాడు.. పంట ఎండిపోతే ఆ అప్పు ఎవరు తీరుస్తారు, రైతు కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారని ఆయన ప్రశ్నించారు. హెచ్ఎల్‌సి కాలువ, దిగువ ప్రాంతాల్లో ఉన్న రైతులకు సాగు నీరు అందించడంతోపాటు తాగునీటి సమస్యను కూడా వెంటనే పరిష్కరించాలని అన్నారు. నీరు అందక పండ్ల తోటలు నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని కోరారు. రైతు తోట ఎండిపోతే అది ఒక రైతు నష్టం కాదు, ఒక కుటుంబం భవిష్యత్తు ఎండిపోవడం, అందుకే మా డిమాండ్ ఒక్కటే మన ప్రాంతానికి మన నీరు ఇవ్వాలి, రైతు తోటను కాపాడాలి, రైతు కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ప్రకృతి కరువు రావచ్చు కానీ రైతు విషయంలో ప్రభుత్వానికి ముందు చూపు కరువైపోరాదన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారని, రైతుల కష్టాలు వినడం లేదని వెంటనే ప్రభుత్వం స్పందించి పంట నష్ట పరిహారం, ఇన్సురెన్స్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కౌలు రైతులు శ్రీరాములు మాట్లాడుతూ.. తాను ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని, మూడు ఎకరాలు బీర పంట సాగు చేశానని, డ్యాంనుంచి కాలవకు నీరు లేక పూర్తిగా పంట ఎండిపోయింది. మొత్తం పెట్టుబడి 2.60 లక్షలు పెట్టానని, కేవలం 80 వేలు మాత్రమే తన చేతికి వచ్చిందని, పూర్తిగా పంట నష్టపోయిందన్నారు. అనంతరం మొక్క జొన్న రైతు నీలకంఠారెడ్డి మాట్లాడుతూ.. తాను నాలుగు ఎకరాల్లో సాగు చేశానని, నాలుగు ఎకరాలకు 1.20లక్షలు పెట్టుబడి వచ్చిందని, తీరా పంట చేతికి వచ్చే సమయంలో నీరు అడుగంటడంతో పూర్తిగా నష్టపోయినట్లు ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలన్నారు. రైతు నాగిరెడ్డి మాట్లాడుతూ.. తాను నాలుగు ఎకరాల్లో చీనీ తోటలు సాగు చేశానని, నాలుగు సంవత్సరాల చీనీ చెట్లు కాయలు కాస్తున్న సమయంలో బోర్లలో నీరు ఇంయిపోవడంతో పూర్తిగా చెట్లు ఎండిపోయాయని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వాపోయారు. అనంతరం రైతు గట్టు నాయక్ మాట్లాడుతూ.. నాగలగుడ్డం తాండాలో బోర్లలో నీరు లేక పండ్ల మొక్కలు చీనీ చెట్లు, చివరికి తాగేందుకు నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## డిసిపల్లిలో వేలం ప్రక్రియ పూర్తి

- 125.95కోట్ల రూపాయల పొగాకు అమ్మకాలు



**మర్రిపాడు (నెల్లూరు), సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** నెల్లూరుజిల్లా డిసిపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారంతో అధికారికంగా పొగాకు వేలం ప్రక్రియ ముగిసింది. ఈ సందర్భంగా వేలం కేంద్ర కార్యాలయంలో వేలం కేంద్ర నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 125రోజులపాటు జరిగిన పొగాకు వేలం ప్రక్రియలో 125.95కోట్ల రూపాయల విలువైన పొగాకు అమ్మకాలు జరిగాయని పొగాకు వేలం కేంద్ర నిర్వహ టణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. 2025-26 పొగాకు పంటకాలానికి సంబంధించిన జరిగిన వేలం ప్రక్రియలో 19కం పెనీల కొనుగోలుదారులు పాల్గొన్నారు. వేలం కేంద్రానికి 56,937పొగాకు బేళ్ళను అనుమ తించగా 45, 727బేళ్ళు కొనుగోలు జరిగింద న్నారు. నో సేల్ 56, నోబిడ్ 7,873 , రైతులు వెనుకకు తీసుకు వెళ్ళిన బేళ్ళు 796, కంపెనీలు తిరస్కరించినవి 1741 బేళ్ళు, మొత్తంగా వెనక్కి వెళ్ళిన బేళ్ళు 10. 466, జంపింగ్ బేల్స్ 744 గా ఉన్నట్లు సునీల్‌కుమార్ తెలిపారు. వేలం ప్రక్రి యలో కేజీకి గరిష్ట 250రూపాయలు, కనిష్ట ధర 110రూపాయలు, సగటుధర 204-49 రూపాయలు పలికింది. మొత్తంగా ఈ ఆక్షన్‌సీజన్‌లో రైతులకు ఆశించిన ధరలు లభించలేదు. పంట ఉత్పాదక వ్యయం పెరిగినప్పటికీ వేలం ప్రక్రియలో రైతులు ఆశించిన ధరలు లభించకపోవడంతో ఎక్కువమంది రైతులు లక్షలాది రూపాయలను నష్టపోయే ప్రమాదం ఉందని బాధిత రైతులు వాపోతున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో వేలంప్రక్రియ ప్రారంభమైనప్పటికీ గతంలో ఎన్నడూ లేనివిధంగ సెప్టెంబరు 20వ తేదీ వరకు అధికారిక కొనుగోళ్ళు కొనసాగడం విశేషం. భారత పొగాకుబోర్డు అధికారులు రైతుల వద్ద మిగిలి ఉన్న అదనపు పొగాకు కొనుగోలుకు వెంటనే అనుమతులు మంజూరు చేసి తిరిగి వేలం ప్రక్రియను పునఃప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. 125రోజులపాటు సాగిన పొగాకు వేలం ప్రక్రియకు ఎలాంటి అడ్డంకులు, ఆటంకాలు లేకుండా విజయవంతంగా ముగిసేందుకు సహకరించిన రైతు సంఘం నాయకులకు , పొగాకు రైతులకు వేలంకేంద్ర నిర్వహణాధికారి ధన్యవాదాలు తెలిపారు.

## తూర్పు దూబగుంటలో పిడుగుపడి వ్యక్తి మృతి

**కలిగిరి (నెల్లూరు), సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** కలిగిరి మండలం తూర్పు దూబగుంట గ్రామంలో శనివారం విషాదం చోటు చేసుకుంది. తూర్పు దూబగుంట గ్రామానికి చెందిన తలపల రామారావు (45) అనేవ్యక్తి పొలంవద్దకు కాపలాకు వెళ్లినాడు. ఉదయాన్నే వర్షం పడుతుండడంతో దగ్గరలోని గుడిశలోనికి వెళ్లి తలదాసుకున్నాడు. ఆసమయంలో వర్షంతోపాటు పిడుగులు పడడంతో గుడిశలోని వ్యక్తిపై పిడుగుపడింది. పిడుగుపాటుకు రామారావు అక్కడే చనిపోయాడు. మృతునికి బార్య కొడుకు ఉన్నాడు. పేదకుటుంభమైన ఆకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న స్తానికులు, కుటుంబసభ్యులు అదికారులకు సమాచారమందించగా అదికారులు ,నాయకులు వెళ్లి జరిగిన సంఘనపై విచారణ చేపట్టారు.



## పిడుగు పాటుకు రెండు గేదెలు మృతి

**దగదర్తి (నెల్లూరు), సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రాంతమైన మబ్బుగుంట పాలెం గ్రామంలో పిడుగుపడి రెండు గేదెలు మృతి చెందిన ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. దాసరి శ్రీనివాసులు అనే రైతు గేదెల ఉన్న స్థలాన్ని శుభ్రం చేస్తూ కట్టేసి ఉన్న గేదెలను వదలగా వర్షం పడటంతో అవి చెట్టు కిందకి వెళ్లి చేరాయి. కొద్దిసేపటికి పిడుగు పడటం వలన రెండు గేదెలు మృతి చెందాయి. సుమారు వాటి విలువ రూ.1,50,000 వరకు ఉంటుందని, శ్రీనివాసులు కుటుంబం వాటి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వం నష్టపరిహారం వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

## గరుడసేవలో సింగపూర్ కళాకారుల ప్రదర్శన



**తిరుమల,సెప్టెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో శనివారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగిన శ్రీవారి గరుడ వాహన సేవలో సింగపూర్ కళాకారుల సీతారామ కళ్యాణ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా భక్తులను ఆకట్టుకున్నాయి.

**సింగపూర్ కళాకారుల తొలి ప్రదర్శన**

గరుడ వాహన సేవ సందర్భంగా తొలిసారిగా సింగపూర్ నుండి వచ్చిన కళాకారులు సీతారామ కళ్యాణంలోని పౌరాణిక పాత్రలను ప్రదర్శించి భక్తులను అలరించారు. భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**15 రకాల ఆహార పదార్థాలు, పానీయాలు**

గరుడసేవ సందర్భంగా భక్తులకు మొత్తం 15రకాల మెనూ అందించారు. 8 రకాల ఆహార పదార్థాలు, 7 రకాల పానీయాలు ఉన్నాయి.

## పోలీసుల విచారణలో రావణ్ కొన్నింటికే సమాధానం

**గన్నవరం (కృష్ణా), సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** ఉపాచట్టంలో అరెస్టయిన యూట్యూబర్ ప్రశ్న రావణ్‌ను శనివారం కృష్ణాజిల్లా, గన్నవరం పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఉదయం 10 గంటల నుండి రావణ్ న్యాయవాదుల సమక్షంలో గన్నవరం డిఎస్పీ ధరేంద్ర, సిఐ శివప్రసాద్‌లు సాయంత్రం 5గంటల వరకు గన్నవరం డిఎస్పీ కార్యాలయంలో సుధీర్ఘంగా విచారించారు. ఛానల్ నిర్వహణకు నిధులు ఎక్కడి నుండి వస్తాయి. దైనందిన కార్యక్రమాలు, ఛానల్ నిర్వహణ వంటి సాదారణ ప్రశ్నలు సంధించగా కొన్నిటికి మాత్రమే సమాధానాలు చెప్పినట్లు సమాచారం. మొత్తం 100 ప్రశ్నలు సంధించగా వాటిలో 25 ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు ఇచ్చాడు. మిగిలిన వాటికి తెలియదు, గుర్తులేదు వంటి రొటీన్ జవాబులు చెప్పినట్లు తెలుస్తుంది. కేవలం ప్రశ్నలు మాత్రమే సంధించిన పోలీస్ అధికారులు తొలిరోజు క్రాసింగ్ చేయలేదు. విచారణ మొత్తం వీడియోలో చిత్రీకరించారు. ఇంకా 5రోజులపాటు విచారించేందుకు కోర్టు అనుమతి ఇవ్వటంతో రావణ్ నోటి నుండి మొత్తం సమాచారాన్ని లాగేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

డేవిస్ కప్‌లో భారత్ ఫైనల్

# ఆశలు గల్లంతు

### కొరియా 3-1తో చరిత్రాత్మక విజయం





**సియోల్:** డేవిస్ కప్ ఫైనల్ 8కి చేరిన తొలి ఆసియా దేశంగా నిలవాలన్న భారతదేశపు ఆశలు గల్లంతయ్యాయి. సియోల్‌లో శనివారం జరిగిన క్వాలిఫయర్ రౌండ్ 2 మ్యాచ్‌లో కొరియా 3-1 తేడాతో విజయం సాధించింది. ఈ ఏడాది ఆరంభంలో నెదర్లాండ్స్‌ను ఓడించిన తర్వాత భారత్ నూతన ఆత్మవిశ్వాసంతో ఈ టైలోకి అడుగుపెట్టింది, కానీ తొలి సింగిల్స్‌లో వరుస ఓటములు ఎదురయ్యాయి. డబుల్స్‌లో సాధించిన ఒక ఉత్సాహభరితమైన విజయం భారత్ ఆశలను కొద్దిసేపు సజీవంగా ఉంచినా కానీ నాలుగో సెట్‌లో కొరియా టైని ముగించింది. ధక్షినేశ్వర్ సురేష్, ఎన్ శ్రీరామ్ బాలాజీ కొరియా జోడీని 6-3, 3-6, 6-3 తేడాతో ఓడించి భారత్‌కు ఒక ఆశాకిరణం అందించారు. రెండవ సెట్ కోల్పోయిన తర్వాత, భారత జోడీ నిర్ణయాత్మక సెట్‌లో తిరిగి పట్టు సాధించి, మ్యాచ్ కోసం సర్వ్ చేసే స్థితికి చేర్చిన ఒక కీలకమైన బ్రేక్‌ను నమోదు చేసింది. మిగిలిన రెండు సింగిల్స్‌లోనూ భారత్‌కు విజయాలు అవసరం కావడంతో, నిర్ణయాత్మక రివర్స్ సింగిల్స్‌లో ఒత్తిడి సుమిత్ నాగల్‌పై పడింది. అయితే, కొరియాకు చెందిన సూన్‌వూ క్వాన్ ఆధిపత్య ప్రదర్శన కనబరచడంతో, నాగల్‌కు పుంజుకోవడానికి అవకాశం లభించలేదు. క్వాన్ తొలి సెట్‌ను 6-1 తేడాతో సునాయాసంగా గెలుచుకుని, రెండో సెట్‌లోనూ తన పట్టును కొనసాగించాడు. నాగాల్ పోటీలో నిలవడానికి ప్రయత్నించినప్పటికీ, కొరియన్ ఆటగాడు ఆధిపత్యాన్ని కొనసాగించి, సెట్‌ను 6-2 తేడాతో కైవసం చేసుకుని, డేవిస్ కప్ నాకౌట్ దశకు కొరియా ప్రవేశాన్ని ఖరారు చేయడంతో భారత్ ప్రయాణం ముగిసింది.

కోల్‌కతా ఫుట్‌బాల్ లీగ్ ఛాంపియన్‌గా

# మోహన్ బగాన్

### 3-2 తేడాతో మహమ్మదన్ ఓటమి



**కోల్‌కత్తా:** కలకత్తా ఫుట్‌బాల్ లీగ్ చివరి మ్యాచ్ రోజున, శనివారం బరసత్ స్టేడియంలో జరిగిన పోరులో మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు, మొహమ్మదన్ స్పోర్టింగ్‌పై 3-2 తేడాతో ఉత్కంఠభరితమైన పునరాగమన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. బగాన్ తరఫున విజయపు గోల్ సాధించడంతో, ఆ జట్టు ఎనిమిదేళ్ల తర్వాత మరియు మొత్తంగా తమ 31వ కలకత్తా ఫుట్‌బాల్ లీగ్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్ తర్వాత భారత శిబిరంలో చేరనున్న సహల్ అబ్దుల్ సమద్, రెండు గోల్స్ చేసి, విజయపు గోల్‌కు సహకారం అందించి బగాన్ జట్టులో అత్యంత కీలక ఆటగాడిగా నిలిచాడు. బాగాన్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగినప్పటికీ, బ్లాక్ పాంథర్స్ ప్రదర్శించిన గడ్డు ఆటతీరుతో వారికి గట్టి పోటీ ఎదురైంది. లాల్‌రెమ్‌సంగా ఫనాయ్, కెప్టెన్ మహితోష్ రాయ్ గోల్స్ చేయడంతో, బ్లాక్ పాంథర్స్ 63వ నిమిషంలో రెండు గోల్స్ చేసి 2-1 ఆధిక్యాన్ని సాధించింది. కొన్ని నిమిషాల ముందే వారి గోల్ కీపర్ దీప్రోభట్ ఘోష్‌కు రెడ్ కార్డ్ చూపడంతో, ఇది మెరైనర్స్ పనిని మరింత క్లిష్టతరం చేసింది. అయితే బస్తాబ్ రాయ్ బృందం సంయమనం కోల్పోకుండా పుంజుకుని, చివరకు సూపర్‌సబ్ సయాన్ ద్వారా విజయపు గోల్‌ను సాధించింది.




## చెస్ ఒలింపియాడ్.. రేటింగ్‌లో దారుణం

### 2700 కంటే దిగువకు గుకేశ్

**ఉజ్బెకిస్తాన్:** భార్చబీ ప్రస్తుత ప్రపంచ చెస్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్ నాలుగేళ్లకు పైగా కాలంలో తొలిసారిగా 2700 రేటింగ్ కంటే దిగువకు పడిపోయాడు. ప్రస్తుతం జరుగుతున్న 2026 చెస్ ఒలింపియాడ్‌లో ఇండోనేషియాకు చెందిన ఐఎం సత్రియా దుతా చహాయాతో డ్రా చేసుకున్న గుకేశ్, 3.5 రేటింగ్ పాయింట్లను కోల్పోయాడు. ఫలితంగా, చెన్నైకి చెందిన 20 ఏళ్ల యువకుడు ఇప్పుడు లైవ్ రేటింగ్స్‌లో 2699.5 రేటింగ్‌ను సాధించి, ఆగష్టు 2022 తర్వాత తొలిసారిగా 2700 క్లబ్ నుండి బయటకు వచ్చాడు. దాదాపు రెండు సంవత్సరాల క్రితం, అక్టోబర్ 2024లో, బుడాపెస్ట్‌లో జరిగిన 2024 చెస్ ఒలింపియాడ్ టైటిల్‌ను భారత్ గెలుచుకోవడంలో తన అజేయ పరంపర కీలక పాత్ర పోషించిన తర్వాత, గుకేష్ 2794 అనే తన అత్యున్నత రేటింగ్‌ను సాధించాడు. విడిగా చూస్తే చాహోయాతో జరిగిన డ్రా నిరాశాజనకమైన ఫలితంగా అనిపించినప్పటికీ, బోర్డ్ 2లో నిహాల్ సరీన్ ఓటమి అంచున ఉన్న ప్రస్తుత ఛాంపియన్ భారత జట్టుకు, నల్ల పావులతో గుకేష్ అనుసరించిన రిస్క్ లేని వ్యూహం ఆ సమయానికి అత్యంత అవసరమైంది. ఒక ఎక్స్ఛేంజ్ త్యాగంతో నిహాల్ విజయం సాధించినప్పటికీ, తన జట్టుకు పాయింట్లను కాపాడటానికి తక్కువ రేటింగ్ ఉన్న ఆటగాడిపై గుకేష్ అనుసరించిన జాగ్రత్తాయుతమైన విధానంతో రేటింగ్ పడిపోయింది.

# టీమిండియా మిషన్ 300

## ఇక ప్రత్యర్థులపై దూకుడే..




**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్లో భారత జట్టు అద్భుతాలు చేస్తున్న విషయం తెలిసిందే. ద్వైపాక్షిక సిరీస్లతో పాటు టీ20 ప్రపంచ కప్ ఛాంపియన్‌గా కూడా నిలిచింది. ఇటీవల ఒకటి, రెండు సిరీస్లలో కాస్త నిరాశపర్చినా, ఇప్పుడు మరలా పుంజుకుంది. ఇందుకు కారణం దూకుడు బ్యాటింగే. ఈ క్రమంలో టీమిండియా మరో సంచలన మార్క్‌పై కన్నేసింది. భారీ స్కోర్లు సాధిస్తూ ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయిస్తున్న భారత్ త్వరలోనే 300 పరుగుల మార్కు అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. జట్టులో ఉన్న ప్రతిభను చూస్తే ఈ ఘనత సాధించడం సాధ్యమేనని బిసిసిఐ భావిస్తోంది. ఆఫ్ఘనిస్థాన్‌తో ఈ నెల 17 జరిగిన మూడో టీ20లో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 30 బంతుల్లోనే సెంచరీ చేశాడు. అభిషేక్ వ్యక్తిగత సెంచరీ కంటే అతడి ఇన్నింగ్స్ జట్టుపై చూపించిన ప్రభావమే ముఖ్యమని అంటోంది. అదే సమయంలో అతిపెద్ద సానుకూల అంశం ఏంటంటే పవర్‌ప్లేలో భారత్ తొలిసారి 100 పరుగులు చేయడం ప్రత్యేకమైన ఘట్టంగా అంచనా వేస్తోంది. మనం దూకుడుగా ఆడటం మొదలుపెడితే అదే దూకుడును కొనసాగించాలన్న సందేశాన్ని ఈ ఇన్నింగ్స్ ఇచ్చిందనే మార్పును గమనించింది. ఈ నేపథ్యంలో టీమిండియా తర్వాతి లక్ష్యం 300 పరుగులేనని బిసిసిఐ స్పష్టం చేస్తోంది. టీమిండియా ఇంకా 300 పరుగుల మార్కు చేరుకోలేదని, అదే తదుపరి లక్ష్యంగా జట్టును సిద్ధం చేస్తోంది. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న ప్రతిభను చూస్తే మరిన్ని అద్భుతాలు చేయాల్సి ఉంటుందని చెబుతోంది. టీ20ల్లో భారత్ అత్యధిక స్కోరు 297 పరుగులు. 2024లో బంగ్లాదేశ్‌పై భారత్ ఈ స్కోరు చేసింది. అదే ఏడాది దక్షిణాఫ్రికాపై 283/1 పరుగులు కూడా చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌తో తాజా మ్యాచ్‌లోనూ భారత్ భారీ స్కోరు చేసే అవకాశం వచ్చింది. అయితే చివరి ఐదు ఓవర్లలో బ్యాటర్లు ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోవంతో భారత్ 221/7 వద్ద ఇన్నింగ్స్‌ను ముగించింది. ఈ సారి మిషన్ 300 లక్ష్యాన్ని చేరుకోవాలనే పట్టుదలతో టీమిండియా సన్నద్ధమవుతోంది.



## టెక్బాల్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌లో క్వీమ్సీ డిసౌజా ఓటమి

**నగోయా (జపాన్):** జపాన్‌లోని నగోయాలో ఉన్న నగోయా సిటీ హిగాషి స్పోర్ట్స్ సెంటర్‌లో శనివారం జరిగిన ఆసియా గేమ్స్ 2026 టెక్బాల్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌లో భారత క్రీడాకారిణి క్వీమ్సీ డిసౌజా ఇండోనేషియాకు చెందిన సుమయ చేతిలో ఓడిపోయింది. ఆసియా క్రీడల్లో తొలిసారిగా అడుగుపెడుతున్న టెక్బాల్‌లో, సుమయ 7-12, 12-9, 12-7 స్కోరుతో మూడు సెట్ల విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లి, కనీసం రజత పతకాన్ని ఖాయం చేసుకుంది. తొలి సెట్‌లో క్వీమ్సీ వేగంగా ప్రారంభించి 8-2 ఆధిక్యాన్ని సాధించింది. సుమయ పోరాడినా, భారత క్రీడాకారిణి తొలి సెట్‌ను గెలుచుకోకుండా ఆపలేకపోయింది.
రెండవ సెట్‌లో ఇండోనేషియా క్రీడాకారిణి బలంగా పుంజుకుని, ఆరంభంలోనే ఆధిక్యం సాధించింది. మధ్యలో క్వీమ్సీ తిరిగి పుంజుకుని, స్కోరును 6-6, ఆ తర్వాత 8-8తో సమం చేసింది, కానీ చివరిలో సుమయా ఆధిక్యం సాధించి మ్యాచ్‌ను సమం చేసింది. నిర్ణయాత్మక సెట్‌లో క్వీమ్సీ మళ్ళీ అద్భుతంగా ప్రారంభించి, 7-3 ఆధిక్యాన్ని సంపాదించింది. అయితే, సుమయా అద్భుతంగా పుంజుకుని, తర్వాతి తొమ్మిది పాయింట్లను గెలుచుకుని విజయాన్ని పూర్తి చేసుకుని ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. కాగా ఆదివారం కాంస్య పతకం కోసం జరిగే మ్యాచ్‌లో యుయినా సకామోటోతో తలపడనున్న క్వీమ్సీకి, భారతదేశానికి చారిత్రాత్మక పతకాన్ని గెలుచుకోవడానికి మరో అవకాశం లభించనుంది. గ్రూప్ దశలో, క్వీమ్సీ 43 నిమిషాల్లో సకామోటోను 2-1 (10-12, 12-11, 13-11) తేడాతో ఓడించింది.

# బ్యాంకులకు లాభాలు తెచ్చిపెట్టే డాలర్ డిపాజిట్లు

### ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక అంచనా



**ముంబయి, సెప్టెంబరు 19:** దేశంలోని బ్యాంకులకు డాలర్ డిపాజిట్లు భారీ లాభాన్ని తెచ్చిపెట్టే అవకాశంఉందని ఎస్‌బిఐ రీసెర్చ్ తెలిపింది. ఎఫ్‌సీఎన్ఆర్ (బీ) డిపాజిట్ పథకం కింద మూడు నెలలలోపే 127 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.12.2 లక్షల కోట్లు) సమీకరించాయని ఈ మొత్తంతో వచ్చే ఐదేళ్లలో బ్యాంకులకు దాదాపు రూ.ఐదు లక్షల కోట్ల మేర నామమాత్రపు లాభం రావచ్చని అంచనా వేసింది. రిజర్వ్ బ్యాంక్‌కు మరో రూ.50 వేల కోట్ల లాభం వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ఈ పథకం వల్ల బ్యాంకులపై భారీ ఖర్చు పడుతుందన్న వాదనలను ఎస్‌బిఐ రీసెర్చ్ తోసిపుచ్చింది. డాలర్లను సమీకరించేందుకు చెల్లించే వడ్డీ, కరెన్సీ మారకం రిస్క్‌ను తగ్గించేందుకు చేసే హెడ్జింగ్ ఖర్చుప్రధాన వ్యయాలని వివరించింది. అయితే డాలర్ విలువలో మార్పును, హెడ్జింగ్ ఖర్చును కలిపి లెక్కించి భారీ నష్టాన్ని చూపడం సరికాదని నివేదిక పేర్కొంది. బ్యాంకులు తమ డాలర్ బకాయిలకు హెడ్జింగ్ చేసుకుంటాయని అందువల్ల మారకం విలువలో మార్పు ప్రభావం మెచ్యూరిటీ సమయంలో పెద్దగా ఉండదని వివరించింది. ఇక భారీగా నిధులు రావడం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెరిగిందన్న ఆందోళన అవసరం లేదని ఎస్‌బిఐ రీసెర్చ్ తెలిపింది. పండగల సమయంలో పెరిగే డిమాండ్, రుణాల పంపిణీ, కొత్త రుణాల మంజూరు, అడ్వాన్స్ ట్యాక్స్, జీఎస్‌టీ చెల్లింపుల వల్ల ఈ నిధులు వ్యవస్థలోనే వినియోగంలోకి వస్తాయని పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ విషయానికొస్తే సుమారు 100 బిలియన్ డాలర్లను విదేశీ పెట్టుబడి అవకాశాల్లో నాలుగు శాతం రాబడితో పెట్టుబడి పెడితే ఐదేళ్లలో 20 బిలియన్ డాలర్ల ఆదాయం రావచ్చని నివేదిక అంచనా వేసింది.

## స్విఫ్ట్, డిజైన్ సిఎన్జీ మోడళ్లలో మారుతి అప్‌డేట్





**ముంబయి, సెప్టెంబరు 19:** మారుతి సుజుకి స్విఫ్ట్, డిజైర్ సీఎన్‌జీ మోడళ్లలో తొలిసారిగా ఏఎంటీ గేర్‌బాక్స్‌ను తీసుకొచ్చింది. ఫ్యాక్టరీలోనే అమర్చిన సీఎన్‌జీ యూనిట్‌తో ఆటోమేటిక్ గేర్ బాక్స్‌ను అందించడం మారుతి చరిత్రలో ఇదే తొలిసారి. స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీ ప్రారంభ ధర రూ.7.92 లక్షలు కాగా డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీ ధర రూ.8.53లక్షలు. ఇవి ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధరలు. సంబంధిత సీఎన్‌జీ మాన్యువల్ వేరియంట్లతో పోలిస్తే ఏఎంటీ మోడళ్ల ధర రూ.35 వేలు ఎక్కువ. స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీను విఎక్స్ఐ, విఎక్స్ఐ(0),జడ్ఎక్స్ఐఎన్ వేరియంట్లలో తీసుకొచ్చారు. డిజైర్ సీఎన్‌జీ ఏఎంట రెండు వేరియంట్లలో లభిస్తుంది. సీఎన్‌జీతో ఏఎంటీను అందిస్తున్న దేశంలో రెండో సంస్థగా మారుతి నిలిచింది. ఇప్పటికే టాటా మోటార్స్ ఈ కాంబినేషన్‌ను అందిస్తోంది. స్విఫ్ట్,డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీలో 1.2లీటర్, మూడు సిలిండర్ల జెడ్12ఈ పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. సీఎన్‌జీ మోడ్‌లో ఇది 70 హెచ్‌పీ శక్తి, 102 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 5స్పీడ్ ఏఎంటీ గేర్‌బాక్స్‌తో ఇంజిన్‌ను జత చేశారు. మైలేజీ విషయంలో స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీ లీటర్‌కు కాకుండా కిలోగ్రామ్ సీఎన్‌జీకి 35.34 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీ 36.47 కిలోమీటర్లు ఇస్తుందని పేర్కొంది. మాన్యువల్ మోడళ్లతో పోలిస్తే ఇవి వరుసగా 2.49, 2.74 కిలోమీటర్లు ఎక్కువ. సీఎన్‌జీ ట్యాంక్ అదనపు బరువును తట్టుకునేలా సస్పెన్షన్‌ను మార్చారు. సీఎన్‌జీ ఫ్యూయల్ లెవల్ ఇండికేటర్, పెట్రోల్ సీఎన్‌జీ మధ్య సులభంగా మారేందుకు ఫ్యూయల్ స్విచ్ కూడా ఉన్నాయి. ఇదే అప్‌డేట్‌లో భాగంగా బాలెనో సీఎన్‌జీ ఏఎంటీను కూడా మారుతి తీసుకొచ్చింది. దీని ప్రారంభ ఎక్స్ షోరూమ్ ధర రూ.8.32 లక్షలు. ఆటోమేటిక్ డ్రైవింగ్ సౌకర్యంతోపాటు సీఎన్‌జీ తక్కువ రన్నింగ్ ఖర్చు, తక్కువ ఉద్గారాలను కలపడం తమ ఆటో గ్రీన్ మిషన్ లక్ష్యమని కంపెనీ తెలిపింది.

# సీనియర్ సిటిజెన్స్‌కోసం బ్యాంకుల్లో ప్రత్యేక డిపాజిట్లు




**ముంబయి, సెప్టెంబరు 19:** సురక్షితమైన పెట్టుబడి ఆప్షన్లలో ఇప్పటికీ చాలా మంది బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేస్తుంటారన్న సంగతి తెలిసిందే. వీటిల్లో ఎలాంటి రిస్క్ ఉండదు. నిర్దిష్ట పెట్టుబడులపై నిర్దిష్ట వడ్డీ రేట్ల ప్రకారం గ్యారెంటీ రిటర్న్స్ వస్తాయి. అన్ని బ్యాంకుల్లో వడ్డీ రేట్లు ఒకేలా ఉండవు. టెన్యూర్‌ను బట్టి మారుతుంటాయి. ఇంకా బ్యాంకుల్ని బట్టి కూడా వడ్డీ రేట్లలో మార్పులు ఉంటాయి. ఆర్బీఐ రెపో రేట్లను తగ్గిస్తూ వచ్చిన నేపథ్యంలో గత కొంత కాలంగా చాలా బ్యాంకుల్లో వడ్డీ రేట్లు తగ్గాయి. అయినప్పటికీ స్పెషల్ డిపాజిట్లు ఆఫర్ చేస్తున్నాయి. ప్రత్యేక టెన్యూర్లపై ఇక్కడ అధిక వడ్డీ అందిస్తున్నాయి. ఇదే సమయంలో సాధారణ ప్రజల కంటే ఏ బ్యాంకులో అయినా సీనియర్ సిటిజెన్లకు 50 బేసిస్ పాయింట్ల వరకు అధిక వడ్డీ వస్తుంది. ప్రత్యేక టెన్యూర్ డిపాజిట్లలోనే 555 రోజుల వ్యవధి ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ ఒకటి. ప్రస్తుతం కొన్ని బ్యాంకులు ఈ కాల పరిమితిపై గరిష్ఠంగా సాధారణ ప్రజలకు 7.25 శాతం వరకు వడ్డీ అందిస్తుండగా, సీనియర్ సిటిజెన్లకు అత్యధికంగా 7.50 శాతం వరకు వడ్డీ అందిస్తున్నాయి. సిటీ యూనియన్ బ్యాంకు ఈ బ్యాంకులో 555 రోజుల టెన్యూర్ ఉన్న స్పెషల్ ఎఫ్‌డీపై సాధారణ కస్టమర్లకు అత్యధికంగా 7.25 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.50 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. కర్ణాటక బ్యాంకులో వీరికి వడ్డీ రేట్లు వరుసగా ఇదే టెన్యూర్‌పై 7 శాతం, 7.40 శాతంగా ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడాలో 555 రోజుల స్పెషల్ ఎఫ్‌డీపై సాధారణ ప్రజలకు అత్యధికంగా 6.75 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.25 శాతం మేర వడ్డీ అందిస్తోంది.
ఇండియన్ బ్యాంకులో ఈ డిపాజిట్లపై సాధారణ ప్రజలకు 6.65 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.15 శాతం వడ్డీ వస్తోంది. కెనరా బ్యాంకులో వరుసగా వడ్డీరేట్లు 6.60 శాతం, 7.10 శాతంగా ఉన్నాయి. ఇదే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వరుసగా సాధారణ ప్రజలకు 6.55 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.05 శాతంగా ఉన్నాయి. ఇక ఎఫ్‌డీపై వచ్చే ఆదాయానికి కొన్ని సందర్భాల్లో టిడిఎస్ వర్తిస్తుంది. 60 యేళ్లలోపు వారికి ఒక ఆర్థిక సంవత్సరంలో వడ్డీ ఆదాయం రూ. 50 వేలు దాటితే టిడిఎస్ వర్తించే అవకాశం ఉంది. సీనియర్ సిటిజెన్లకు ఈ పరిమితి రూ. 1 లక్షగా ఉంది. బ్యాంకులు వడ్డీ రేట్లను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉంటాయి.





## భారత్‌లో బంగారంపై విపరీతమైన మోజు

### సీనియర్ బ్యాంకర్ ఉదయ్ కోటక్

**ముంబయి, సెప్టెంబరు 19:** భారతదేశానికి బంగారంపై ఉన్న విపరీతమైన మోజు దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద సవాలుగా మారిందని,ఈ అడ్డంకిలేకుంటే భారత్ సులభంగా కరెంట్ అకౌంట్ మిగులును సాధించి ఉండేదని సీనియర్ బ్యాంకర్ ఉదయ్ కోటక్ వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్ ఫైనాన్షియల్ మినిస్టర్‌స్టేట్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. మారుతున్న ప్రపంచ పరిణామాల మధ్య దేశం మరింత పటిష్టంగా నిలబడాలంటే భారతదేశం ఈ బంగారు చిక్కుముడిని వెంటనే విప్పాల్సిన అవసరం ఉందన్నారు.
ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు విపరీతంగా పెరగడం వల్ల పరిమాణంలో పెద్ద మార్పు లేకపోయినా దిగుమతుల బిల్లు భారీగా పెరుగుతోందని ఉదయ్ కోటక్ ఆందోళన వ్యక్తం చేశారు. 2027 ఆర్థిక సంవత్సరంలో భారతదేశపు కరెంట్ అకౌంట్ లోటు సుమారు 60 బిలియన్ డాలర్లుగా ఉండే అవకాశం ఉందని అదే సమయంలో బంగారం దిగుమతులే ఏకంగా 88 నుండి 90 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని ఆయన అంచనా వేశారు.

## దిగివచ్చిన చక్కెర రిటైల్ ధరలు



**ముంబయి, సెప్టెంబరు 19:** పండుగల వేళ సామాన్యుడికి మళ్లీ ఊరట లభించనుంది. గడిచిన మూడు వారాల్లోనే బహిరంగ మార్కెట్‌లో కిలో పంచదార రిటైల్ ధర దాదాపు 10 శాతం మేర తగ్గి, రూ. 65 నుంచి రూ. 58.50 కి దిగివచ్చిన విషయం తెలిసిందే. కేవలం ధరల తగ్గింపే కాకుండా, మార్కెట్లో చక్కెర కొరత ఏర్పడకుండా కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ద ఎత్తున పంచదారను ఉపయోగించే వ్యాపారులు లేదా పారిశ్రామిక వినియోగదారులు ఇప్పటివరకు కేవలం 15 రోజులకు సరిపడా నిల్వలు (స్టాక్) మాత్రమే ఉంచుకోవడానికి అనుమతి ఉండగా, ఆ పరిమితిని ప్రభుత్వం ఇప్పుడు 30 రోజులకు పెంచింది. గత కొన్ని వారాలుగా తగ్గుతున్న ధరల ట్రెండ్‌ను పరిగణనలోకి తీసుకుని, పండుగల సమయంలో పెరిగే డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా ఉండేలా చూసేందుకే ప్రభుత్వం ఈ సడలింపు ఇచ్చింది. పండుగల సమయంలో స్వీట్లు, ఇతర పిండివంటల తయారీ విపరీతంగా పెరుగుతుంది కాబట్టి పంచదారకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటం సహజం. ఇలాంటి కీలక సమయంలో ప్రభుత్వంతీసుకున్న ఈ నిర్ణయంఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. కాకపోతే, చక్కెరమిల్లులవద్ద ధరలు దాదాపు 25 శాతం వరకు పడిపోయినప్పటికీ, ఆ స్థాయిలో రిటైల్ మార్కెట్‌లో కస్టమర్లకు లబ్ధి చేకూరలేదని ఆహార శాఖ పరిశ్రమల వర్గాలకు స్పష్టంచేసింది. మిల్లుల వద్ద తగ్గిన ధరల ప్రయోజనాన్ని హోల్‌సేలర్లు, రిటైలర్లు, వ్యాపారులు వెంటనే సామాన్య వినియోగదారులకు అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వ్యాపారులకు నిల్వ పరిమితిని 15 రోజుల నుంచి 30 రోజులకు పెంచుతూ ఇచ్చిన ఈ వెసులుబాటు వెనుక ఒక ముఖ్యమైన షరతు కూడా ఉంది. నెలకు 10 టన్నుల కంటే ఎక్కువ పంచదారను ముడిసరుకుగా వాడే పెద్ద బిస్కెట్ తయారీ కంపెనీలు, స్వీట్ షాపులు, సాఫ్ట్ డ్రింక్‌సంస్థలు, బేకింగ్ పరిశ్రమలు ఈహోల్‌సేల్ వినియోగదారుల పరిధిలోకి వస్తాయి. ప్రభుత్వం ఇచ్చిన కొత్త సడలింపు ప్రకారం.. వీరు అదనంగా ఉంచుకునే మరో 15 రోజుల నిల్వలను కేవలం టారిఫ్ రేట్ కోటా కింద దిగుమతి చేసుకున్న చక్కెర ద్వారా గానీ, లేదా అడ్వాన్స్ ఆథరైజేషన్ స్కీమ్ కింద సేకరించిన దాని ద్వారా గానీ మాత్రమే భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది.

## ఎల్ఐసి కేసులో అనిల్ అంబానీపై మరోకేసు నమోదు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ గ్రూప్ మాజీ ఛైర్మన్ అనిల్ అంబానీ మరోసారి చట్టపరమైన చిక్కుల్లో పడ్డారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి చెందిన సుమారు రూ.2,684.57 కోట్ల నిధులను మోసపూరితంగా మళ్లించారనే ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో అనిల్ అంబానీతో పాటు రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్ (ఆర్ క్యాప్), రిలయన్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సతీశ్ సేథ్‌తో పాటు మరికొందరు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులను నిందితులుగా చేర్చారు. ఎల్ఐసీ సమర్పించిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా సిబిఐ ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. 2012 ఏప్రిల్ నుంచి 2018 మార్చి మధ్య కాలంలో రిలయన్స్ క్యాపిటల్ జారీ చేసిన ఐదు నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లలో ఎల్ఐసి మొత్తం రూ.3,900 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. సంస్థాగత అవసరాలు, పాత రుణాల చెల్లింపుల నిమిత్తం ఈ నిధులను వినియోగిస్తామని చెప్పి, ఆపై వాటిని దుర్వినియోగంచేశారని ఎల్ఐసి తన ఫిర్యాదులో ఆరోపించింది. నిందితులు నేరపూరిత కుట్రకు పాల్పడి, లెక్కలను తారుమారు చేయడం ద్వారా ఎల్ఐసికి భారీ ఆర్థిక నష్టం కలిగించారని సిబిఐ పేర్కొంది. ఈ కుట్రలో ఎవరెవరి పాత్ర ఉందో తేల్చేందుకు, అలాగే మళ్లించిన నిధుల గమ్యాన్ని గుర్తించేందుకు దర్యాప్తును ముమ్మరంచేసినట్లు సిబిఐ వెల్లడించింది. ఇదిలా ఉండగా, రిలయన్స్ గ్రూప్‌కుచెందిన పలుకంపెనీలపై సిబిఐ ఇప్పటికే 8 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసింది. ఈ కేసులకు సంబంధించి ఇప్పటివరకు ఆరు ఛార్జిషీట్లు దాఖలుకాగా, ఏడుగురిని అరెస్ట్ చేసింది. ఈ పరిణామాలపై అనిల్ అంబానీ ప్రతినిధిస్పందిస్తూ, ఈవ్యవహారం రిలయన్స్ క్యాపిటల్‌కు సంబంధించినదని తెలిపారు. 2021 నవంబర్ వరకు అనిల్ అంబానీ ఆ కంపెనీ బోర్డులో నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గామాత్రమే కొనసాగారని వివరించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

20 -9Pg9th cheli:20 -9Pg9th cheli.qxd 9/19/2026 10:24 PM Page 1



# రుచులే రుచులు !

## చికెన్ పాప్‌కార్న్



**కావాల్సినవి :** బోన్‌లెస్ చికెన్-500గ్రా మారినేషన్ కోసం : అల్లంవెల్లుల్లి పేస్ట్-చెంచా, ఉప్పు- తగినంత,కారం-చెంచాన్నర, పసుపు-పావుచెంచా, ధనియాలపొడి-అరచెంచా, వెనిగర్-చెంచా, కొత్తిమీర తరుగు-చెంచాన్నర, గుడ్డు-1, మొక్కజొన్నపిండి-చెంచాన్నర, కోటింగ్ కోసం: బ్రెడ్‌క్రంబ్స్ -ముప్పావుకప్పు, కార్న్ ఫ్లేక్స్ పొడి-కప్పులో మూడోవంతు, ఉప్పు-అరచెంచా, కారం-చెంచా, నూనె- వేయించడానికి సరిపడ.

**తయారీ :** ఒక పాత్రలో చికెన్ వేసుకుని మారినేషన్ చేయడానికి కావాల్సిన పదార్థాలన్నీ బాగా కలిపి ఫ్రిజ్‌లో రెండు గంటపాటు ఉంచాలి. మరొక పాత్ర తీసుకుని దీనిలో కోటింగ్ కోసం మొక్కజొన్నపిండి, బ్రెడ్‌క్రంబ్స్, కార్న్‌ఫ్లేక్స్ పొడి, ఉప్పు, కారం అన్నీ బాగా కలపాలి. మారినేట్ చేసి సిద్ధంగా పెట్టుకుననన చికెన్ ముక్కలని ఈ కోటింగ్ పొడిలో వేసి దొర్లించుకోవాలి. వీటిని నూనెలో ఎర్రగా వేయించుకుంటే చికెన్ పాప్‌కార్న్ సిద్ధం. వెజ్, నాన్‌వెజ్ ఏ స్టార్టర్‌లు చేసినా.. పదార్థాల్ని ఒకటి రెండు గంటలు మారినేట్ చేసి పెట్టుకుంటే ఆ రుచి ప్రత్యేకంగా ఉంటుంది.

## మష్రూమ్ 65..



**కావాల్సినవి :** పెరుగు-అర కప్పు, అల్లంవెల్లుల్లి పేస్ట్-చెంచా, ఎర్రని కశ్మీరి కారం-రెండు చెంచాలు, జీలకర్ర- చెంచా, ధనియాల పొడి-రెండు చెంచాలు, గరం మసాలా- చెంచా, కరివేపాకు-రెబ్బ, కార్న్‌ఫ్లోర్-రెండు చెంచాలు, మైదా-4 చెంచాలు, నిమ్మరసం-అరచెంచా, ఉప్పు-తగినంత, పుట్టగొడుగులు-200 గ్రా, నూనె- వేయించ డానికి సరిపడ, ఉల్లికాడ-ఒకటి, బియ్యప్పిండి-రెండు చెంచాలు.

**తయారీ :** ముందుగా పుట్టగొడుగులని శుభ్రం చేసుకుని నిలువుగా తరిగి పెట్టుకోవాలి. ఒక పాత్రలో పెరుగుని క్రీంలా అయ్యేలా చిలికి పెట్టుకోవాలి. దీనికి అల్లం, వెల్లుల్లిపేస్ట్, గరంమసాలా, కారం, జీలకర్ర పొడి, ధనియాలపొడి, సన్నగా తరిగిన కరివేపాకు, మొక్కజొన్న పిండి, మైదా, బియ్యప్పిండి, ఉప్పు చివరిగా నిమ్మరసం వేసుకోవాలి. స్టౌ వెలిగించి కడాయి పెట్టుకుని నూనె పోసి వేడెక్కాక.. అప్పుడు మొక్కజొన్నపిండి మిశ్రమంలో మష్రూమ్స్‌ని వేసుకోవాలి. ముందే వేసుకుంటే వాటి నుంచి నీళ్లు ఊరి పిండి పలచబడుతుంది. వీలైనంత వరకూ పిండి పలచగా లేకుండా జాగ్రత్తపడాలి. లేదంటే కాస్త వియ్యప్పిండి వేసుకోవాలి. పిండిలో ముంచి మష్రూమ్స్‌ని నూనెలో దోరగా వేయించుకోవడమే. ఉల్లికాడల్ని సన్నగా తరిగి వడ్డించుకుంటే సరి.

## చట్‌పటా ఆలూ..

**కావాల్సినవి :** బేబీ ఆలూ (చిన్న బంగాళాదుంపలు)-15 (ఆలూ ముక్కలు కూడా తీసుకోవచ్చు), ధనియాల పొడి-రెండు చెంచాలు, కారం-చెంచా, ఆమ్‌చూర్ పొడి-రెండు చెంచాలు, గరంమసాలా- చెంచా, వేయించిన నువ్వులు-రెండు చెంచాలు, సోంపు పొడి-చెంచా, ఉప్పు-రుచికి తగినంత, నూనె-తగినంత, కరివేపాకు-రెబ్బ.

**తయారీ :** బంగాళా దుంపల్ని ఉడికించి పొట్టు తీసి పక్కన పెట్టుకోవాలి. వీటిని నూనెలో ఎర్రగా వేయించుకోవాలి. స్టౌ వెలిగించి మరొంక కడాయి పెట్టుకుని కొద్దిగా నూనె పోసుకుని వేడెక్కాక అందులో కరివేపాకు, వేయించిన ఆలూ,పైన చెప్పుకొన్న మసాలా పొడులు వేసి రెండు నిమిషాలు వేయించుకుంటే చట్‌పటా ఆలూ సిద్ధం.

## ప్రాన్ 65 ..



**కావాల్సినవి :** రొయ్యలు-250 గ్రా, పసుపు-పావుచెంచా, మిరియాలపొడి-పావుచెంచా, జీలకర్రపొడి-అరచెంచా, ఉప్పు-తగినం, ధనియాల పొడి-చెంచా, కారం-చెంచా, మొక్కజొన్న పిండి-చెంచా, సెనగపిండి-చెంచా, బియ్యప్పిండి-చెంచా, కరివేపాకు-రెబ్బ, నిమ్మరసం-చెంచా, నూనె తగినంత. **తయారీ :** పసుపు వేసి రొయ్యల్ని శుభ్రం చేసుకోవాలి. గిన్నెలో రొయ్యలు, మసాలా పొడులు, పిండ్లు వేసి రొయ్యలకు బాగా పట్టించాలి.



చివరిగా నిమ్మరసం, ఉప్పువేసి మరో కలపాలి. ఈ మసాలా పట్టించిన రొయ్యలని ఒక్కోటిగా నూనెలో వేయించుకుంటే ప్రాన్ 65 సిద్ధం.

## క్రిస్పీ కార్న్..



**కావాల్సినవి :** స్వీట్‌కార్న్-కప్పు, మైదా-రెండు చెంచాలు, మిరియాలపొడి-అరచెంచా, వెల్లుల్లి పలుకులు-అరచెంచా, ఉప్పు-తగినంత, నూనె-వేయించడానికి సరిపడ, టాంపరింగ్ కోసం: నూనె-రెండు చెంచాలు, వెల్లుల్లి రెబ్బలు-మూడు, పచ్చిమిర్చి- రెండు, ఉల్లికాడల తరుగు-పావుకప్పు, టొమాటోసాస్-పావుకప్పు, చిల్లీసాస్-చెంచా, సన్నగా తరిగిన క్యాప్సికమ్ ముక్కలు-పావు కప్పు, వెనిగర్-చెంచా, సోయాసాస్-చెంచా, ఉప్పు-తగినంత.

**తయారీ :** ఒక పాత్రలో మొక్కజొన్న పిండి, మైదా, ఉప్పు, మిరియాలపొడి చెంచాన్నర నీళ్లు పోసి కలిపి అందులో మొక్కజొన్న గింజల్ని కలిపి.. డిప్ ఫ్రై చేసుకోవాలి. ఎక్కువగా ఉన్న నూనె పీల్చుకొనేందుకు ఒక టిష్యూ పేపర్‌పై వేసుకోవాలి. వేరే కడాయిలో.. కొద్దిగా నూనె పోసుకుని వెల్లుల్లి పలుకులు, పచ్చిమిర్చి వేయించుకోవాలి. తర్వాత ఉల్లికాడలు. వీటిని సన్నగా తరిగి ఒక నిమిషం వేయించుకుని.. క్యాప్సికమ్ ముక్కలని వేయించుకోవాలి. ఇందులో టొమాటో సాస్, చిల్లీసాస్, సోయాసాస్, వెనిగర్ వేశాక డీప్‌ఫ్రై చేసి పెట్టుకున్న కార్న్ గింజలు, ఉప్పు వేసి వేయించుకుంటే క్రిస్పీకార్న్ సిద్ధం. □

**భుక్త్వోపా విసస్థాంద్:** ఆహారాన్ని తీసుకున్న తర్వాత ఎప్పుడూ పనిలేకుండా కూర్చో వద్దు. కనీసం 100 అడుగులు అయినా నడవండి.

**క్షుత్ సాధూతం జనయతి:** ఆకలి, ఆహార రుచిని పెంచుతుంది. (ఇంకా చెప్పాలంటే, ఆకలితో ఉన్నప్పుడు మాత్రమే తినండి.)

**సతం విహాయ భోక్తవ్యం:** ఆహారం తీసుకొనే సమయం వచ్చినప్పుడు, ఎంతటి పనినైనా కూడా పక్కన పెట్టండి. నిదానంగా భోజనం చేయండి. వేగంగా తినడం, పని ఉందని అసలు భోజనమే మానివేయడం చాలా అనర్థదాయకం. □

# నెలసరి తెలిస్తేనే సరి !



**అబ్బ! ఏం చెప్పారండి.ఎంత బాధ ఉంటే కానీ మీరలా అనరు. మీరసలే బోల్ట్. అంతే బోల్ట్‌గా మాట్లాడేసారు. అని అందరూ నటి శ్రుతిహాసన్‌ను అభినందిస్తున్నారు. ఇంతకీ ఆమె ఏమన్నారో తెలుసా ! మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుణ్ణు.**

మా కాంట్రాక్టులలో అధికారికంగా 'పీరియడ్స్ సెలవులు' అని రాసేవారేమో" అంటూ ప్రముఖ నటి శ్రుతి హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. మహిళలు ముఖ్యంగా సినీ రంగంలో పనిచేసే వారు పీరియడ్స్ సమయంలో ఎదుర్కొనే శారీరక, మానసిక ఇబ్బందుల గురించి ఆమె బహిరంగంగానే మాట్లాడారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న ఓ పాడ్‌కాస్ట్‌లో శ్రుతిహాసన్ ఎన్నో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మగళ్లకు కూడా 'పీరియడ్స్' ఉంటే వాళ్లకీ కష్టాలు తెలుస్తాయి. అన్న ధోరణిలో ఆమె మాట్లాడిన మాటలు ఎంతో సానుభూతిగా తీసుకున్నారు. తాను పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) అనే ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నానని, దీనివల్ల పీరియడ్స్ సమయంలో తీవ్రమైన నొప్పి వలన అసౌకర్యంగా ఉండేదా న్నని అన్నారు. . కెరీర్ తొలినాళ్లలో షూటింగ్ సెట్‌లో ఈ నొప్పి గురించి ఎవరితోనూ చెప్పుకోలేక పోయానని గుర్తు చేసుకు న్నారు. ఒకవైపు ఈ అంశంపై మాట్లాడటం నిషిద్ధం అని భావించడం, మరోవైపు ఇబ్బందిగా ఉండటంతో మౌనంగా భరించ దాన్నని తెలిపారు. "కొన్ని రోజులు నేను చాలా నీరసంగా కనిపించేదాన్ని. నా ఎనర్జీ లెవెల్స్ పడిపోయేవి. కానీ, దర్శకులుగానీ, ఇతరులుగానీ నాలో ఆ మార్పును గమనించినా అసలు కారణం వారికి తెలిసేది కాదు" అని శ్రుతి వివరించారు. అయితే, ఓ సంఘటన తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసిందని శ్రుతి తెలిపారు. తన సహనటు మోకాలికి సర్జరీ అయినప్పుడు, షూటింగ్ సిబ్బంది మొత్తం అతనికి అనుకూలంగా ఏర్పాట్లు చేసి,చాలా జాగ్రత్తగా చూసుకున్నారని చెప్పారు. అది చూశాక, తన ఆరోగ్య సమస్య గురించి కూడా ధైర్యంగా చెబితే సహకరిస్తారనే ధోకణిలో చెప్పగలిగేదాన్నని అన్నారు. ఆ తర్వాత మొదటిసారి ఓ దర్శకుడికి తన ఆరోగ్య పరిస్థితిని వివరించానని, ఆయనకు కూడా కూతురు ఉండటంతో తన బాధను వెంటనే అర్థం చేసుకున్నారని శ్రుతి గుర్తుచేసు కున్నారు. "ఆయన సానుకూల స్పందనతో మా మధ్య సంభాషణ తీరే మారిపోయింది. సెట్‌లో వాతావరణం మరింత స్నేహపూర్వకంగా మారింది. ఆ తర్వాత నుంచి నా ఇబ్బందిని ధైర్యంగా చెప్పగలుగుతున్నాను" అని ఆమె పేర్కొన్నారు.శ్రుతి వ్యాఖ్యలకు సోహా అలీఖాన్ కూడా మద్దతు తెలిపారు. □

## ఆది దైవం

**మానవ లోకంలో, మనుషులకు సాధారణంగా** ఎదురయ్యే ఆటంకాలను అడ్డుకుంటూ, నిర్విఘ్నంగా జీవితం సాగాలంటే, గణాధిపతి అయిన గణపతే శరణ్యం ఏ పుణ్యకార్యాలు జరిగినా పూజలు ఉన్నా మొదటగా, అర్చించబడే దేవుడు వినాయకుడు. ఏటేటా వినాయక చతుర్థి జరగని చోటు ఉండదు. ఉత్సవాలతో, ఊరేగింపులతో, తొమ్మిదిరోజులు గణపతి నవరాత్రులను నిర్వహణలతో, ఆటపాటలతో మారుమ్రోగుతూ, కళాకారుల సందళ్ళతో వినాయక చవితి పందిళ్ళు కలకలాడుతూ, భక్తులందరికీ కనువిందు చేస్తాయి. వ్రతాలు, వివాహాలు మొదలుగా ప్రతి ఇంటి పండుగల్లో, ప్రాతినిధ్యం వహిస్తూ వారి వారికోరికలను తీర్చే ఆది దైవం వినాయకుడు ఆయనే లంబోదరుడు. తల్లియైన పార్వతి చేసిన పసుపు ముద్దతో రూపుదిద్దుకున్న బాలుడు, తండ్రిని అడ్డుకున్న ఆగ్రహానికి గురై తదుపరి ఏనుగు తలతో గుజ్జు రూపంతో, ఎలుక వాహనంగా, అవతరించి అందరినీ ఆదుకునే గజముఖుడిగా, నవగ్రహాధి పతిగా నిలిచి, నీరాజనాలు అందుకునే, ప్రథముడే గణేశుడు. పార్వతీ పరమేశ్వ రులు కుమారులైన కుమారస్వామిని, వినాయకుడిని, త్రిలోక ప్రదక్షిణచేసే పరీక్షలో, తెలివిగా సోదరుడితో ఎదురైన పోటీలో, తల్లిదండ్రుల చుట్టూ మూడుసార్లు తిరిగి గెలిచి సకల గణాధిపతిగా, ఆధిక్యం పొందిన విజయుడు వినాయకుడు. ప్రపంచంలో మాతాపిత రులను సేవిస్తే దొరికే ఫలితాలు, ఎలా ఉంటాయో, వినాయకుడి ఈ చరిత్ర వింటే అర్థం అవుతుంది. తనను చూసి వికటంగా హేళనగా నవ్విన చంద్రుడికి, కోపంతో శపించిన తల్లి కారణంగా చవితినాడు చంద్రుడిని చూసిన వారు నీలాపనిందలకు గురికాగ లరని, గణపతి పూజచేసి ఆయనను చూస్తే ఆ ఆపద ఉండదని వినాయక వ్రతకథలో విశదంగా వివరంగా అందరికీ తెలుస్తుంది. పాలలో చంద్రుడిని చూసిన దోషానికి శ్రీకృష్ణుడు, శమంతకమణిని ఆపహరించిన వాడిగా, నీలా పనిందపాలనడం, తదుపరి మణిని తెచ్చినిందను బాపుకున్న వైనం విని, కృష్ణుడికి సాధ్యమయిన విషయం సామాన్యులకు ఎలా అని వేడుకొనగా పార్వతీదేవి వినాయక చవితపూజానంతరం , ఆయన కథ చదివి అక్షింతలు వేసుకుని చంద్రుడిని చూస్తే నీలాపనిందలు తొలగిపోతాయని అభయంతో అనుగ్రహిస్తుంది. □

# తెర

## 'ది ప్యారడైజ్' ఎంజాయ్ చేస్తారు: నాని



న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుద లైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ప్రెస్ మీట్‌లో న్యాచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. బెంగళూరు ఎప్పుడు వచ్చినా సరే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడ ప్రేక్షకులు ఎంతగానో ప్రేమ, ఆదరణ చూపిస్తారు. ప్రేక్షకుల ప్రేమ, ఆదరణ కు నేను ఎప్పుడూ కృతజ్ఞులు ఉంటాను. ప్యారడైజ్ నా కెరీర్‌లో చాలా ప్రతిష్టాత్మక చిత్రం. నా కెరీర్‌లో ఎక్కువ రోజులు షూటింగ్ చేసిన సినిమా ఇదే. గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నాం. ఇందులో ఉండే హై మూమెంట్స్ అన్నీ కూడా మీరు ఎంజాయ్ చేస్తారు. ఇందులో ఉండే ఎమోషన్ మీ అందరినీ కదిలిస్తుంది. కొన్ని యాక్షన్ ఎపిసోడ్స్ ఒక స్పెక్టక్యులర్‌గా ఉంటాయి. ప్యారడైజ్ ఒక తల్లి, కొడుకుల కథ. కన్నడలో నా క్యారెక్టర్‌కు దీక్షిత్ డబ్బింగ్ చెప్పాడు. తను నటుడిగా చాలా బిజీగా ఉన్నప్పటికీ మా అందరి మీద ప్రేమతో వచ్చి డబ్బింగ్ చెప్పాడు

## 'సంగీత్'నుంచి తొలిపాట 'నీ వల్లే' విడుదల



తన సామాజిక మాధ్యమం ఖాతా అయిన 'ఎక్స్' ద్వారా చిత్ర గీతాన్ని విడుదల చేసిన ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహ్మాన్.అచు రాజామణి మెలోడీకి విక్రమ్ శివ హృద్యమైన సాహిత్యం.. నిఖిల్ విజయేంద్ర సింహా, తేజు అశ్విని జంటను పరిచయం చేసిన అందమైన ప్రేమగీతం ఇది. యువతను ఆకట్టుకునే ప్రేమకథా చిత్రంగా తెరకెక్కుతున్న సంగీత్ నుంచి తొలి పాట నీ వల్లే విడుదలైంది. సంగీత ప్రపంచంలో తనదైన ప్రత్యేకతను చాటుకున్న సిద్ శ్రీరామ్ గాత్రం, ప్రముఖ సంగీత దర్శకుడు అచు రాజామణి అందించిన మధురమైన స్వరాలతో 'నీ వల్లే' ఒక హృద్యమైన రొమాంటిక్ మెలోడీగా రూపుదిద్దుకుంది. విక్రమ్ శివ ఈ పాటకు సాహిత్యాన్ని అందించారు.నిఖిల్ విజయేంద్ర సింహా, తేజు అశ్విని మధ్య ప్రేమను, వారి కెమిస్ట్రీని పరిచయం చేసేలా ఈ పాటను చిత్రీకరించారు. లహరి ఫిల్మ్స్ - ఆర్‌బీ స్టూడియోస్ సంయుక్తంగా 'సంగీత్' 'రైటర్ పద్మభూషణ్, 'మెమ్ ఫేమస్' వంటి చిత్రాలతో తెలుగు సినిమాపై తనదైన ముద్ర వేసిన లహరి ఫిల్మ్స్.. భారతీయ సినిమా సంగీతంతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని కొనసాగిస్తూ సంగీత్‌తో మరో ఆసక్తికరమైన తెలుగు చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, శ్రవంతి నవీన్ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, మాజ్ ఖాన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.సంగీత్‌తో హీరోగా నిఖిల్ విజయేంద్ర సింహా పరిచయం కన్నడలో తెరకెక్కిన 'హంబుల్ పొలిటీషియన్ నోగ్రాజ్' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు పొందిన సాద్ ఖాన్ 'సంగీత్'కు దర్శకత్వం వహిస్తున్నారు. నిఖిల్, తేజు జంటలోని ఫ్రెష్‌నెస్ 'సంగీత్'కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. తాజాగా విడుదలైన నీ వల్లే పాట వారి మధ్య ప్రేమ, కెమిస్ట్రీని ప్రేక్షకులకు పరిచయం చేస్తోంది.

## 'హ్యాపీ జర్నీ'కి అద్భుతమైన రెస్పాన్స్: ఝాన్సీ



అన్నపూర్ణమ్మ, ఆమని, ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రలు పోషించిన లేటెస్ట్ హిట్ హ్యాపీ జర్నీ. జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా, పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై బాలాజీ గుత్తా, కౌశిక్‌రెడ్డి నిర్మించారు. అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అయ్యారు. తరుణ్ రెడ్డి సహ నిర్మాత. ప్రెస్ మీట్ లో ఝాన్సీ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా ఇంకా చూడకపోతే వెంటనే వెళ్లి చూడండి. చాలా మంచి సినిమా చేశాం. మీరందరూ తప్పకుండా చూడాలి. ఎడిటర్ గారు ఈ సినిమా ఫస్ట్ కాపీ చూసి తప్పకుండా హిట్ కొడుతుందని చెప్పారు. అదే నిజమైంది. సినిమాకి ఆవుపట్టు వంశీ నటన. ఇందులో నవ్వులు, ఎమోషన్స్ అన్నీ ఉన్నాయి. వంశీ అన్నీ చేశాడు. మా పాత్రలన్నీ ఇతనే నడిపించాడు. పాయల్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఈ సినిమాని నా పేరెంట్స్‌తో కలిసి చూడడం చాలా ఆనందాన్నిచ్చింది. చూసిన ఆడియన్స్ అందరూ కూడా చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఇస్తున్నారు.డైరెక్టర్ అభిరామ్ మాట్లాడుతూ..సినిమాకి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. నేను అమ్మాయిల నుంచి ఎక్కువ రెస్పాన్స్ వస్తుందని ఎక్స్‌పెక్ట్ చేశాను. అబ్బాయిల నుంచి ఊహించని రెస్పాన్స్ వస్తోంది. మా ఫ్యామిలీతో కలిసి వెళ్లామ్ము అని చెప్తున్నారు. వంశీ మాట్లాడుతూ.. ఆడియన్స్ చాలా పాజిటివ్ రెస్పాన్స్ ఇస్తున్నారు. సినిమా చూసిన వాళ్లందరూ కూడా చాలా ఎంజాయ్ చేస్తున్నారు. సునైనా మాట్లాడుతూ..నటిగా అన్ని రకాల పాత్రలు చేయాలని ఉంటుంది. ఒక మంచి క్యారెక్టర్ చేయాలని ఎదురుచూస్తున్న సమయంలో హ్యాపీ జర్నీ వచ్చింది. సినిమాని ఓవర్సీస్‌లో షూట్ చేశాను.


## ఆ హాలీవుడ్ రీమేక్‌లో ఉచితంగానైనా నటిస్తా: విజయ్ సేతుపతి



విలక్షణ నటనతో దక్షిణ భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి' తన రాబోయే చిత్రాలు, హాలీవుడ్ రీమేక్ ఆఫర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల దర్శకుడు నిథిలన్ స్వామి నాథన్ తనకు 'మహారాజా 2' కథను వినిపించారని, ఆ కథ వినగానే తనకు ఎంతగానో నచ్చిందని వెల్లడించారు. 'మహారాజా' మొదటి భాగం విడుదల కాకముందు కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, తాను మాత్రం సినిమా విజయంపై గట్టి నమ్మకంతో ఉన్నానని గుర్తుచేసుకున్నారు.అంతే కాకుండా, మహారాజా సినిమాకు సంబంధించి ఇటీవల హాలీవుడ్ నుంచి ఒక భారీ సర్ ప్రైజ్ వచ్చిందని విజయ్ సేతుపతి తెలిపారు. ఈ సినిమా రీమేక్ హక్కులను హాలీవుడ్ సంస్థ దక్కించుకుందని, అందులో ప్రముఖ హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కొనాహే నటించబోతున్నారని నిర్మాత తనకు ఫోన్ చేసి చెప్పినట్లు వివరించారు. ఈ వార్త విన్నవెంటనే తాను ఎంతో థ్రిల్ అయ్యానని... ఆ హాలీవుడ్ రీమేక్‌లో నాకు ఒక చిన్న పాత్ర ఇప్పించండి. ఉచితంగా నటిస్తాను అని నిర్మాతతో సరదాగా అన్నట్లు పంచుకున్నారు. మొదటి నుంచి హాలీవుడ్‌లో నటించాలనే కోరిక ఉందని, తన

## 'పిక్ నిక్' ఫస్ట్ లుక్ రిలీజ్

బెత్లహేమ్ కుటుంబ యూనిట్ తో భారీ గ్లోబల్ సక్సెస్‌ను అందుకున్న ప్రముఖ నిర్మాణ సంస్థ భావన స్టూడియోస్ తమ కొత్త సినిమాను ప్రకటించింది. 'పిక్ నిక్' ఫస్ట్ లుక్ రిలీజ్ 'పిక్ నిక్' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రంలో సందీప్ ప్రదీప్, ఇంద్రజిత్ సుకుమారన్, దిలీష్ పోతన్ ప్రధాన పాత్రల్లో నటిస్తు న్నారు. ఫ్యామిలీ కామెడీ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా 2027 జనవరి 14న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవు తోంది. 'ప్రేమలు', బెత్లహేమ్ కుటుంబ యూనిట్ విజయాల తర్వాత భవానా స్టూడియోస్ నుంచి వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే సౌత్ ఇండియాలో మంచి బజ్ ఏర్పడింది.ఈ సినిమాతో రచయిత కిరణ్ జోసీ



దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సెన్సేషనల్ హిట్స్ 'ప్రేమలు', 'బెత్లహేమ్ కుటుంబ యూనిట్' చిత్రాలకు కో రైటర్‌గా పనిచేసిన కిరణ్ జోసీ.. కేరళతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయన గత రచనలకు మంచి ఆదరణ లభించడంతో.. దర్శకుడిగా ఆయన తొలి సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. భవానా స్టూడియోస్ సినిమాలకు సౌత్ ఇండియా వ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని.. పిక్నిక్‌ను మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సినిమాకు భారీ థియేట్రికల్ రిలీజ్ అందించేందుకు ప్రముఖ ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ సంస్థ షోయింగ్ బిజినెస్ భాగస్వామిగా చేరింది.

## 'హాతః' చిత్రం టీజర్ లాంచ్



నవంబర్ 6న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న 'హాతః' సినిమాపౌర్ణమి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌తో కలిసి హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్ లో నిర్మిస్తున్న సినిమా 'హాతః'. ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్ప ణలో శివశంకర నాయుడు. వై నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్నారు. "హాతః' సినిమాలో కుష్లు, రెహమాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టుస్వామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎడిటర్ అఖిల్ చక్రవర్తి మాట్లాడుతూ మా మూవీ టీజర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. "అసోసియేట్ ప్రొడ్యూసర్ రితికేష్ గోరక్ మాట్లాడుతూ 'హాతః' సినిమా కంటెంట్ పట్ల గర్వపడుతున్నాం. రెగ్యులర్ గా మనం చూసే సినిమాలకు భిన్నమైన ఒక ప్రయత్నం ఈ చిత్రంతో చేశాం. ప్రొడ్యూసర్ శివశంకర నాయుడు.వై. మాట్లాడుతూ ఈ సినిమా వెనక పెద్ద జర్నీ ఉంది. మా మూవీకి అండగా నిలబడిన కిరణ్‌కి థ్యాంక్స్. చాలా సినిమాలకు నేపథ్యంగా ప్రాంతం, సంప్రదాయం, పురణాల నుంచే రిఫరెన్స్ పాయింట్స్ ఉంటాయి. స్క్రిప్ట్ రైటర్, డీవోపీ, డైరెక్టర్ అనుష్ గోరక్ మాట్లాడుతూ 'హాతః'మూవీ టీజర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను.నటి తనూజ పుట్టుస్వామి మాట్లాడుతూ మనం మూవీస్ కు కథ ఇలా ఉంది అలా ఉంది అని చెప్పుకుంటూ ఉంటాం. కానీ ఈ సినిమా కథను చెప్పడం కంటే స్క్రీన్ మీద చూస్తేనే బాగుంటుంది. కో ప్రొడ్యూసర్, యాక్టర్ కుష్లు మాట్లాడుతూ మా టీమ్ అంతా కలిసి ఒక మంచి సినిమా చేశాం. మీకు తప్పకుండా నచ్చుతుందని నమ్ముతు న్నాం. ప్రొడ్యూసర్ కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఈ సినిమా మాకు ఒక స్పెషల్ ఫిలిం అవుతుందని నమ్ముతున్నాను. మా సినిమా రిలీజ్ కు ఇంకా 50 రోజుల టైమ్ ఉంది.

20-9Pg8exHMNWJQE:20-9Pg8exHMNWJQE.qxd 9/20/2026 12:03 AM Page 1



# కోనలో నృసింహుని దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు

- వైభవంగా నృసింహుని కళ్యాణోత్సవం

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచల కోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహా స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తు లతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరు కోని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వైభవం గా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేదమం త్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్స వం, గిరిజన వాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి కి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు, క్యూలైన్లలో భక్తులకు మంచి నీరు, మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఇన్‌చార్జ్ ఇఓ జనార్ధన్ రెడ్డి పర్యవేక్షిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ప్రధానా ర్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, రవి స్వామి, వేద పండితులు త్రినాథ్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, దేవస్థానం సిబ్బంది తదితరులున్నారు.

# కృష్ణపట్నంలో రూ.23 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

- కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలోనే ఈ ప్రగతి
- సర్వేపల్లి శాసన సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**నెల్లూరు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో రూ.5.65 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కృష్ణపట్నం తుఫాన్ షెల్టర్ సమీపంలో వేడుకగా సాగిన నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ, రూ.4.21 కోట్లతో చేపట్టిన 33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన రూ.1.40 కోట్లతో ఆర్డీఎస్ఎస్‌లో పూర్తి చేసిన త్రీఫేజ్ విద్యుత్ లైన్ల ప్రారంభోత్సవం రూ.42 లక్షలతో పూర్తి చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభించారు. మండల తెలుగు యువత అధ్యక్షులు, స్థానిక టిడిపి నాయకులు రాగల శివకృష్ణ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణపట్నంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెద్దాయన విగ్రహాన్ని ఆవిష్కరించడం నాకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కృష్ణపట్నంలో ఈ ఒక్క రోజే రూ. 5.65 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశానన్నారు. రూ.4.20 కోట్లతో నిర్మించబోతున్న 33 కేవీ సబ్ స్టేషన్‌తో కృష్ణపట్నంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా కానుందన్నారు. రూ.1.40 కోట్లతో ఆర్డీఎస్ఎస్‌లో భాగంగా పూర్తి చేసిన త్రీఫేజ్ విద్యుత్ లైన్లతో పంచాయతీ పరిధిలో లోఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లయిందన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం అందుబాటులోకి రావడంతో ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో కృష్ణపట్నం పంచాయతీ పరిధిలో సుమారు రూ.11.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, రూ.11.65 కోట్లతో సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూర్చాం ప్రజల అవసరాల మేరకు సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, గ్రావెల్ రహదారులు, కల్వర్టులు నిర్మించాం జలజీవన్ మిషన్ లో భాగంగా రూ.95 లక్షలతో రెండు తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణపట్నం పోర్టు సీఎస్ఆర్ నిధులతో అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ పంచాయతీతో పాటు ముత్తుకూరును దత్తత తీసుకుందని, తుఫాన్ షెల్టర్‌ను స్కిల్ డెవలప్మెంట్ సెంటరుగా మార్చి మహిళలకు కుట్టుశిక్షణ అందిస్తోందన్నారు. ఇంటింటికీ నీటి సరఫరా కోసం లక్ష లీటర్ల కెపాసిటీతో మూడు సంపులు నిర్మించింది జెడ్పీ హైస్కూలులో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు నిర్మించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పిస్తోంది చిన్నారులు స్కూలుకు వెళ్లేందుకు వ్యాన్ సౌకర్యం కల్పించారు. పంచాయతీ పారిశుధ్య అవసరాల కోసం రూ.8 లక్షలతో వాహనాలు ఇచ్చారు. రూ.30 లక్షలతో సోలార్ వీధిలైట్లు బిగించడంతో పాటు బయో గ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేసిందన్నారు. దేవాదాయ శాఖ పరిధిలో రూ.2.40 కోట్లతో అర్చకుల నివాసాలు, మాడవీధుల్లో సిమెంట్ రోడ్డు, కళ్యాణ మండపం, ప్రహరీ నిర్మాణాలు చేపట్టారు ఒక్క కృష్ణపట్నం పంచాయతీలోనే కాదు సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి పంచాయతీలోనూ ఇదే విధంగా అభివృద్ధి, సంక్షేమం జరుగుతోంది సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధులను సద్వినియోగం చేసుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాం గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా వ్యవహరించిన పెద్దమనుషులు సీఎస్ఆర్ నిధులను నిర్లక్ష్యం చేసి సొంత లాభాలే చూసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వేపల్లిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి కంపెనీ ఈ ప్రాంతంలోనే సీఎస్ఆర్ నిధులు ఖర్చుచేసేలా కృషి చేస్తున్నామన్నారు. గిరిజన కాలనీల్లో వసతుల కల్పన నుంచి ఆస్పత్రి నిర్మాణం వరకు అనేక పనులను సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్నాం సర్వేపల్లి రిజర్వాయర్‌ను రూ.50 కోట్లతో ఆధునికీకరించబోతున్నామని, సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో రైతుల పర్యవేక్షణలో కాలువల పనులను అత్యంత పారదర్శకంగా చేస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో మాదిరిగా పనులు చేయకుండా ఆఫీసుల్లో కూర్చుని బిల్లులు చేసుకునేందుకు ఎట్టి పరిస్థితుల్లో అవకాశం ఇవ్వబోం గత ప్రభుత్వ హయాంలో చెరువుల్లో రైతుల పేరుతో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వేశారు. ప్యాకేజీల పేరుతో పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారు అప్పట్లో వైసీపీ నాయకుల ఒత్తిడితో అడ్డగోలుగా సంతకాలు పెట్టిన విశ్రాంత అధికారులు ఇప్పుడు బలవుతున్నారు అలాంటి వ్యక్తులు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ బాబుపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, టిడిపి నాయకులు ఈదురు రామ్మోహాన్ రెడ్డి కృష్ణపట్నం దేవస్థానం చైర్మన్ మావుడాల శ్రీనివాసులు, పసుపులేటి గోవిందయ్య, కారం శెట్టి శివరాం, ప్రసాద్, శర్మ, స్థానిక పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ ఎదుట దంపతుల ఆత్మహత్యాయత్నం

**విజయవాడ, సెప్టెంబరు 19, ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ ఎదుట గత రాత్రి దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం దంపతులు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన పై కేసు నమోదైంది. ఈ అంశంలో పోలీసు ప్రమేయంపై విజయవాడ సీపీ విచారణకు ఆదేశించారు. ఇదే సందర్భంలె దంపతుల ఆత్మహత్యాయత్ర ఘటనలో బంగారం, ఆస్తుల వివాదంలో పోలీసుల ఒత్తిడే కారణమని బాధితుల కుటుంబ సభ్యులు అభియోగించారు. పటమటకు చెందిన నెల్లూరు వాసు, భార్య వెంకటగీత, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌కు చెందిన పృథ్వీరాజ్‌తో కలిసి వాసు చిట్టీల వ్యాపారం నిర్వహించారు. వ్యాపారంలో భారీ నష్టాలు రావడంతో పృథ్వీరాజ్‌కి వాసు బాకీ పడ్డాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. దీంతో పృథ్వీరాజ్ నగదు ఇవ్వాలని తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చాడని, అతను సూచించిన వ్యక్తుల పేర్లపై కుటుంబానికి చెందిన పలు ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. ఇంకా బాకీ ఉందని, దానిని చెల్లించాలని తాజాగా ఒత్తిడి చేయడంతో ఆత్మహత్యకు యత్నించారు. వాసు మామయ్య సురేంద్ర ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ . వాసు నుంచి నుంచి తన స్నేహితుడు రాజారావు కొన్ని ఆభరణాలు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వకపోవడంతో పటమట స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు రికవరీ చేశారు. దాని విలువ రూ.48 లక్షలు. ఇది పోలీసుల ఆధీనంలో ఉంది. శుక్రవారం సాయంత్రం వాసుకు సెంట్రల్ ఏసీపీ దామోదర్ ఫోన్ చేసి తన కార్యా లయానికి పిలిపించారు. అప్పు చేసి చెల్లించకుండా తిరుగుతున్నావు ఏంటి ఆ బంగారాన్ని పృథ్వీ రాజుకు రాత్రి 7.30 గంటల్లోపు ఇవ్వాలని బెదిరించారు. దీంతో రాత్రి సుమారు 8.30 గంటలకు వాసు తన భార్య వెంకట గీత, ఇద్దరు పిల్లలతో కలిసి పటమట పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి వాసు, గీత పురుగుల మందు తాగారని" సురేంద్ర తెలిపారు.

# దసరా ఉత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్



**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో 2026 దసరా ఉత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ గా ప్రభుత్వం నియమించిన దేవాదాయశాఖ అదనపు కమిషనర్ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ శనివారం ఉదయం ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ ఆరంభం నుండి క్యూ లైన్లు పరిశీలన చేశారు. ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎల్.రమాదేవి, బి. రాంబాబు, డివి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. దసరా ఉత్సవాల్లో క్యూ లైన్ల సంఖ్య, ఎగ్జిట్ గేట్స్ ఉండే ప్రాంతాలు, పూజలు జరిగే ప్రదేశం దారి తదితర ప్రదేశాలు పరిశీలన చేశారు. నూతన అన్న ప్రసాద భవనం పరిశీలించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:**
దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నధానవిభాగమునకు విజయవాడకు చెందిన ఎస్ అంజమ్మ రూ.1,00,000లు విరాళమును చైర్మన్ బుర్ర రాధాకృష్ణకు శనివారం అందించారు. హైదరాబాద్‌కు చెందిన కుక్కుడాల ధీరజ్ రూ.1,00,000లు విరాళాన్ని ఆలయ అర్చకులకు అందజేశారు.

**నకిలీ దసరా పూజా టికెట్ల పట్ల పై సిపికి ఫిర్యాదు:**
దుర్గమ్మవారి ఆలయంలో నకిలీ దసరా టికెట్లు విక్రయిస్తున్న వ్యవహారంలో ఇఓ వికె శీనా నాయక్ శనివారం విజయవాడ సిపి రాజశేఖర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈనెల 16న కావలికి చెందిన ఒక మహిళా భక్తురాలు దసరా ఉత్సవాల్లో 18-10-2026 నాటి రూ.3,500/ విలువ గల ఆఫ్‌లైన్ శ్రీ చక్రార్చన టికెట్‌ను కొనుగోలు చేసానని, టికెట్‌పై అనుమానం కలిగిందని ధృవీకరణ కోసం దేవస్థానం ఐటి విభాగంను సంప్రదించగా దేవస్థానం నుండి దసరా ఉత్సవాలు కోసం ఇంకా ఎలాంటి ఆన్‌లైన్ కోటా విడుదల చేయలేదని ఆఫ్‌లైన్ టికెట్ అమ్మకాలు లేవని ఆ భక్తురాలికి ఐటి విభాగం నిర్ధారించి వెంటనే ఆ విషయం ఈవో దృష్టిలో ఉంచారు. సదరు మహిళ ఒక తెలిసిన వ్యక్తి ద్వారా ఆలయ ప్రాంగణంలో ఉండే శర్మ అనే వ్యక్తి నుండి ఈ టికెట్ కొనుగోలు చేసినట్లు అతని పూర్తి వివరాలు తెలియవని ఆమె తెలియజేశారు. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన ఇఓ వికె శీనా నాయక్ పాత పూజా టికెట్‌ను తేదీ వివరాలు మార్చినట్లుగా గుర్తించి భక్తులను మోసం చేస్తున్న ఈ నకిలీ టికెట్ల ముఠాపై సమగ్ర విచారణ జరిపి ఈ వ్యవహారంలో ఉన్న వ్యక్తులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్న వారి తీవ్ర చర్యలు తీసుకోవాలని ఈరోజు మధ్యాహ్నం పోలీస్ కమిషనర్‌ని కలిసి పిర్యాదు చేశారు.

**భక్తులు అప్రమత్తంగా ఉండాలి** దసరా నవరాత్రుల పేరిట నకిలీ పూజా టికెట్ల విక్రయాల పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఈవో వి.కె.శీనా నాయక్ అన్నారు. దేవస్థానంలో నిర్వహించే అన్ని ఆర్జిత సేవలు, పూజలు, దర్శన టికెట్లు పారదర్శకమైన ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా మాత్రమే జారీ చేస్తామన్నారు. దేవస్థానం అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్ మన మిత్ర, దేవస్థానంలో నిర్దేశించిన కౌంటర్లలో టికెట్లను కొనుగో లు చేయాలని, బయట వ్యక్తులు, దళారుల వద్ద టికెట్లు కొని మోసపోవద్దు అని హెచ్చరించారు. ఎవరైనా దేవస్థానం పేరిట దర్శనం, పూజా టికెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే ఆలయ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించవలసిందిగా కోరారు.



# కృష్ణామిల్క్ యూనియన్ అధ్యక్షుడుగా డాక్టర్ దాసరి బాలవర్ధనరావు

**విజయవాడ, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :**
కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్‌గా గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు పేరును టిడిపి అధిష్టానం ప్రకటించింది. కృష్ణామిల్క్ యూనియన్‌లో చైర్మన్‌గా పనిచేస్తున్న చలసాని ఆంజనేయులు వైసిపి నాయకులతో అంటకాగుతూ పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు రావటంతో టిడిపి అధిష్టానం ఆంజనేయులను ఆగాలని సూచించింది. గత నెలలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ ఎన్నిక జంగాల్సి ఉండగా అధిష్టానం నిర్ణయాన్ని దిక్కరించి ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయాడు. దీంతో సీరియస్ అయిన టిడిపి అధిష్టానం తక్షణం రాజీనామా చేయాల్సిందిగా ఆదేశించింది. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఆంజనేయులుతో చర్చలు జరిపి రాజీనామా చేయించారు. అప్పటి నుండి చైర్మన్ పదవికి ఎవరిపేరు ఖరారు చేయాలేదు. ఈమేరకు దాసరి బాలవర్ధనరావును చైర్మన్‌గా ఎంపికచేసినట్లు జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర శనివారం అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం 15మంది డైరెక్టర్లకు ఆంజనేయులు రాజీనామాతో ఒకడైరెక్టర్ ఖాళీగా ఉండగా ప్రస్తుతం 14మంది డైరెక్టర్లు ఉన్నారు. వీరంతా తెలుగుదేశంపార్టీకి చెందిన వారే కావటంతో 22 వతేదీ విజయవాడలోని పాలఫ్యాక్టరీలో జరిగే బోర్డు సమావేశంలో బాలవర్ధనరావును అధికారికంగా బాలవర్ధనరావును ఎన్నుకోనున్నారు. ఆవెంటనే ఆయన ప్రమాణస్వీకారం చేస్తారు. కాగా బాలవర్ధనరావు టిడిపి నుండి గన్నవరం ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు ఉడా చైర్మన్‌గానూ పనిచేసారు. వివాదరహితులుగా, అవినీతికి మచ్చలేని నాయకుడిగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారు. బాలవర్ధనరావుకు చైర్మన్ పదికి ఇవ్వటంతో టిడిపి శ్రేణులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నాయి.

# రేపు పిఠాపురం జిల్లాకు పవన్

- రూ.1,500 కోట్ల పనులకు శ్రీకారం... రెండు రోజుల పర్యటన..

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 19, ప్రభాత వార్త:** కాకినాడ జిల్లాకి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యా ణ్ సోమవారం రానున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండు రోజుల పర్యటనకు సిద్ధమయ్యారు. రేపు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్న ఆయన.. దాదాపు రూ.1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు చేయనున్నారు. తాగునీరు, మురుగునీటి పారుదల, రహదారులు, ఉప్పాడ, కొత్తపల్లి, పిఠా పురం రూరల్ మండలాల పరిధిలోని 97 వేల మందికి తాగునీరు అందించేలా ఆధునీకరించిన నాగులపల్లి సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని ప్రారంభించనున్నారు. పిఠా పురంపట్టణ తాగునీటి అవసరాలకు అమృత్ 2.0 పథకం కింద చేపట్టే పనులకు కూడా శ్రీకారం చుట్టనున్నారు. గొల్ల ప్రోలు వాట ర్ వర్క్స్ కు ఏఐ ఐబీ నిధులతో రూ.80 కోట్ల పనులు ప్రతిపాదించారు. పిఠాపు రం పట్టణంలో రూ.200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు శంకుస్థాపన చేయను న్నారు. జలజీవన్ మిషన్-అమరజీవి జలధారనిధులతో రూ.307 కోట్ల మల్టీ విలేజ్ తాగునీటి పథకం, సుమారు రూ.100 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు, రూ.118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ.323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటారు సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు సెర్ప్, మెప్మా సహకారంతో స్వయం సహాయక సంఘాలకు రూ.120 కోట్ల రుణాలు అందజేస్తారు. మంగళవారం జరిగే బహిరంగ సభలో నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు.

# మహిళ పట్ల హోంగార్డు అమానుషం

- హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌లో గొడవకు దిగిందని
- జుట్టుపట్టుకుని ఈడ్చుకువెళ్లిన వైనం
- హోంగార్డును డిస్మిస్ చేసిన అధికారులు



**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** శివార్లలోని హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌లో ఒంటరి మహిళపై హోంగార్డు అమానుషంగా ప్రవర్తించిన తీరు పోలీసు శాఖకు తలవంపులు తెచ్చిపెట్టింది. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌లో కొందరు గొడవపడుతు న్నట్లు అందిన సమాచారం మేరకు అక్కడే విధుల్లో వున్న హోంగార్డు కడిగా ఆనంద్ (37) వచ్చాడు. ఈ సమయంలో గుంపులోని ఓ మహిళ హోంగార్డుతో ఎదో విషయమై గొడవకు దిగగా దీనిని సహించని ఆనంద్ ఆ మహిళను లాఠీతో కొట్టి జుట్టు పట్టుకుని కొంతదూరం ఈడ్చుకుని వెళ్లాడు. ఆ సమయంలో ఒక చిన్నారి సదరు మహిళ వెంట ఏడుస్తూ వెంట రావడం కనిపించింది. హోంగార్డు ఆనంద్ మహిళ జుట్టు పట్టుకు ని ఈడ్చుకు పోవడాన్ని పక్కనే వున్న మరో వ్యక్తి నివారించగా అతను వినిపించుకోలేదు. కాగా హోంగార్డు ఆనంద్ దాష్టికాన్ని అక్కడే వున్న కొం దరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో వుంచారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇది వైరల్‌గా మారడంతో దీనిపై మియాపూ ర్ పోలీసులు వెంటనే స్పందించి మహిళ పట్ల అమానుషంగా ప్రవర్తించిన హోంగార్డు ఆనంద్‌పై పలు సెక్షన్ల కింద సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. ఇదే సమయంలో హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌లో డిప్యూటేషన్‌పై విధుల్లో వున్న హోంగార్డు ఆనంద్‌ను రైల్వే శాఖ వెంట నే రిలీవ్ చేసింది. ఇతను వికారాబాద్ జిల్లాకు చెందిన హోంగార్డు కావడంతో అక్కడకు పంపించారు. హోంగార్డు దాష్టికం శనివారం ఉదయం మరింతగా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దీనిపై సైబరాబాద్ కమిషనర్ రమేష్ రెడ్డి స్పందించి వీడియో విడుదల చేశారు. మహిళపట్ల అమానుషంగా ప్రవర్తించిన హోంగార్డు ఆనంద్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించిన ట్లు ఆయన తెలిపారు. మరోవైపు హోంగార్డు ఆనంద్‌ను వికారాబాద్ జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారు. ఇదే ఉదంతంపై డిజిపి ఆనంద్ ట్విటర్‌లో స్పందించారు. మహిళపట్ల అమానుషంగా ప్రవర్తించిన హోంగార్డు ఆనంద్‌పై చట్టపరంగా కఠిన చర్యలు వుంటా యని తెలిపారు. అతన్ని ఉద్యోగం నుంచి తొలగించామని వివరించారు. కాగా ఈ ఘటనలో బాధిత మహిళ ఎవరన్నది ఇంతవరకు తెలియరాలే దు. హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ సమీపంలో చెత్త ఏరుకునే వారిలో ఒకరుగా స్థానికులు చెబుతున్నారు. ఆమె కోసం మియాపూర్ పోలీసులు గాలి స్తున్నారు. ఆమె ఆచూకి తెలుసుకుని ఫిర్యాదు తీసుకునేందుకు మియాపూర్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# ఎన్నో యేళ్ళ కల, కష్టం ఫలితమే ఉపాధ్యాయ ఉద్యోగం



**హనుమాన్‌జంక్షన్ (కృష్ణా), సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** ఎన్నో ఎళ్ళ కలలకు పట్టుదల తోడై కష్టపడిన ఫలితంగా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించామని, తమ కష్టాన్ని అసత్యప్రచారాలతో అవమాన పరచటం దారుణమని మెగా డిఎస్సీలో ఉద్యోగం పొందిన ఇరువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేసారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం ఎస్.ఎన్.పాలెం గ్రామానికి చెందిన సొదిమెళ్ల సత్యన్నారాయణ, పసగడి రమేష్‌లు ప్రయివేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల నిర్వహించిన మెగా డిఎస్సీలో ఉద్యోగం పొంది ఇద్దరూ ఇదే మండలంలోని వీరవల్లి పాఠశాల్లో ఉద్యోగంలో చేరారు. శుక్రవారం వీరి ఇంటివద్దకు వెళ్ళిన ప్రభుత్వ విప్, యార్లగడ్డ వెంకట్రావ్ వీరిద్దరినీ శాలువాలతో సత్కరించి, వీరిద్దరి కుటుంబనేపథ్యం తెలుసుకుని వారితో ముచ్చటించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేయాలని ఎన్నో ఎళ్లుగా ప్రయత్నిస్తున్నామని, తమ ప్రయత్నాలు ఇటీవల నిర్వహించిన డిఎస్సీలో ఫలించాయన్నారు. తాము ఇద్దరం పేదరికంలో ఉన్నామని డబ్బులు ఇచ్చి ఉద్యోగం పొందే ఆర్థికస్తోమత తమకు లేదని తేల్చిచెప్పారు. తమ కష్టాన్ని అవమాన పరచటం దారుణమని పేర్కొంటు ఉపాధ్యాయులు కేవలం విద్యార్దులను దారిలో పెట్టడమేకాదని అవసరమైతే శిక్షించటం తెలుసని, ఎవరికి ఏశిక్ష వేయాలో తెలుసని పరోక్షంగా అసత్య ప్రచారాలు చేస్తున్న వైసిపి నాయకులను హెచ్చరించారు. ఈసందర్భంగా విప్ యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ ఏపిపిఎస్సీలో అక్రమాలు బయటపడుతుండటంతో వైసిపి నాయకులు మెగా డిఎస్సీపై అసత్యప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తాము చేసిన అక్రమాలను కప్పిపుచ్చుకోవటానికి అత్యంత పారదర్శకతతో చేపట్టిన డిఎస్సీపై అవాకులు చవాకులు పేలటం సరికాదన్నారు. దమ్ముంటే బహిరంగచర్చకు రమ్మని మంత్రి లోకేష్ చేసిన సవాలుకు ముందుకు రాకుండా ఉపాధ్యాయులును అవమానించటం తగదని హితవు పలికారు. ఇకనైనా వైసిపి నాయకులు బుద్ధితెచ్చుకుని రాష్ట్రఅభివృద్ధికి సలహాలు సూచనలు ఇవ్వాలని యార్లగడ్డ సూచించారు.

# తెలుగు రాష్ట్రాల్లో రూ.2.95 లక్షల కోట్ల మ్యూచువల్ ఫండ్

- అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మ్యూచువల్ ఫండ్ భాగస్వామ్యం పెరుగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కలిసి రూ. 2.95 లక్షల కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్ ఆస్తులను కలిగి ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఎఎమ్ఎఫ్ఐ) శనివారం విడుదల చేసిన డేటాలో వెల్లడించింది. జూలై నాటికి తెలంగాణలోని మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తుల నిర్వహణలో 87 శాతం వాటా హైదరాబాద్‌దే. ఈ డేటా ప్రకారం నగరంలోని మ్యూచువల్ ఫండ్ ఆస్తులు రూ. 1,84,261 కోట్లకు చేరాయి. ఇది జూలై 2025తో పోలిస్తే 18 శాతం అధికం. మ్యూచువల్ ఫండ్ ఆస్తుల విషయంలో భారతదేశంలోని అగ్ర 30 నగరాలలో హైదరాబాద్ ఎనిమిదో స్థానంలో నిలిచింది. దేశ మొత్తం ఆస్తులలో 2.10 శాతం వాటాను కలిగి ఉంది. ఇక్కడ 54.44 లక్షల మ్యూచువల్ ఫండ్ ఫోలియోలు ఉన్నాయి, ఇది తెలంగాణ మొత్తం ఫోలియోల సంఖ్యలో 66.2 శాతంగా ఉంది. తెలంగాణ మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తుల నిర్వహణలో (ఎయుఎమ్) జూలై నాటికి రూ. 2,12,856 కోట్లకు చేరుకుంది, ఇది గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 19 శాతం పెరుగుదల. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాం తాలలో ఈ రాష్ట్రం ఎనిమిదో స్థానంలో నిలిచింది. భారత దేశ మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తులలో 2.5 శాతం వాటాను కలిగి ఉంది. ఈ రాష్ట్రంలో 82.24 లక్షల ఫోలియోలు ఉన్నాయి, ఇది జాతీయ మొత్తంలో సుమారు 2.9 శాతం. జూలై 2026 నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కలిసి రూ. 2.95 లక్షల కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్ ఆస్తులను కలిగి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్ ఫండ్ ఎయుఎమ్ రూ. 82,409 కోట్లుగా నమోదైంది. ఇది జూలై 2025తో పోలిస్తే 23 శాతం పెరుగుదల. ఈ రాష్ట్రం జాతీయంగా 15వ స్థానంలో నిలిచింది. భారతదేశ మ్యూచువల్ ఫండ్ ఆస్తులలో దాదాపు 1 శాతం వాటాను కలిగి ఉంది. దీని ఫోలియోల సంఖ్య 79.44 లక్షలు దాటింది. విశాఖపట్నం రూ. 16,614 కోట్ల ఎయుఎమ్‌తో ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద మ్యూచువల్ ఫండ్ కేంద్రంగా నిలిచింది. ఇది రాష్ట్ర మొత్తం ఎయుఎమ్‌లో దాదాపు ఐదవ వంతు కాగా, రూ. 8,337 కోట్లతో విజయవాడ దాని తర్వాతి స్థానంలో ఉంది.

# చాట్‌జిపిటిలో ప్రశ్నపత్రం అప్‌లోడ్

- పట్టుబడిన విద్యార్థి ఆత్మహత్య



**ముంబై, సెప్టెంబరు 19:** ఐఐటీ ముంబై ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన రెండో సంవత్సరం విద్యార్థి పరీక్ష సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. అతను పరీక్ష ప్రశ్నపత్రాన్ని చాట్‌జిపిటిలో అప్‌లోడ్ చేసి సమాధానాలు పొందేందుకు ప్రయత్నించినట్లు సంస్థ తెలిపింది. అయితే ఈ ఘటనపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోలేదని ఐఐటి బాంబే స్పష్టం చేసింది. ఇన్‌స్ట్రక్టర్, విభాగాధిపతి విద్యార్థితో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారని, ఈ ఘటన అతని విద్యా భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపదని భరోసా ఇచ్చారని సంస్థ వెల్లడించింది. అనంతరం విద్యార్థి హాస్టల్ గదికి వెళ్లగా, అదే రోజు సాయంత్రం అతను మృతి చెందిన స్థితిలో కనిపించాడు. పరీక్ష సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. అనంతరం విద్యార్థి హాస్టల్ గదికి వెళ్లి ఈ ఘటనకు పాల్పడినట్లు తెలిపారు. పోలీసులు దీనిపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటన అనంతరం ఐఐటి బాంబే క్యాంపస్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు నిరసనకు దిగారు. 400 మందికి పైగా విద్యార్థులు సంస్థ ప్రధాన భవనం వద్దకు చేరుకుని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని, పారదర్శకతతో వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల వర్గం మాత్రం ఈ ఘటనకు సంబంధించి తమకు తెలిసిన వివరాలు సంస్థ అధికారిక ప్రకటనకు భిన్నంగా ఉన్నాయని ఆరోపించింది. క్రమశిక్షణా చర్యలు, సస్పెన్షన్ వంటి అంశాలపై విద్యార్థుల్లో భయాందోళనలు నెలకొన్నాయని కొందరు పేర్కొన్నారు. అయితే ఈ వాదనలు స్వతంత్రంగా ధృవీకరించబడలేదు. ఐఐటి బాంబే మాత్రం విద్యార్థిపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ప్రారంభించలేదని స్పష్టం చేసింది.